హైదరాబాద్
శనివారం
10-2-2018
సంపుటి: 2, సంచిక: 72
పేజీలు: 12+16, వెల: రూ. 5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



సిరీస్‌పై గురి

స్పోర్ట్స్‌లో..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



వైమానిక దళాధికారిపై హనీట్రాప్

- పాక్ చేతికి రక్షణ రహస్యాలు
- గ్రూప్ కెప్టెన్ అరుణ్ మర్వాహా అరెస్టు
- ఫేస్‌బుక్ స్నేహం.. వాట్సాప్ చాటింగ్
- అసభ్యకర ఫొటోలు తెప్పించిన అధికారి
- వాటికి బదులు రహస్య పత్రాల అప్పగింత

7లో..

కంది.. రంది

మందగించిన 'ప్రభుత్వ' కొనుగోళ్లు

కొనుగోలుకు కేంద్రం కొర్రీలు

రాష్ట్ర సర్కారుపై భారం

దళారుల చేతుల్లో చిక్కి విలవిలలాడుతున్న రైతులు

కంది రైతుల పరిస్థితిపై 'మనం' ప్రత్యేక కథనం





హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి):

నల్లగొండ జిల్లాకు చెందిన సోమలింగం తాను పండించిన కందులను విక్రయించేందుకు మార్కెట్ యార్డుకు తీసుకెళ్లాడు. కందుల కొనుగోలులో జాప్యమవుతోందన్న అధికారుల మాటలతో మద్దతు ధర కోసం ఎదురు చూసేందుకు సిద్ధమవుతాడు. రోజులు గడుస్తున్నా.. అధికారులు మాత్రం కందులను కొనుగోలు చేయలేదు సరికదా, అక్కడే తిష్టవేసిన దళారులు బెడద ఎక్కువైంది. కందులు విక్రయిస్తే.. వెంటనే నగదు ఇస్తామంటూ సోమలింగం చుట్టూ తిరుగుతున్నారు. ఎంతని అడిగితే.. క్వింటాకు రూ.1500 నుంచి రూ.2 వేలు చెల్లిస్తామనడంతో సదరు రైతు ఎంత లేటయినా.. మార్కెట్‌లోనే మద్దతు ధర పొందాలని భీష్మించుకున్నాడు. 20 రోజుల పాటు నిత్యం మార్కెట్‌కు వచ్చి పోవడమే కానీ కందులు మాత్రం కొనే దిక్కులేదు. ఇంటికాడ పొలం పనులన్నీ పేరుకుపోయాయి. తన భార్య ఒక్కతే మొత్తం నాటు పెట్టిస్తోంది. ఇంకో 10 రోజులు గడిస్తేగానీ కందులు అమ్ముడుపోయేలా లేవు, మరి ఇక్కడే ఉంటే? ఇంటి దగ్గర పనులు అయినట్టే. మరి తరువాత

మిగతా 6లో..



రాహుల్ పప్పు కాదు.. పిప్పి చేస్తాడు!

కేటీఆర్‌ను హెచ్చరించిన జానారెడ్డి

ఆయన వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనం..

ఓటమి భయంతోనే ఇలాంటి మాటలు..

రాహుల్‌పై కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించిన సీఎల్పీ

హైదరాబాదు, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి):


మంత్రి కేటీఆర్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, ఆయన మాటలు అహంకారానికి నిదర్శనమంటూ సీఎల్పీ నాయకుడు జానా రెడ్డి మండిపడ్డారు. ఎదుటి వారిని చులకన చేస్తే, తాము ఉన్నతులం అవుతామనుకోవడం అవివేకమంటూ హితవు పలికిన జానా, సంస్కారం మరచి మాట్లాడి న కేటీఆర్ ప్రజల్లో చులకన

మిగతా 6లో..

టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం లేదు

- కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించడం లేదు
- ప్రజామోదమున్నది కేటీఆర్, హరీశ్, కవితకే
- విలేకరుల ఇష్టాగోష్టిలో మంత్రి తలసాని

ఇదీలోకం!





అందరికీ ఆరోగ్య పరీక్షలు

బోదకాలు బాధితులకు రూ.1000 పింఛన్: కేసీఆర్



మనం ప్రతినిధి, హైదరాబాద్:

గ్రామంలో ఇక నుంచి ప్రజలందరికీ ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు చేయించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర రావు ప్రకటించారు. వైద్యాధికారులు, సిబ్బంది

మిగతా 6లో..

నియోజకవర్గానికో 'అగ్రి' యూనిట్

దేశంలోనే అత్యధికంగా పాలీహౌజ్‌లు.. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం ప్రతినిధి):

రాష్ట్రంలో పంటలకు అనుగుణంగా నియోజకవర్గానికొక అగ్రి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం

మిగతా 6లో..



హైదరాబాద్‌లో అన్నా హజారే 'సందేశ్ సభ'

100 స్వచ్ఛంద సంస్థలతో ఈనెల 17న భారీ సభ

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్) : ప్రముఖ సామాజిక ఉద్యమకారులు అన్నా హజారే ఈ నెల 17న హైదరాబాద్‌కు రానున్నారు. పలు ప్రజాసమస్యలపై పోరాడేందుకు ఢిల్లీలో నిర్వహించనున్న ఆమరణ దీక్షకు

మిగతా 6లో..



వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో శనివారం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. గాలుల తీవ్రత కొనసాగుతుంది. గంటకు 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 33 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు

గాలిలో తేమ: 61 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: దశమి మ.2.45 తదుపరి ఏకాదశి; నక్షత్రం: జ్యేష్ఠ సా.7.50 తదుపరి మూల; వర్జ్యం: తె.4.53-6.41; దుర్ముహూర్తం: ఉ.6.49-8.20; రాహుకాలం: ఉ.9.40-11.05; అమృతఘడియలు: ఉ.10.00-11.47; శుభసమయం: ఉ.11.06-1.00.

సూర్యోదయం: 6.49

సూర్యాస్తమయం: 6.12

రిజిజుపై సభాహక్కుల నోటీసు



నోటీసు ఇచ్చిన ఎంపీ రేణుకా చౌదరి

ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:

కేంద్ర హోం శాఖ సహాయమంత్రి కిరణ్ రిజిజుపై కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ ఎంపీ రేణుకా చౌదరి సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. రాజ్యసభలో తన నవ్వు గురించి ఫేస్‌బుక్‌లో అభ్యంతరకరమైన వీడియోలు పోస్ట్ చేసినందుకు ఆమె ఈ నోటీసు ఇచ్చారు. బుధవారం రాత్రి కిరణ్ రిజిజు 1980ల నాటి రామాయణం సీరియల్లో శూర్పణఖ నవ్వుకు సంబంధించిన వీడియో క్లిప్, ఆ

మిగతా 6లో..

సభా సంఘం నివేదికను అమలు చేయాలి

టీ జేఏసీ చైర్మన్ కోదండరామ్ డిమాండ్



బోధన్ టౌన్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్):

రాష్ట్ర ప్రభుత్వానికి సభా సంఘం అందించిన నివేదికను వెంటనే అమలు చేయాలని టీ జేఏసీ చైర్మన్ కోదండరామ్ డిమాండ్ చేశారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోరుతూ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారానికి పదో రోజుకు చేరింది. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న దీక్షా శిబిరాన్ని కోదండరామ్ శుక్రవారం

మిగతా 6లో..

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

రోడ్డున పడ్డ కుటుంబం.. ఆదుకోవాలని విజ్ఞప్తి



చిన్నగూడూరు, ఫిబ్రవరి 9 (మనం న్యూస్):

అప్పుల బాధ తాళ లేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా చిన్నగూడూరు మండలంలో విస్సంపల్లి గ్రామంలో దళిత సామాజిక వర్గానికి చెందిన పుల్లూరి ఉప్పలయ్య(40) అనే రైతు గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. బంధువులు అతనిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి

మిగతా 6లో..

పాస్ పుస్తకంపై నా ఫోటో వద్దు: సీఎం కేసీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 9: రైతులకు ఇచ్చే కొత్త పాస్ పుస్తకాలపై తన ఫోటో ముద్రించవద్దని సీఎం కేసీఆర్ అధికారులకు సూచించారు. కొత్తగా ఇచ్చే పాస్ పుస్తకాల నమూనాలను శుక్రవారం ప్రగతి భవన్‌లో అధికారులు ముఖ్యమంత్రికి సూచించారు. పంటలకు గుర్తుగా ముదురు ఆకుపచ్చ రంగులో ఉన్న పాస్ పుస్తకాన్ని సీఎం ఎంపిక చేశారు. పాస్‌బుక్ లో ముఖ్యమంత్రి ఫోటో ఉన్న నమూనా లను కూడా అధికారులు చూపించడంతో స్పందించిన సీఎం కేసీఆర్.. ''పాస్ పుస్తకంపై రైతు ఫోటో తప్ప మరెవ్వరి ఫోటో వద్దు. రాజకీయ నాయకుల ఫోటోలు అవసరంలేదు. కేవలం రైతు ఫోటో, తెలంగాణ ప్రభుత్వం ముద్ర మాత్రమే ఉండాలి'' అని స్పష్టంచేశారు.





కేంద్ర మంత్రికి వినతి పత్రం ఇస్తున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి

తెలంగాణకు ఎయిమ్స్ మంజూరు చేయండి

ఆరోగ్య తెలంగాణ సాధనకు మరిన్ని నిధులు కావాలి
కేంద్ర మంత్రితో భేటీలో మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్/మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9(మనంన్యూస్): ఢిల్లీ పార్లమెంట్ హజ్‌హౌజ్‌లో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ జగత్‌ప్రకాశ్ నడ్డాతో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని నిధులు ఇవ్వాలని మంత్రి లక్ష్మారెడ్డి నడ్డాను కోరారు. కల్తీకంట్రోల్ కోసం మరిన్ని నిధులు కేటాయించాలని అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని మంత్రి వివరించారు. ఆరోగ్య తెలంగాణకు మరిన్ని నిధులు కావాలని, ప్రోత్సాహకాలు ఇవ్వాలని కేంద్ర మంత్రిని లక్ష్మారెడ్డి అభ్యర్థించారు. తెలంగాణ రాష్ట్రానికి ఎయిమ్స్ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర మంత్రి నడ్డాను కలిసిన వారిలో మంత్రి లక్ష్మారెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి డాక్టర్ వేణుగోపాలచారి, ఎంపీ జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీతారాంనాయక్ ఉన్నారు.

సింగరేణి సమ్మె వాయిదా

- సమ్మెపై వెనక్కి తగ్గిన కార్మిక సంఘం
- మార్చి 12వరకూ గడువు
- ఇచ్చిన హామీలు నెరవేరిస్తే సరేసరి
- అప్పటికీ స్పందించకపోతే సమ్మె

హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి): సింగరేణి కార్మికులకు సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ నాలుగు జాతీయ కార్మిక సంఘాలు జనవరి 17న సింగరేణి యాజమాన్యానికి సమ్మె నోటీస్ ఇచ్చాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని కేంద్ర కార్మికశాఖ ఉప కమిషనర్ వద్ద శుక్రవారం సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరిగాయి. కార్మిక సంఘాలు ఇచ్చిన డిమాండ్లపై ప్రధానంగా చర్చ జరిగింది. డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఈ నెల 14న తలపెట్టిన సింగరేణి సమ్మెను వాయిదా వేస్తున్నట్టు కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. సమావేశం వివరాలను సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహరావు మీడియాకు వివరించారు. డిపెండెంట్ ఉద్యోగాలపై ప్రధానంగా చర్చించినట్టు తెలిపారు. మెడికల్ బోర్డులో పెండింగ్ ఉన్న దరఖాస్తులపై మాట్లాడామన్నారు. బోర్డులో ఉన్న దరఖాస్తులను పరిశీలించి.. ఫిట్ చేసి.. పదిరోజుల్లో విధుల్లోకి తీసుకునేలా చర్య తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. పేర్ల మార్పు విషయంలో న్యాయపరమైన సమస్యలున్నాయని, గుర్తింపు సంఘంతో జరిగే సమావేశాల్లో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్టుగా తెలిపారు. కార్మికుల క్వార్టర్లకు ఏసీ ఏర్పాటు విషయంలో కూడా స్పష్టత వచ్చినట్లు పేర్కొన్నారు. మొదటి దశలో 20 శాతం క్వార్టర్లకు ఏసీ సౌకర్యం కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. డిమాండ్ల పరిష్కారానికి మార్చి 12 వరకు గడువు పెట్టామని, అప్పటి వరకు యాజమాన్యం నుంచి సరైన సమాధానం లేకపోతే 12న జరిగే చర్చల అనంతరం సమ్మెకు పోతామని అన్నారు. సమావేశంలో కేంద్ర కార్మికశాఖ ఉప కమిషనర్ శ్యాంసుందర్, సింగరేణి తరుపున డైరెక్టర్ (పా) పవిత్రన్, జీఎం పర్సనల్ ఆనందరావ్, మందా నర్సింహరావ్ తదితరులు పాల్గొన్నారు.

రెండేండ్లలో 1.2 లక్షల కోట్ల పెట్టుబడులు

- **హైదరాబాద్‌లో ప్రతీ సదస్సు విజయవంతం**
- **భారత్‌లో యువశక్తి అధికం,ప్రోత్సాహం అవసరం**
- **రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్**
- **క్రెడాయ్ యూత్‌కాన్-2018 కాన్ఫరెన్స్ ప్రారంభం**



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం ప్రతినిధి): పారిశ్రామికాభివృద్ధి కోసం తెలంగాణలో ప్రవేశ పెట్టిన టీఎస్ఐపాస్ విధానం ద్వారా రె ండేండ్లలో ఆరు వేల పరిశ్రమలకు అనుమతులిచ్చి, రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించినట్టు రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. హెచ్ఐసీసీలో శుక్రవారం నిర్వహించిన క్రెడాయ్ యూత్‌కాన్-2018 కాన్ఫరెన్స్‌ను కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇండస్ట్రీయల్ పాలసీని తెలంగాణలో తీసుకొచ్చామన్నారు. 15 రోజుల్లోనే పరిశ్రమలకు అన్ని రకాల అనుమతులిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే ప్రతీ అంతర్జాతీయ సదస్సు విజయవంతమవుతుందన్నారు. యూత్‌కాన్-2018 కూడా సక్సెస్ అవుతుందని పేర్కొన్నారు. స్టార్టప్ నుంచి రియల్ ఎస్టేట్ వరకు ట్రెండ్ సెట్టర్‌గా నిలిచినట్టు పేర్కొన్నారు. భారత్‌లో యువశక్తి ఎక్కువగా ఉందని, రియాల్టీ రంగాన్ని కేంద్రం ప్రోత్సహించాలన్నారు.



ఐటీ సదస్సుకు రాష్ట్రపతికి ఆహ్వానం

ఢిల్లీలో గురువారం కేంద్ర మంత్రులను కలిసిన మంత్రి కేటీఆర్ శుక్రవారం భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు జరిగే ప్రపంచ కాంగ్రెస్ ఐటీ సదస్సుకు రావాలని రాష్ట్రపతిని ఆహ్వానించారు. నాస్కామ్ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన 150 మంది పారిశ్రామిక వేత్తలు పాల్గొంటారు. ఈ సదస్సులో మొత్తం 50 సెషన్లు జరుగుతాయి. మొత్తం 30 దేశాల నుంచి ఆహ్వానితులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు.

ఫాలోయర్స్‌కు మిలియన్ థ్యాంక్స్

తెలంగాణ రాష్ట్ర మంత్రి కేటీఆర్‌కు సామాజిక మాధ్యమాల్లో రోజురోజుకి ఆదరణ పెరుగుతోంది. ప్రముఖ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ట్విట్టర్‌లో కేటీఆర్‌ను ఫాలో అవుతున్న వారి సంఖ్య పది లక్షలకు చేరుకుంది. ఈ సందర్భంగా కేటీఆర్ ఓ ట్వీట్ చేశారు. తనను ఫాలో అవుతున్న నెటిజన్లందరికీ 'మిలియన్ థ్యాంక్స్' చెప్పారు. కేటీఆర్ ట్విట్టర్‌లో చాలా యాక్టివ్‌గా ఉంటారు. రాష్ట్రంలో ఉన్నా వేరే దేశంలో ఉన్నా ఎప్పటికప్పుడు తన చేస్తున్న పనులపై ప్రజలకు ట్విట్టర్ ద్వారా అపడేట్స్ ఇస్తుంటారు. ఆయన సాధించిన విజయాలు, నేర్చుకున్న విషయాలను ప్రజలతో పంచుకుంటారు. ప్రభుత్వ పనితీరును తెలియజేస్తుంటారు. ట్విట్టర్ వేదిక ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరిస్తుంటారు. దీంతో పాటు సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యవంతులు చేస్తుంటారు.



2019 జనవరిలో గజ్వేల్‌కు రైలు

- **పనుల పురోగతిపై హరీశ్ సమీక్ష**

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం ప్రతినిధి): మనోహరాబాద్ కొత్తపల్లి రైల్వే లైను పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి హరీశ్ రావు రైల్వే అధికారులను కోరారు. వచ్చే ఏడాది జనవరికి గజ్వేలకు రైలు నడవాలని అన్నారు. రైల్వే లైన్ ,రైల్వే స్టేషన్ల నిర్మాణం ఇతర పనుల పురోగతిపై హరీశ్‌రావు శుక్రవారం సమీక్షించారు. వచ్చే సంవత్సరం జనవరిలోగా గజ్వేల్‌కు రైలు నడిచే విధంగా పనులు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్ కుమార్ యాదవ్ తెలిపారు. మనోహరాబాద్, కొత్తపల్లి మార్గం, మెదక్-అక్కన్నపేట మార్గంలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని హరీశ్ అధికారులను కోరారు. రామాయంపల్లి దగ్గర రోడ్డు ఓవర్ బ్రిడ్జి, గజ్వేల్ సమీపంలో ఆర్ఓబీ, ఆర్‌యుబి నిర్మిస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. మనోహరబాద్-కొత్తపల్లి రైలు మార్గానికి సంబంధించి భూసేకరణ పూర్తి కావొచ్చినట్టు రైల్వే జీఎం యాదవ్ తెలిపారు. కుకునూరుపల్లి, దుద్దేడ తదితర చోట్ల భూసేకరణ పెండింగ్‌లో ఉందన్నారు. ఫేజ్ 2 కింద గజ్వేల్-సిద్దిపేట పనులు కూడా చేపడుతున్నట్టు రైల్వే అధికారులు తెలియజేశారు. ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ వెంకటరామిరెడ్డి, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టుతో జిల్లా సస్యశ్యామలం

మిషన్ కాకతీయ పనుల్లో ఖమ్మం అగ్రగామి
ఆర్ అండ్ బీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సత్తుపల్లి , ఫిబ్రవరి 9 (మనం న్యూస్): సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అందించి ఖమ్మం జిల్లాను సశ్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జిల్లాలోని పెనుబల్లి మండలం మండాలపాడు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మిషన్‌కాకతీయ పనుల్లో గత 3 దశల్లో ఖమ్మం జిల్లా అగ్రగామిగా నిలిచిందని, నాలుగో దశ పనులను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. పెనుబల్లి మండలంలో 631 ఆయకట్టు ఎకరాలకు రూ. 233.6లక్షలతో 14 చెరువులకు మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. పెనుబల్లి మండలం లంకాసాగర్‌లో రూ.1కోటి 50లక్షల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేశారు. లంకాసాగర్‌లో30 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పెనుబల్లి మండలం కొత్త కారాయిగూడెం నుంచి పాతకారాయిగూడెం వరకు నిర్మించ తలపెట్టిన రోడ్డు పనులను ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అత్యంత ప్రతిష్టాత్మకంగా రైతులకు ఎకరానికి రూ.4వేల చొప్పున రెండు పంటలకు రూ.8వేలు అందించేందుకు చర్యలు చేపట్టారని అన్నారు. మిషన్ భగీరథ పథకం కింద పెనుబల్లి మండలంలో ఇంటింటికి నల్లా ద్వారా మంచినీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గడిప్లిల కవిత , డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఆర్‌అండ్ బీ ఎస్ఈ నరసింహా మూర్తి, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంలేదు

- **కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించడం లేదు**
- **విమర్శలకు ప్రతిపక్షాల వద్ద సరుకులేదు**
- **కేటీఆర్, హరీశ్, కవితలకు ప్రజామోదం..**
- **విలేకరుల ఇష్టా గోష్టిలో మంత్రి తలసాని**

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర సమితికి ప్రత్యామ్నాయం లేదని రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకు కూడా ప్రతిపక్ష పార్టీల వద్ద సరుకు లేదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి కేసీఆర్ కాకుండా మరొకరు సీఎం అయినట్లైతే తెలంగాణ పరిస్థితి దారుణంగా ఉండేదన్నారు. 70 ఏళ్ల ఉమ్మడి పాలనలో తెలంగాణ కోల్పోయిన అవకాశాలను తిరిగి సాధించుకునేలా కేసీఆర్ పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నారని చెప్పుకొచ్చారు.

సంక్షేమ కార్యక్రమాల్లో దేశానికే ఆదర్శం

టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మి, హరిత హారం, డబుల్ బెడ్రూం ఇళ్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సాగునీటి ప్రాజెక్టుల రీ డిజైనింగ్, చేప పిల్లలు, గొర్రెల పంపిణీ, కేసీఆర్ కిట్, వెల్‌నెస్ సెంటర్లు, గురుకుల పాఠశాలలు, కేజీ టూ పీజీ ఉచిత విద్య, ఐటీ హబ్, 24 గంటల విద్యుత్ సరఫరా, రుణమాఫీ, ఎకరానికి రూ. 4000 పెట్టుబడి వంటి పథకాలు త్వరలో జాతీయ స్థాయి స్కీములుగా మారుతాయన్నారు. ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణ విపక్షాలకు కంటగింపుగా మారిందన్నారు.



అందుకే 'సీఎం'పై విమర్శలు

సర్కారును విమర్శించేందుకు ఎటువంటి అవకాశం లేక, కనీసం ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు కూడా చేపట్టలేని దుస్థితిలో ప్రతిపక్షం ఉందని తలసాని అన్నారు. ప్రతిపక్ష పార్టీల దగ్గర సరుకు లేక సీఎం కుటుంబ సభ్యులపై విమర్శలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌లు టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడక ముందు నుంచే ఎమ్మెల్యేలుగా ఉన్నారని, ప్రభుత్వంలో వారికి కేటాయించిన శాఖల్లో జెట్‌స్పీడ్‌తో దూసుకెళ్తూ, గుర్తింపు సంపాదించుకున్నారన్నారు.

వృత్తి కులాలను ఆదుకుంది కేసీఆర్ మాత్రమే

వృత్తి కులాల వారిని ఆదుకున్న ఘనత సీఎం కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్న తలసాని, గొల్ల, కురమలకు రూ. 1800 కోట్లతో 42 లక్షల గొర్రెలను, మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.52 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేసినట్టు వివరించారు. 18 నీటి వనరుల్లో 1.20 లక్షల మంచినీటి రొయ్యలను పెంచుతున్నట్టు వెల్లడించారు. 108 కులాలలకు భరోసా కల్పించేందుకు వీలుగా పథకాలను రూపొందించి, విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వం సొంతమని అన్నారు. మే నెల నుంచి వ్యవసాయానికి ఎకరాకు 4000 రూపాయల ముందస్తు పెట్టుబడి అందించనున్నట్టు తలసాని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలకు సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన లేదని, కేసీఆర్ భవిష్యత్ తరాల అవసరాలకోసం ప్రాజెక్టుల రీ డిజైనింగ్‌కు శ్రీకారం చుట్టారని ఆయన అన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక 30,000 ఉద్యోగాలు భర్తీ చేసినట్టు తలసాని మీడియాకు వెల్లడించారు.

హైదరాబాద్‌లో ఫ్రెంచ్ ఏరియల్ షో

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం ప్రతినిధి): ఈ నెల 13న పీపుల్స్ ప్లాజాలో ఫ్రెంచ్ ఏరియల్ షో నిర్వహిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి ఆజ్మీరా చందూలాల్ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మాట్లాడుతూ ఇండో ఫ్రెంచ్ ప్రభుత్వాల ఒప్పందంలో భాగంగా 'బొంజోర్ ఇండియా 2018' ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా 33 నగరాలలో ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు మంత్రి వివరించారు. ప్రదర్శన తొలి వేదికగా హైదరాబాద్ నగరాన్ని ఎంచుకోవడం విశేషమని మంత్రి వివరించారు. ఫ్రెంచ్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 18 మంది కళాకారులతో దేశంలోనే మొదటిసారిగా పెద్ద ఎత్తున సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ ప్రదర్శనలో సంగీతం, నృత్యం, సర్కస్, క్రాఫ్ట్, ఆర్కెస్ట్రా వంటి అన్ని విభాగాల కలబోతగా ఉంటుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. దాదాపు కోటి రూపాయల ఫ్రెంచ్ ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ప్రదర్శనకు ఎటువంటి ప్రవేశ రుసుము ఉండదని, ప్రజలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వెంకటేశం విజ్ఞప్తి చేశారు. ఇండో-ఫ్రాన్స్ సంబంధాలు బలోపేతమయ్యేందుకు ఇటువంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

జిల్లాకొక ఫారెస్ట్ అర్బన్ పార్కు

- **అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశం**

హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి): కొత్తగా జిల్లాకొక ఫారెస్ట్ అర్బన్ పార్కును ఏర్పాటు చేయనున్నట్టు పీసీసీఎఫ్‌లు పీకే ఝా, రఘువీర్ తెలిపారు. సచివాలయంలో శుక్రవారం అన్ని జిల్లాల అటవీ శాఖ అధికారులతో ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్బన్ పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని, అటవీ ప్రాంతాన్ని, సంపదను కాపాడేందుకు శాఖ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలన్నారు. అటవీ భూముల రక్షణలో భాగంగా అన్ని రిజర్వ్ ఫారెస్ట్‌ల చుట్టూ కందకాలు తవ్వే ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. ఈ మేరకు రాష్ట్రంలో సుమారు 24 వేల కిలోమీటర్ల కందకాల తవ్వకం చేపట్టాలని పేర్కొన్నారు. కందకాలను తవ్వడం ద్వారా వన్యప్రాణులు అడవి దాటి వెళ్లకుండ ఉండడంతో పాటు అటవీ భూములు సైతం ఆక్రమణలకు గురికాకుండా ఉంటాయని వివరించారు. వేసవి సమీపిస్తున్నందున అడవుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వన్యప్రాణులకు నీటి వసతి, అగ్ని ప్రమాదా ల నివారణపై సమీక్షించారు. ఈనెల 24 నుంచి 26 వరకు అడవుల్లో నీటి లభ్యతపై సర్వే చేయనున్నట్టు చెప్పారు. పట్టణ ప్రాంతాల వద్ద రోడ్లకిరువైపులా 5 నుంచి 20 కిలోమీటర్ల వరకు మొక్కలతో ఎవెన్యూ ప్లాంటేషన్‌ను చేపట్టాలని ఆదే శించారు. వచ్చే హరితహారం కోసం నర్సరీలను సిద్ధం చేయాలని, ప్రజలు కోరుకున్న విధంగా మొక్కలను అందజేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు అటవీ సంరక్షణ అధికారులు మునీంద్ర, లోకేష్ జైస్వాల్, డోబ్రియాల్, సునీల్‌కుమార్, శోభ, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

గేమింగ్ హబ్‌గా హైదరాబాద్: జయేష్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వం, బ్రిటీష్ హై కమిషన్ (యునైటెడ్ కింగ్‌డమ్) సంయుక్తంగా కలిసి 'గేమింగ్, ఇమ్మెన్సివ్ సమ్మిట్'ను శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించాయి. టెక్నాలజీ ఎగుమతులకు, ఉద్యోగ కల్పనకు యానిమేషన్, గేమింగ్, వీఎఫ్ఎక్స్ రంగాలు కీలకంగా మారనున్నాయని ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. దేశంలోనే ప్రముఖమైన గేమింగ్- వీఎఫ్ఎక్స్,-యానిమేషన్ కంపెనీలు నగరంలో ఉన్నాయని, ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో నైపుణ్యత కలిగిన యానిమేషన్- గేమింగ్ - విజువల్ ఎఫెక్ట్స్ హబ్‌గా ఇది నిలుస్తుందన్నారు. యూకే నుంచి 15 సంస్థలు కార్యక్రమానికి వచ్చాయని, వ్యాపార అవకాశాలను వివరించాయని తెలిపారు.

ఓటరు నమోదు విజయవంతం

హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి): ఎలక్షన్ కమిషన్, ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమం విజయవంతమైందని జేఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పి.సమ్మిలాల్ అన్నారు. యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన శిబిరంలో 600 మంది విద్యార్థులు ఓటు నమోదు చేసుకున్నారని తెలిపారు. 400 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో, 200మంది బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ ప్రసన్న, డాక్టర్ సురేశ్‌బాబు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులేదు

హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి): జనవరి 1వ తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాధారణ సెలవుదినంగా ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఫిబ్రవరి 10వ తేదీన (రెండో శనివారం) పనిదినంగా పాటించాలని ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

వీడిన చిన్నారి మిస్సింగ్ మిస్టరీ

హైదరాబాదు, ఫిబ్రవరి 9 (మనం ప్రతినిధి): శంషాబాద్‌లో మూడేళ్ళ చిన్నారి మిస్సింగ్ మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఇంటి మందు ఆడుకుంటున్న తమ కుమార్తె జెన్నిఫర్ కనిపించకుండా పోయిందని శంషాబాద్ వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన షారున్ అనే మహిళ మూడు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కిడ్నాప్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు సికింద్రాబాద్, కాచిగూడ, మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో గాలించారు. శంషాబాద్ కూరగాయల మార్కెట్‌లో పాప దొరికింది. అయితే తప్పిపోయి ఇక్కడకు వచ్చిందని స్థానికులు చెప్పారు.

ప్రజలను వంచించడంలో.. టీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే!

- **బీజేపీ ఒక్కటే ప్రత్యామ్నాయం**
- **సంక్షేమ కార్యక్రమాలు ఆకర్షిస్తున్నాయి**
- **భూకుంభకోణాలు పెరిగిపోయాయి: లక్ష్మణ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం న్యూస్): ప్రజలను వంచించడంలో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూదొందేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ విమర్శించారు. తెలంగాణాలో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వైఫల్యాలను, అవినీతిని ఎండగట్టే సత్తా బీజేపీకి మాత్రమే ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెబుతూ తెలంగాణలో ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని చెప్పారు. అందుకే పార్టీలో చేరికలు సాగుతున్నాయని వివరించారు. టీ సర్కారు పాలనతో ప్రజల విసిగిపోయారని, కాంగ్రెస్ పదేళ్ల పాలనలో దోచుకుని దాచుకుంది తప్ప ప్రజలకు చేసేందేమి లేదని మండిపడ్డారు. లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్, తాండూరుకు చెందిన జెడ్‌పీటీసీలు, సర్పంచ్‌లతో పాటు పలువురు నేతలు పార్టీలో శుక్రవారం చేరారు. నేతలకు కండువా కప్పి పార్టీలోకి ఆయన స్వాగతించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతూ.. దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. విలువలు లేని రాజకీయాలతో ప్రజలు విసిగిపోయారని ఆయన అన్నారు. ప్రజలను బానిసలుగా చేసి, మహిళలను వివస్త్రలను చేసి బతుకమ్మ ఆడించిన నిజాం నవాబును ముఖ్యమంత్రి కీర్తిస్తూ ఉంటే తెలంగాణ సమాజం రగిలిపోతుందని అన్నారు. రాష్ట్రంలో భూకుంభకోణాలు పెరిగిపోతున్నాయని, పత్రికల్లో వచ్చేవరకు ప్రభుత్వానికి కూడా తెలియదని, దీన్ని బట్టి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. రాజకీయాల్లో విలువలకు తిలోదకాలు ఇచ్చారని, చౌకబారు రాజకీయాలను ప్రజలు ఏమాత్రం సహించరని, ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి అసిఫాబాద్‌కు చెందిన టీఆర్ఎస్ నేత, జెడ్పీటీసీ రాము నాయక్, శాంతాపూర్ సర్పంచ్ విజయ్ కుమార్, మాజీ సర్పంచ్‌లు పుండాలిక్, అమర్సింగ్, వెంకట్రావు ఉన్నారు. వీరితో పాటు తాండూరుకు చెందిన టీడీపీ నేత, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్తయ్య గౌడ్, యాలాల మండల్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నేత చందర్ నాయక్, సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నేత, మున్సిపల్ కౌన్సిలర్ కిరణ్ కుమార్ తదితరులు పార్టీలో చేరారు.



సీఎం సారూ.. పర్మినెంట్ చేయరూ!



- టీఎస్‌యూఈఈయూ డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి): సీఎం సారూ.. కాంట్రాక్ట్ కార్మికుల సంగతేమైందంటూ తెలంగాణ స్టేట్ యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు కె. ఈశ్వర్‌రావ్, గ్రేటర్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షులు కె.సత్యం ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంస్థలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న 23,667 మందిని పర్మినెంట్ చేసిన తర్వాతనే జేఎల్ఎం పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులను పర్మినెంట్ చేయకుండానే పర్మినెంట్ చేసినట్టుగా సీఎం అసెంబ్లీలో ప్రకటించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఆర్టిజన్ అని పేరు పెట్టి గతం కంటే తక్కువ వేతన ఇస్తున్నారని ఆరోపించారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని టీఎస్ఎన్‌పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్‌కు అందజేయనున్నట్టు తెలిపారు.


అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లర్ల అరెస్టు

హైదరాబాద్/అమీర్‌పేట, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): హైదరాబాద్ నగరంలో డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న ముగ్గురు అంతర్జాతీయ స్మగ్లర్లను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ తెలిపిన వివరాల ప్రకారం ఆఫ్రికాలోని సియోరా లియోన్‌కు చెందిన అనాల్డ్ మార్టిన్ డోన్లక్(28), నైజీరియాకు చెందిన ఒకోరి జాన్ చుకువూ(26), ఒర్జి ఫిలిప్ కెలెచువుక్(27) బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలోని జహీరానగర్‌లో ఉంటున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారు. నిందితుల కదలికల పై నిఘా పెట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 20 గ్రాముల కొకైన్, 3 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు.



కేసీఆర్ బాహుబలి

- కాంగ్రెస్ నేతలు 'కాలకేయ ముఠా'
- కేటీఆర్ వ్యాఖ్యలు సమంజసమే
- కాంగ్రెస్ లోఫర్ పార్టీనే
- కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకోం
- ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ హెచ్చరిక



హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి): ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ నేతలు ''కాలకేయ ముఠా''లా మారి తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణకు సీఎం కేసీఆర్ బాహుబలి అని ఆయన చెప్పుకొచ్చారు. టీఆర్ఎస్ఎల్పీలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే బీగల గణేశ్‌తో కలిసి కర్నె ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతల కుట్రలను తిప్పి కొట్టి తెలంగాణను అగ్రభాగాన నిలబెట్టెందుకు సీఎం కెసిఆర్ శ్రమిస్తున్నారని ఆయన చెప్పారు. గాంధేయ వాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ఇప్పుడు ముఖ్యమంత్రిగా కూడా అదే పంథాను అనుసరిస్తున్నారని కర్నె అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఏపీలో తెలంగాణను ధృతరాష్ట్ర కౌగిలిలో ఉంచిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు కేసీఆర్‌ను ధృతరాష్ట్రుడితో పోల్చడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ ఉద్యమంలో అభిమన్యుడిలా ప్రవేశించి అర్జునుడిలా కేసీఆర్ విజయం సాధించారన్నారు. ప్రతి దాన్ని అడ్డుకునే కాంగ్రెస్‌ను లోఫర్ పార్టీ కాకుండా మరేమనాలని కర్నె ప్రశ్నించారు. దేశంలో టీఆర్ఎస్‌కు ఉన్న ఓపిక, సంయమనం మరే పార్టీకి లేదని... మంత్రి కేటీఆర్...ఉన్న మాటలు అంటే కాంగ్రెస్ నేతలకు ఉలుకెందుకని ఆయన చురకలంటించారు. ప్రజల భాషనే మంత్రి కేటీఆర్ వాడారన్నారు. భారతంలో బాలచంద్రుడిలా మంత్రి కేటీఆర్ తెలంగాణ అభివృద్ధిని భుజాన వేసుకున్నాడన్నారు. మంత్రి కేటీఆర్‌నుద్దేశించి కాంగ్రెస్ నేతలు చెసిన విమర్శలను ఖండిస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రెస్ మీట్లకే పరిమిత మయ్యారని ఎమ్మెల్యే గణేష్ బిగాల అన్నారు.

మూగ జీవుల వేదన తీర్చిన '1962'

ఘటనా స్థలానికే అంబులెన్స్‌లు

- ఏటా 3 సార్లు నట్టల నివారణ మందులు
- అన్ని ఆస్పత్రుల్లో సరిపడా మందులు
- హర్షం వ్యక్తం చేస్తున్న పాడి రైతులు

హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి): నిరంతరం వైద్య సేవలు, ఘటనాస్థలానికే అంబులెన్సులు, ఆసుపత్రుల్లో సరిపడా మందులు.. ఇవన్నీ ఎక్కడో కాదు.. రాష్ట్రవ్యాప్తంగా పశువైద్య కేంద్రాల్లో పరిస్థితి ఇది. ఒకప్పుడు పశు వైద్యుల కోసం అహోరాత్రులు పడిగాపులు కాయాల్సి వచ్చేది. మూగజీవాలను తన కుటుంబంలో మనిషి కంటే ఎక్కువగా భావించే రైతు వాటికి చిన్న దెబ్బ తగిలినా అల్లాడిపోతాడు. ఇక వాటి ప్రసవ సమయంలో రైతు పడే బాధలు అన్నీ ఇన్నీ కావు. ఈ బాధలన్నీ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాయం అయ్యాయి. దీనికితోడు అన్నదాతలకు వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉండే పాడిని అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. అందులో భాగంగానే పాడి పరిశ్రమ అభివృద్ధికి కావాల్సిన చర్యలను యుద్ధ ప్రాతిపదికన తీసుకుంటున్నారు.

పశువులకు అంబులెన్స్‌లు

గొర్రెలు, మేకలకే కాక రాష్ట్రవ్యాప్తంగా పశువులకు మెరుగైన వైద్యం అందక మృత్యువాత పడుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని పశు వైద్యానికి పకడ్బందీ చర్యలు చేపట్టింది. పశువుల వద్దకు వెళ్లి వైద్యం అందించేందుకు వీలుగా 100 సంచార అంబులెన్స్‌లు ఏర్పాటుచేశారు. ఇందుకు సంబంధించి 1962 పేరుతో కాల్ సెంటర్‌ను స్థాపించారు.

త్వరలో ఇంటికో గేదె

తెలంగాణ వ్యాప్తంగా మాంసానికి అధికంగా డిమాండ్ ఉండడంతో ప్రతి వారం వందల లారీల్లో గొర్రెలు దిగుమతి అవుతాయి. దీన్ని గమనించిన ప్రభుత్వం గొర్రెల కాపరులను అభివృద్ధి చేయడంలో భాగంగా గొల్ల కురుమలకు ఉపాధి కల్పించేందుకు రూ.5000 కోట్ల వ్యయంతో 40,00000 గొర్రెలు అందజేశారు. ప్రస్తుతం ఇవి 52,00000 చేరుకున్నాయి. ఒక్క ఏడాదిలోనే దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం గమనార్హం. త్వరలోనే ఇప్పటికే ఆయా పాడి పాల సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారికి ఇంటికో గేదెను ప్రభుత్వం అందించనుంది.



నట్టల నివారణ కోసం..

పశువులు ఎక్కువగా అనారోగ్యం బారిన పడడానికి ప్రధాన కారణం నట్టలు. మూగ జీవాల్లో సంతాన లోపం, సరైన ఎదుగుదల లేకపోవడానికీ ఈ నట్టలే మూలం. ఇప్పటివరకు మూగజీవాల్లో నట్టల నివారణ కోసం ఏటా రెండు సార్లు మందులు పంపిణీ చేయగా, ఇక నుంచి మూడు సార్లు అందించనున్నారు. ఇందుకు పశు వైద్య కేంద్రాల్లో సరిపడా మందులను అందుబాటులోకి తెచ్చారు. పశు సంవర్ధక శాఖ అమలు చేసే అన్ని కార్యక్రమాలు, పశువులకు వైద్యం అందించడంలోనూ గోపాల మిత్రలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. వైద్యులు అందుబాటులో లేని గ్రామాల్లో వీరి సేవలు ఎన్నో మూగజీవాలను రక్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోపాల మిత్రలకు కనీస భృతిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

గొర్రెలకు ఇన్సూరెన్స్

గొర్రెలను ఎండ, వానలతో పాటు పలు రకాల వ్యాధుల నుంచి రక్షించేందుకు వీలుగా షెడ్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందుకు లబ్ధిదారులు 10 శాతం వాటా చెల్లిస్తే, లక్ష రూపాయలతో షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుంది. వీటితోపాటు ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలకు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించింది.

చిక్కని పాల కోసం గడ్డి విత్తనాలు

పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రూ.4 పోత్సాహకాన్ని అందిస్తోంది. నిజానికి పాలు డెయిరీలకు విక్రయిసే రైతులకు ఏమాత్రం గిట్టుబాటయ్యేది కాదు. డెయిరీ కంటే బయటి మార్కెట్‌లో పాలకు ధర ఎక్కువ కానీ ఈ ధర రైతులందరికీ అందేది కాదు. వీటిని అధిగమించేందుకు రూ.2 ప్రోత్సాహాన్ని అందించాలని రైతులు కోరగా, రైతులు కోరిన దానికంటే అదనంగా రూ.4 ప్రభుత్వం అందిస్తోంది.



పశు సంరక్షణకు కృషి చేస్తున్నాం: తలసాని

తెలంగాణ పాడి రైతుల అభివృద్ధికి కృషి చేస్తూ, పశువుల రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. పశువుల ఆస్పత్రుల్లో అన్నిరకాల మందులను అందుబాటులోకి తెచ్చి, మూగజీవాల రక్షణకు సంచార అంబులెన్స్‌లు ఉపయోగిస్తున్నట్టు వివరించారు. పాడి రైతులను బలోపేతం చేసేందుకు విజయ డెయిరీని వంద ఎకరాల్లో ప్రభుత్వం ఆధునీకరిస్తున్నట్టు మంత్రి స్పష్టం చేశారు.

ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి): రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన రాజేశంగౌడ్‌ను ఈ నెల 11న రవీంద్ర భారతిలో సన్మానించనున్నట్లు కమిషన్ సభ్యులు పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికార వికేంద్రీకరణ, స్థానిక సంస్థల బలోపేతంకోసం సీఎం కేసీఆర్ ఫైనాన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే! అదే సమయంలో బంగారు తెలంగాణ సాధన దిశగా ఈ కమిషన్ తోడ్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సంక్షేమ పథకాలకు కావలసిన నిధుల మంజూరుకు కమిషన్ కృషి చేస్తుందని కమిషన్ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ అధీనంలోనే హౌసింగ్ సొసైటీ స్థలం

హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి): గచ్చిబౌలిలోని హౌసింగ్ సొసైటీ స్థలం హైకోర్టు ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోనే ఉందని భాగ్యనగర్ తెలంగాన ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సత్యనారాయణగౌడ్, కార్యదర్శి పి.బలరాం తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు విడిపోయిన తర్వాత ఏపీ ఎన్జీవోస్(గచ్చిబౌలి) మ్యూచ్‌వల్ ఎయిడెట్ కో ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీలో ఉన్న తెలంగాణ సభ్యులతో భాగ్యనగర్ తెలంగాన ఎన్జీవోస్ అసోసియేషన్‌గా ఏర్పడటం జరిగిందని తెలిపారు. గచ్చిబౌలిలోని హౌసింగ్ సొసైటీకి సంబంధించిన స్థలంపై ఏపీ ఎన్జీవోస్‌కు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు.


కేసీఆర్ కాలి గోటికి సరిపోరు

- రాహుల్, ఉత్తమ్ కంటే కేటీఆర్ గొప్పోడు
- గుక్కెడు నీళ్లు ఇవ్వలేని మీరు దద్దమ్మలు కాదా
- కాంగ్రెస్ నేతలపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం ప్రత్యేక ప్రతినిధి): అభివృద్ధే అజెండాగా ముందుకెళుతున్న కేసీఆర్ కాలిగోటికి కాంగ్రెస్ నాయకులు సరిపోరని మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు టీఆర్ఎస్ ఎల్పీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా ప్రజలకు తాగునీరు అందించలేకపోయిన కాంగ్రెస్ నేతలను దద్దమ్మలు అనకపోతే ఇంకేమంటారన్నారు. సోనియాను బలిదేవత అన్నది రేవంత్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. మిషన్ భగీరథ నీళ్లలో తెలంగాణ మహిళల ఆనంద భాష్పాలు కనిపిస్తున్నాయన్నారు. జీవన్ రెడ్డి మిషన్ భగీరథపై చవకబారుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కోర్టు కేసులతో ప్రాజెక్టులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నేతలు ముమ్మాటికి దద్దమ్మలేనన్నారు. 24 గంటల కరెంట్‌పై చవకబారు విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు అబాసుపాలైన విషయాన్ని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ, ఉత్తమ్ కంటే కేటీఆర్ గొప్పవాడని, సిరిసల్ల నుంచి సిలికాన్ వ్యాలీ దాకా ఆయనకు ఓ స్థాయి ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ వంద సీట్లు గెలిచి అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించడం ఖాయమని పల్లా అన్నారు. టీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతల నోళ్లు శాశ్వతంగా మూత పడతాయన్నారు.

బడ్జెట్‌లో కొత్తదనం లేదు




- ప్రధాని.. చరిత్ర తెలుసుకోవాలి
- తెలుగు రాష్ట్రాలపై స్పష్టతలేదు: సురవరం

హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి): కేంద్ర బడ్జెట్‌లో కొత్తదనమేమీలేదని, రాజకీయ ప్రత్యర్థుల మీద విషంకక్కడం తప్ప ప్రధాని మోదీ అసలు సమస్య గురించి ప్రస్తావించలేదని కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. మగ్దూం భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరలు, నిరుద్యోగితను తగ్గించేందుకు ఏలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సాధారణ బడ్జెట్, రైల్వే బడ్జెట్లను కలపడం వల్ల ప్రజలు అయోమయానికి గురవుతు న్నారన్నారు. తెలంగాణలో చాలా తక్కువగా రైల్వే లైన్లు ఉన్నాయని, వాటి ఊసే ఎత్తలేదని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తమకు అన్యాయం జరిగిందని వాపోతున్నాయన్నారు. పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ పెట్రోల్, డీజీల్‌పై లీటర్‌కు రూ.2 కస్టమ్‌ను తగ్గిస్తామని చెప్పిన 48 గంటల్లోనే శాఖ ముఖ్య కార్యదర్శి కస్టమ్ తగ్గించడంలేదని ప్రకటించారని చెప్పారు. ప్రధాని మోదీ చరిత్ర గురించి తెలియకుండా మాట్లాడుతున్నారని.. కశ్మీర్ వ్యవహారంలో సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు తెలియకుండా ప్రభుత్వం, నెహ్రూ ఏ నిర్ణయం తీసుకోలేదని గుర్తుచేశారు. ఒక్క సీపీఎం మినహా బీజేపీతో సహా అన్ని రాజకీయ పార్టీలు ఆమోదించిన తర్వాతే తెలంగాణ విభజన జరిగిందని, ప్రస్తుతం దీనిపై ప్రధానికి అభ్యంతరమేంటని ప్రశ్నించారు. అత్యంత విలువైన పార్లమెంట్ వేదికను దుర్వినియోగం చేయడం బాధాకరమని చెప్పారు.

శూర్పణఖతో పోల్చడమా?

- మహిళలను కించపరచడం అమానుషం
- రిజిజు క్షమాపణ చెప్పాలి: పొంగులేటి



హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి): రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరిని శూర్పణఖతో పోల్చడం సిగ్గుచేటని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి వివరించారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంలో ప్రధాని మోది వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని విమర్శించారు. శుక్రవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ హోదాలో ఉన్న వెంకయ్య నాయుడు సైతం రేణుకాచౌదరిని అవహేళన చేయడం అప్రజాస్వామ్యమన్నారు. ట్రిపుల్ తలాక్ విషయంలో మహిళల హక్కుల గురించి మాట్లాడే బీజేపీ నాయకులు చట్టసభల్లోనే మహిళలను కించపరచడం అమానుషమని విమర్శించారు. ఎవరైనా తప్పు చేస్తే శిక్షించే స్థాయిలో ఉన్న హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో మహిళలపై బీజేపీకి ఉన్న గౌరవమెంతో తెలుస్తోందన్నారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, మంత్రి కిరణ్ రిజిజు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణకు చెందిన ఎంపీలు మౌనంగా ఉండడం రాజకీయ కుట్రకు పరాకాష్ట అన్నారు. పోలవరం ముంపు ప్రాంతం గురించి, వరంగల్ మెగా టెక్స్ టైల్స్, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీల గురించి ఊసే ఎత్తలే దన్నారు. పార్లమెంట్ ఎంపీ కవిత ప్రసంగం తూతూ మంత్రంగా సాగిందని విమర్శించారు. ఎంపీ కవిత ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్‌లో ఆంధ్ర సెట్లర్స్ ఎక్కువగా ఉన్నందున వారిని బుట్టలో వేసుకునేందుకు చివర్లో జై ఆంధ్ర అన్నారని విమర్శించారు. తమిళనాడు వంటి రాష్ట్రాలు కేంద్రంపై ఉమ్మడి పోరుచేస్తుంటే కేసీఆర్ ఒక్కసారి కూడా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లలేదని మండిపడ్డారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శనివారం, ఫిబ్రవరి 10


మార్కెట్ల మాయాజూదం!

స్టాక్ మార్కెట్లు నిరాఘాటంగా కుప్పకూలుతున్నాయి. 'మోదీకేర్' బడ్జెట్‌తో ప్రారంభమైన సెన్సెక్స్, నిక్కీ భారతీయ షేర్ మార్కెట్ల పతనం అమెరికా, యూరోపియన్, ఆసియా స్టాక్ మార్కెట్లు క్షీణించడంతో పరాకాష్ఠకు చేరుకుంది. ఎల్టీసీజీ (లాంగ్‌టెర్మ్ క్యాపిటల్ గెయిన్స్ టాక్స్), బడ్జెట్‌లో ద్రవ్యలోటు పెరగడం, వ్యవసాయోత్పత్తులకు 'కనీస మద్దతు ధర పెంపు', గ్లోబల్ స్టాక్‌మార్కెట్లు కూలిపోవడం, అమెరికా డాటా వివాదం, ఆర్బీఐ వడ్డీరేట్లలో నెలకొన్న అనిశ్చితి వెరసి భారతీయ స్టాక్ మార్కెట్లు కుదేలవడానికి దోహదం చేశాయని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. దాంతో రూ. 8 లక్షల కోట్లకు పైగా మదుపుదారులకు నష్టం వాటిల్లిందని అంచనా. లక్షల కోట్ల రూపాయాలు క్షణాల్లో ఆవిరవడం మదుపుదారులకే కాకుండా ఆర్థిక వ్యవస్థ పురోగతికి ఉపకరించే విదేశీ మదుపుల ప్రవాహానికి ఇది పెద్ద అడ్డంకిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. దేశీయ ఆర్థిక, ద్రవ్య విధానాలకు తోడు అమెరికా స్టాక్ మార్కెట్లలో షేర్ల ధరలు తీవ్ర స్థాయిలో పతనమై, ఆ ఆర్థిక ప్రకంపన కేంద్రంగా ప్రపంచ స్టాక్ మార్కెట్లు వరుసపెట్టి కుప్పకూలాయి. గత రెండేళ్ల కాలంలో ఒక వారం రోజుల్లో స్టాక్ మార్కెట్ అమెరికాలో ఇంతగా ఎన్నడూ పతనం చెందలేదు. అమెరికా ప్రభుత్వ బాండ్లపై వడ్డీ రేట్లు వేగంగా పెరుగుతుండడం, వేతనాల పెంపుతో పెరిగిన వ్యయం కారణంగా ప్రపంచ స్టాక్ మార్కెట్‌లలో సంక్షోభం ఏర్పడిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ప్రపంచ దేశాలు మహా ఆర్థిక సంక్షోభం నుంచి పైకి చూసేందుకు కోలుకుంటున్నట్లు కనపడుతున్నా, వాస్తవంలో గ్లోబల్ పేదరికం అనూహ్యమైన వేగంతో విస్తరిస్తుండడం వల్ల కొనుగోలు శక్తిలేక మార్కెట్ కార్యకలాపాలు స్తంభించి లోలోపల మరింత లోతుగా సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. స్టాక్ మార్కెట్ జూదం ప్రపంచ ప్రజల మదుపులను కొల్లగొడుతోంది. మదుపుదారులను, ప్రజలను బికారులుగా మార్చివేస్తోంది. 1930ల నాటి ఆర్థిక సంక్షోభ సమయంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లను తగ్గించడంతో ఆ దేశ మదుపుదారులు యూరోపియన్ స్టాక్ మార్కెట్లలో పోర్ట్‌ఫోలియో మదుపులు పెట్టారు. ముఖ్యంగా జర్మనీ తదితర దేశాల మార్కెట్లలోకి ప్రధానంగా పెద్ద ఎత్తున ప్రవేశించారు. ఆ స్టాక్ మార్కెట్లలో షేర్ల ధరలు విజృంభించి, పెట్టిన మదుపులు కొన్ని రెట్లు పెరిగిన అనంతరం, ఇప్పటిలాగే అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ హఠాత్తుగా పెంచివేయడంతో ఓవర్‌సీస్‌లోని మదుపుదారులు వేలంవెర్రిగా తమ మదుపులను యూరోపియన్ ముఖ్యంగా జర్మనీ స్టాక్ మార్కెట్లనుంచి తరలించారు. పర్యవసానంగా యూరోపియన్ మార్కెట్లు కుప్పకూలడంతో ప్రపంచ ఆర్థిక సంక్షోభం మహా సంక్షోభంగా పరిణమించి, చివరికి ప్రపంచ యుద్ధానికి దారితీసింది. ఇలా స్టాక్ మార్కెట్ లావాదేవీలలో ద్రవ్య జూదం ద్వారా ప్రపంచ దేశాల సంపదలను కొల్లగొట్టే ఎత్తుగడను అమెరికా చేపట్టి ఆనాడు లాభపడింది. అయితే అమెరికా పారిశ్రామిక వస్తూత్పత్తి, వ్యవసాయ రంగాలు ఆనాడు పరిపుష్టిగా ఉండడం, స్థానిక మార్కెట్లు బలీయంగా ఉండడం వల్ల స్టాక్ మార్కెట్ జూద వ్యూహం ఫలించింది. పారిశ్రామిక వస్తూత్పత్తి, వ్యవసాయ రంగాలు సంక్షోభంలో కూరుకుపోయిన పరిస్థితుల్లో ఆ వ్యూహం అమెరికాకు శాపంగా పరిణమిస్తుంది. అందుకే నేడు అమెరికా స్టాక్ మార్కెట్లు సైతం పతనోన్ముఖంగా ప్రయాణిస్తున్నాయి.

2008 నుంచి కొనసాగుతున్న కార్పొరేట్ ద్రవ్య పారిశ్రామికవేత్తల చేతిలో సంపదలు కేంద్రీకృతం కావడం, విశాల ప్రజానీకం కనీస మాత్రంగా నిత్యావసరాల కొనుగోలు శక్తి కూడా కోల్పోవడంతో తీవ్ర ఆర్థిక మాంద్యం ఆవహించింది. అది ప్రపంచ ఆర్థిక సంక్షోభంగా పరిణమించింది. పర్యవసానంగా గత నాలుగు దశాబ్దాలుగా ఎన్నిడూ లేని విధంగా వేతనాలను, ఉద్యోగాలను, జీవన ప్రమాణాలను తిరిగి సాధించుకునేందకు అమెరికాతో సహా పారిశ్రామిక దేశాలన్నిటిలో కార్మికవర్గం, ప్రజానీకం సమరశీల పోరాటాలలోకి దిగింది. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, మిత వ్యయ విధానాల పేరుతో ప్రజాసంక్షేమంపై కోత విధిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు ప్రపంచవ్యాప్తంగా ఉనికిలోకి వచ్చాయి. అమెరికా పారిశ్రామిక కేంద్రాల్లోను, జర్మనీ, గ్రీస్, బ్రిటన్, ఫ్రాన్స్, తూర్పు ఐరోపా దేశాల్లో కార్మిక, ప్రజా ఉద్యమాలు పాలకులను వణికించాయి. దీన్నుంచి బయటపడేందుకు బ్యాంకులకు, హెడ్జ్ ఫండ్స్‌కు, కార్పొరేట్ సంస్థలకు బెయిల్ ఔట్ ప్యాకేజీ పేరు మీద ప్రభుత్వాలు భారీగా నిధులు అందించినప్పటికీ సంక్షోభం నుంచి తేరుకోలేకపోయాయి. దేశీయ మార్కెట్లను పరిపుష్టం చేయడం ద్వారా స్థానిక ప్రజానీకం కొనుగోలు శక్తి పెంచేందుకు కనీస వేతనాల పెంపు, ఆత్మరక్షణ ఆర్థిక విధానాలను అమెరికా సహా యూరోపియన్ దేశాలన్నీ అమలు చేయడం ప్రారంభించాయి. వేతనాల పెంపు, ఆత్మరక్షణ ఆర్థిక విధానాల నేపథ్యంలో అమెరికాలో ఆకస్మికంగా వడ్డీ రేట్లు పెరిగాయి. గత పదేళ్ళలో అమెరికా ట్రెజరీ బాండ్లపై వడ్డీ 2.8 శాతానికి పెరిగింది. ఒకవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లను పెంచుతూ ఉంటే, మన రిజర్వ్ బ్యాంకు వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచడం కూడా మదుపుదారులు వెనుదిరిగేందుకు దోహదం చేసింది. మిత వ్యయ చర్యలు, వేతనాల కోత వంటి విధానాలతో ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీసిన కార్పొరేట్ శక్తుల అనుకూల ప్రభుత్వ విధానాలు నేడు స్టాక్ మార్కెట్ మాయాజాలంతో ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించాలని చూస్తోంది. స్టాక్ మార్కెట్ అనేది నిజ మార్కెట్‌లోని ఎగుడుదిగుడులను ప్రతిబింబించే సాధనమే గాని, దాని సంక్షోభాన్ని పరిష్కరించే సాధనం ఎంతమాత్రమూ కాదు. స్టాక్ మార్కెట్ మాయాజాలంతో, ద్రవ్య విధానాలతో ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరింపజాలమన్న విషయాన్ని పాలకులు ఎన్నటికీ గుర్తించరు. గతంలో అమెరికా చేసిన స్టాక్ మార్కెట్ కుట్రలు యూరోపియన్ ఆర్థిక వ్యవస్థలను దివాళా తీయించి రెండవ ప్రపంచ యుద్ధంవైపునకు నడిపించాయి. ఇప్పుడు కూడా అలాంటి ప్రయోగానికి ఒడిగడుతున్న అమెరికా చర్యలు అంతర్జాతీయ సమాజాన్ని ఎలాంటి పరిస్థితుల్లోకి నెడుతుందో ఊహించడం పెద్ద కష్టమైన విషయేమీ కాదు!

దూరంగా కదులుతూ..



నన్ను నిందించే అధికారం
నీలో మెదిలితే...
భరించే స్వరం నాలో ఉంది.,
రెక్కలొచ్చి నే ఎగిరే ప్రతి అడుగులో
నీడలా నువ్వు వెంబడిస్తుంటే
ప్రేమించే ప్రేమ సైతం
మన నుండి దారి తప్పుతుంది.
ఒంటరిగా మిగిలాను...
నా యెదుట ఎన్నో పిలుపులు
ఆప్యాయంగా తమ దరికి చేర్చుకున్నాయనుకున్న
కానీ నా వెనుక వాదులాడే స్పందనలు
నేను నా కన్నులు గ్రహించి వెనుదిరిగాను
ప్రేమించే ప్రేమే
దూరం జరిగితే, ఆదరించే పిలుపులు ఆగుతాయా
అర్థంపర్థం లేని ఆశలతో బతకడం కన్న
ప్రేమించని ప్రేమకు, ఆప్యాయతలకు దురంగా కదులుతూ...

- ఉడుతడింపుల్ శ్రీవల్లి
మహాత్మాగాంధీ యూనివర్సిటీ, నల్లగొండ
9440898650



మంచిమాట



ఈరోజు కష్టంగా ఉంటుంది. రేపు మరింత కష్టంగా ఉంటుంది. మరుసటి రోజు చాలా అందంగా ఉంటుంది. కానీ చాలామంది రేపు సాయంత్రమే చనిపోతారు.

- జాక్ మా

ఇది పరీక్షా కాలం



జి. రాజశుక

సచేతన

మరో ఏడాదిలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్ర మోదీని, బీజేపీని ఎదుర్కోవడానికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అస్త్రశస్త్రాలన్నిటినీ సిద్ధం చేసుకుంటున్నారు. ఆ పార్టీకి గట్టి పోటీ ఇవ్వాలని ఆయన పట్టుదలతో ఉన్నారు. అయితే, వాస్తవంగా ఆయన లక్ష్యం మాత్రం 2024లో జరగబోయే ఎన్నికలేనని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. తాను, తన పార్టీ అధికారంలోకి రావాలంటే పార్టీని అంతర్గతంగా సిద్ధం చేయడానికి, తాను సరైన వ్యూహాలను అనుసరించడానికి ఇంకా కొంత సమయం అవసరం అవుతుందని ఆయన భావిస్తున్నట్టు కనిపిస్తోంది. ఆ ఉద్దేశంతోనే ఆయన 2024 నాటికి ఓ బృహత్ ప్రణాళికను రూపొందించుకుని ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఆయన తన వ్యక్తిగత కార్యాచరణ బృందంలో సీనియర్లకు, వృద్ధుల స్థానే యువకులను నింపే ప్రయత్నంలో ఉన్నారు.

మరో అయిదారేళ్లు కనుక ఆగితే, అహ్మద్ పటేల్, మోతీలాల్ వోరా, ఏకే ఆంటొనీ, చిదంబరం, దిగ్విజయ్ సింగ్ వంటి వారు క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకుంటారని, అప్పుడు తన అభీష్టం ప్రకారం పార్టీని పటిష్టం చేసుకుని, బీజేపీని ఢీకొట్టవచ్చని ఆయన ఆలోచిస్తున్నారు. ఈ సీనియర్ నాయకులంతా ఆయన తల్లి సోనియా గాంధీ కోటరీకి సంబంధించినవారు. వారంతా తమకు తాముగా, హుందాగా క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోవాలని ఆయన ఆశిస్తున్నారు. వారు తప్పుకునేలోగా తనకు విధేయులైన యువ నాయకులను సమీకరించుకోవాలనేది ఆయన ప్రయత్నం. నిజానికి ఇప్పటికే పార్టీలో కొన్ని కొత్త ముఖాలు ప్రవేశిస్తున్నాయి. వారంతా రాహుల్‌కు నమ్మకస్తులే. అయితే, వారు పూర్తిస్థాయి నాయకులుగా తయారై, రాహుల్‌కు సరైన సమయంలో సరైన సహాయ సహకారాలు అందించడానికి ఎంత లేదన్నా కనీసం ఐదేళ్లు పడుతుందని అంచనా. ప్రస్తుతం వారికి అవసరమైనంత రాజకీయానుభవం లేదు. వచ్చే ఏడాది జరగబోయే ఎన్నికలలో కూడా ఆయన వినూత్న ప్రచారం చేపట్టాలని భావిస్తున్నారు. ఈ ప్రచారం సీనియర్ నాయకుల శైలికి భిన్నంగా ఉండాలనేది ఆయన ఉద్దేశం. ఆయన యువతరం విధేయుల్లో ఐఏఎస్ నుంచి రాజీనామా చేసినవాళ్లు, టెక్కీలు, ఎంబీలు ఉన్నారు. సుమారు 20 మంది యువకులతో ఇటువంటి బృందాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు.

గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ శాసనసభల ఎన్నికల తర్వాత రాహుల్ వ్యవహారశైలి బాగా మెరుగుపడింది. ముఖ్యంగా గుజరాత్‌లో బీజేపీకి ఆశించిన స్థాయిలో సీట్లు రాకపోవడం, కాంగ్రెస్ పరిస్థితి మెరుగుపడడం, ఆ తరువాత రాజస్థాన్ ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయ దుందుభి మోగించడం ఆయనకు కొండంత ధైర్యాన్నిచ్చింది. ఇప్పటికే పార్టీలో తమ ప్రభావాన్ని చూపిస్తున్న సచిన్ పైలట్, జ్యోతిరాదిత్య సింధియా, అశోక్ గెహ్లాట్, కమల్‌నాథ్ వంటి యువ నాయకుల సహాయ సహకారాలతో రాహుల్ గాంధీ రాజకీయానుభవం బాగా పదునెక్కింది. ఆయన ఇప్పటికీ కొందరు సీనియర్ నాయకుల మీద ఆధారపడాల్సి వస్తున్నప్పటికీ, తన యువ విధేయులతో మాత్రం ఆయన మనసు విప్పి రాజకీయ వ్యూహాలు, అంశాలు చర్చిస్తున్నారు. తన పార్టీ పటిష్ఠత గురించే కాక, బీజేపీ స్థితిగతుల మీద కూడా లోతుగా అధ్యయనం చేస్తున్న రాహుల్ గాంధీ బీజేపీ ప్రతిష్ఠ ఎక్కువ కాలం ప్రస్తుత స్థితిలో ఉండదని భావిస్తున్నారు. మరో నాలుగేళ్లలో బీజేపీ బాగా బలహీనపడడం ఖాయమనీ, అది ఇప్పటికే ఓ అభిలషణీయ స్థాయికి చేరుకుని, ఇక అంతకు మించి ముందుకు పోయే అవకాశం లేకుండా చేసుకుందని ఆయన అభిప్రాయపడుతున్నారు.



ఇందిరా గాంధీ, నరేంద్ర మోదీల మాదిరిగా ఆయన ఆకర్షణీయమైన నినాదాలను కొన్నిటిని సృష్టించాల్సిన అవసరం కూడా ఉంది. ఇందిరా గాంధీ రోటీ కపడా ఔర్ మకాన్, గరీబీ హటావో వంటి నినాదాలతో విజయాలు సాధించారన్న విషయాన్ని ఆయన గమనించడం మంచిది. నరేంద్ర మోదీ అటువంటి నినాదాలు సృష్టించడంలో సిద్ధహస్తులు. ఆయన ఆదాయం, ఉద్యోగాలు, న్యాయం, నిజాయతీ వంటి అంశాలతో నినాదాలను రూపొందించడం మంచిది. ఆశయాలు, అభివృద్ధిని ఊతంగా చేసుకుని నినాదాలను రూపొందించాల్సి ఉంటుంది. ఇందిరా గాంధీ సృష్టించినట్టే ఓ పది సూత్రాల కార్యక్రమాన్ని సృష్టించి, దాంతో ఎన్నికల ప్రచారం ప్రారంభించాల్సిన అవసరం ఉంది.

వ్యూహ ప్రతివ్యూహాలు

దక్షిణాది రాష్ట్రాలలో అడుగు పెట్టడానికి ఏమాత్రం అవకాశం లేని బీజేపీ ఉత్తరాది రాష్ట్రాలలో కూడా తిరుగు ముఖం పడుతోందని ఆయన తన మిత్రులతో చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీకి దేశంలో ఉన్న ఒకే ఒక ప్రత్యామ్నాయం కాంగ్రెసేనని, బీజేపీతో విసుగెత్తిపోయిన ప్రజలు తమ వైపే మొగ్గు చూపడం ఖాయమని ఆయన ఆశిస్తున్నారు. ఆయన ఇప్పుడు తనకు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సోనియా కోటరీలోని కొందరు సీనియర్ నాయకులలో తనకు విధేయులైనవారు కూడా ఉన్న విషయం ఆయనకు బాగా తెలుసు. అదే సమయంలో కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ వంటి నాయకులకు తన నాయకత్వం అంగీకారయోగ్యం కాదన్న సంగతి ఆయనకు బాగా తెలుసు.

పార్టీ నిధుల కోసం కాంగ్రెస్ అధిష్ఠానం పూర్తిగా తాము అధికారంలో ఉన్న కర్ణాటక, పంజాబ్‌ల మీదే ఆధారపడుతున్నందువల్ల ఆయన ప్రస్తుతానికి సిద్దరామయ్య, అమరీందర్ సింగ్‌ల జోలికి వెళ్లడం లేదు. అయితే, రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసి ఆయన మొదట్లోనే ప్రణబ్ ముఖర్జీని దూరంలో ఉంచగలిగారు. కర్ణాటకను కాపాడుకోవడం ఆ పార్టీకి అవసరం. బీజేపీ గనుక ఆ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కాంగ్రెస్ అంచనాలు తలకిందులవుతాయి. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి వీలైనంత మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని రాహుల్ వ్యూహం రూపొందిస్తున్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఆ రెండు రాష్ట్రాలలో కాంగ్రెస్ నాయకత్వంలో తీవ్రస్థాయిలో విభేదాలు నెలకొని ఉన్నాయి. వాటిని పరిష్కరించడం మీద రాహుల్ ప్రస్తుతం దృష్టి కేంద్రీకరించి ఉన్నారు. రాజస్థాన్‌లో సచిన్ పైలట్, అశోక్ గెహ్లోట్‌లను, మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియా, కమల్‌నాథ్‌లను ఆయన ప్రోత్సహిస్తున్నారు. ఈ రెండు రాష్ట్రాలలో సమస్యలను పరిష్కరించడానికి ఆయన తప్పనిసరి పరిస్థితులో కొందరు సీనియర్ నాయకుల మీద కూడా ఆధారపడాల్సి వస్తోంది.

మొత్తానికి ఇటువంటి సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే తాను అధికారం కోసం 2024 వరకూ వేచి చూడాల్సిందేనని ఆయన భావిస్తున్నారు. అయితే, తన పార్టీపై తన పట్టు, పలుకుబడి పెరగాలన్న పక్షంలో తన నాయకత్వంలో పార్టీ కర్ణాటకలో విజయం సాధించాల్సిన అవసరం ఉందని ఆయనకు తెలుసు. అవసరమైతే సోదరి ప్రియాంక గాంధీని కూడా రంగంలోకి దింపాలని, కర్ణాటకలో గెలిచిన తర్వాత ఆమెకు కూడా పార్టీలో తగిన పదవిని ఇవ్వాలని ఆయన భావిస్తున్నారు. ఇక ఈ ఏడాది చివరి నాటికి సోనియా గాంధీ రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగే అవకాశం ఉంది. పార్టీలో పలువురు సీనియర్ నాయకులు ఇప్పటికీ సోనియాను, ప్రియాంకను మాత్రమే సంప్రతించడం, తనను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం ఆయనకు కినుకగా ఉంది. కర్ణాటక ఎన్నికల వరకూ ఆగి, ఆ తరువాత ఆ పద్ధతిని మార్చాలని ఆయన ఆలోచిస్తున్నారు. రాహుల్‌కు వామపక్ష సిద్ధాంతాల పట్ల కాస్తంత అభిమానం ఉంది. సీతారాం ఏచూరి వంటి నాయకులను ఆయన అనేక విషయాలలో సంప్రతిస్తుంటారని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. బీజేపీని 2024 నాటికి అధికారం నుంచి తొలగించడానికి ఆయన వామపక్షాలతో చేతులు కలిపే అవకాశం ఉంది.

రాజకీయ పాఠాలు

వాస్తవానికి గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పరిస్థితి గణనీయంగా మెరుగుపడినప్పటికీ, 2019 ఎన్నికల్లో విజయం సాధించాలంటే మాత్రం అది శిఖరాలు ఎక్కాల్సిందే. ఈ ఎన్నికల ద్వారా ఆయన ఓ గుణపాఠం నేర్చుకున్నారు. అది: కేవలం ప్రత్యర్థుల బలహీనతలు, లోటుపాట్ల మీద ఆధారపడితే ప్రయోజనం లేదు. తమకు తాముగా ఓటర్లను ఆకట్టుకోవడానికి వ్యూహాలు రూపొందించుకోవాలి. ముఖ్యంగా పట్టణ ఓటర్లను ఆకట్టుకోగలగాలి. కేవలం వ్యతిరేక ఓటుతో గెలవాలనుకోవడం జరిగే పని కాదు. అంతే కాక, అవినీతి మచ్చపడిన కొందరు సీనియర్ కాంగ్రెస్ నాయకులను దూరం పెట్టాల్సి ఉంది. పార్టీలో కొత్త రక్తం ప్రవహించాల్సి ఉంది. ఒక ఏడాది పాటు పూర్తిగా పార్టీ ప్రక్షాళన కార్యక్రమం చేపడితే తప్ప ఇది సాధ్యమయ్యే విషయం కాదు.

ఇందిరా గాంధీ, నరేంద్ర మోదీల మాదిరిగా ఆయన ఆకర్షణీయమైన నినాదాలను కొన్నిటిని సృష్టించాల్సిన అవసరం కూడా ఉంది. ఇందిరా గాంధీ రోటీ కపడా ఔర్ మకాన్, గరీబీ హటావో వంటి నినాదాలతో విజయాలు సాధించారన్న విషయాన్ని ఆయన గమనించడం మంచిది. నరేంద్ర మోదీ అటువంటి నినాదాలు సృష్టించడంలో సిద్ధహస్తులు. ఆయన ఆదాయం, ఉద్యోగాలు, న్యాయం, నిజాయతీ వంటి అంశాలతో నినాదాలను రూపొందించడం మంచిది. ఆశయాలు, అభివృద్ధిని ఊతంగా చేసుకుని నినాదాలను రూపొందించాల్సి ఉంటుంది. ఇందిరా గాంధీ సృష్టించినట్టే ఓ పది సూత్రాల కార్యక్రమాన్ని సృష్టించి, దాంతో ఎన్నికల ప్రచారం ప్రారంభించాల్సిన అవసరం ఉంది. దాంతో పాటే గ్రామీణ ప్రాంతాలను, రైతాంగాన్ని కలుపుకుని పోవాల్సి ఉంటుంది. గుజరాత్ ఎన్నికలు, రాజస్థాన్ ఉప ఎన్నికలతో రాహుల్ కొంత సానుకూల దిశగా అడుగులు వేశారు. ఈ నినాదాలు, సూత్రాలతో ఈ అడుగుల వేగం పెరిగే అవకాశం ఉంది. అయితే, దీనికంతటికీ, ఓ ఏడాది సరిపోదు. ఇదొక పంచవర్ష ప్రణాళిక.

ఫలసాయం లేని వ్యవసాయం

గతంలో వ్యవసాయం ఉత్తమం, వ్యాపారం మధ్యమం, ఉద్యోగం అధమం అన్న నానుడి ఉందంటే నేటి కాలంలో ఆశ్చర్యం వేయక మానదు. కానీ అది ముమ్మాటికీ నిజం. నేడు ఆ పరిస్థితి తలకిందులై 'రైతే రాజు' అన్న పదం పేరుకే స్థిరపడిపోయింది. 'రైతు లేనిదే రాజ్యం లేదు', 'రైతే దేశానికి వెన్నెముక' అను పదాలతో సంతృప్తి చెందడమే తప్ప రైతుకు ఒరుగుతున్నది ఏమీ లేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా నేటికీ రైతన్న రైతుగానే ఉండగా, ఇతర రంగాల వారు మాత్రం అంత ఎత్తుకు ఎదుగుతున్న తీరే రైతు దీనస్థితికి ప్రబల నిదర్శనం.

అందరికీ అన్నం పెట్టే రైతన్న పురుగుల మందు ఎందుకు తాగుతున్నాడు? ఇంటి చూరుకో, చెట్టుకొమ్మకో ఎందుకు దీనంగా వేలాడుతున్నడు? భీకరమైన ఈ దృశ్యాలు నిత్యం పత్రికల్లో సర్వసాధారణమై పోవడం దురదృష్టకరం. ఎన్నో కమిటీలు, రిపోర్టులు, సమావేశాలు, ప్రకటనలు, వరాలు అయినా నేటికీ రైతు పరిస్థితిలో మార్పు రాలేదు. నిజానికి ప్రపంచంలో పెరుగుతున్న జనాభా ఒకవైపు, తరుగుతున్న వ్యవసాయ భూములు మరొకవైపు, గతి తప్పుతున్న రుతుపవనాలు, కల్తీ మయమైన విత్తనాలు, రసాయనాలు, క్రిమి సంహారక పురుగుమందులు ఇత్యాది కారణాలతో భవిష్యత్తులో ఆహార భద్రతకు పెను సవాలు రానున్నది. అంతేకాకుండా వ్యవసాయ భూములను సైతం తేరగా వచ్చిన ధనాన్ని నయా పెట్టుబడిదారులు గ్రామాల్లో చేరి భూములను చెరబట్టడం, రియల్ ఎస్టేట్ వైపు మళ్లించడం లాంటి చర్యలతో నిజమైన రైతులే రైతు కూలీలుగా మారుతున్న దుస్థితి దాపు రించింది. 'సేద్యం గానీ స్వేదం గానీ ఎరుగని' నయా పెట్టుబడిదారుల చెరలోకి భూమి తరలుతున్నది.

వ్యవసాయదారులు చినుకు కోసం నింగి వైపు, చినుకు పడితే పెట్టుబడి కోసం గ్రామ సేటుల దగ్గరికి, విత్తులకై ఆరాటం, కూలీ డబ్బుల చెల్లింపులకై పోరాటం, తదనంతరం క్రిమిసంహారక మందులతో కుస్తీతోనే పంట కాలం గడుపుతున్నా, చివరికి దిగుబడి వచ్చేసరికి అతనికి పెట్టిన పెట్టుబడి సైతం రాని దుస్థితి. రైతులకు దక్కని గిట్టుబాటు దళారీలకు దక్కుతున్న తీరు ఇంకెన్నేళ్ళు? పైపై ప్రకటనలు, ఎన్నికల హామీలతో రైతులను నమ్మించి నట్టేట ముంచుతున్న ప్రభుత్వాలు ఇప్పటికైనా రైతుగోసను మన్నించి వ్యవసాయ రంగ సమూల క్షాళనకై పూనుకోవాలి. భారత హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ లాంటి శాస్త్రవేత్తలు చేసిన మేలైన సూచనలు ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవాలి.



ముఖ్యంగా రైతులకు అదనుకు పెట్టుబడి సాయం, నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, భూసార పరీక్షలు, సేంద్రియ జీవ ఎరువులు, ఉపాధిహామీ పథకానికి అనుసంధానత, మార్కెట్ సదుపాయాలు ఆధునీకరణ, గిట్టుబాటు ధర, నిల్వ సదుపాయాలు, మౌలిక వసతుల పెంపు, వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సేద్య పద్ధతులు, నీటి పారుదల వ్యవస్థ మెరుగు వంటి చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి.

దళారీ వ్యవస్థ తగ్గించడానికి చర్యలు, ప్రభుత్వ నిత్య పర్యవేక్షణ, ధరలను మాయచేసే మాయగాళ్ల అదుపు, రైతులను మోసం చేసే వారిపై కఠిన చట్ట ప్రయోగంతో పాటు విరివిగా గిడ్డంగులు, శీతల గిడ్డంగుల ను పెంచి నిలువ సౌకర్యాన్ని పెంచాలి. అంతేకాకుండా ఆహారశుద్ధి పరిశ్రమను ప్రోత్సహించాలి. వ్యవసాయేతరులు వ్యవసాయ భూమి కొనుగోలును నిరుత్సాహపరచాలి. రైతు కూలీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషిచేస్తే రైతులపై భారం తగ్గుతుందని మరవరాదు. అంతేకాకుండా ప్రతి రైతును ప్రభుత్వానికి అనుసంధానం చేసుకుని నేరుగా రుణాలు, ఇతర ఉపకరణాలు అర్హులకే చేరేలా చర్యలు చేపట్టాలి. అంతేకాకుండా తనఖా లేకుండా బ్యాంకు రుణాలు, కంపెనీల అడ్డగోలు ప్రచారంపై నియంత్రణ, వ్యాపారస్తుల నుండి రశీదులు తప్పనిసరి చేయటం, వ్యవసాయోత్పత్తులు ప్రభుత్వం ద్వారా కొనుగోలు (వీలైనంత మేరకు), కరువు, వరద, పంటలపై చీడపీడలు లేదా వాతావరణ మార్పుల వల్ల నష్టం వాటిల్లితే నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం కృషి చేయాలి. రైతు కష్టానికి ఫలసాయం దక్కేలా చర్యలు గైకొనడమే కాదు వ్యవసాయ సంబంధ అన్ని సమస్యలను క్రమక్రమంగా పరిష్కరించాలి. వ్యవసాయంతో పాటు గా అనుబంధ రంగాలకు సైతం ఊతమిచ్చీ ప్రోత్సహించినపుడే ఆరుగాలం శ్రమించే రైతన్నకు కాసింత ఆలంబనగా ఉంటుంది.

వినోద్‌కుమార్ సుద్దాల
రీసెర్చ్‌స్కాలర్,
ఉస్మానియా యూనివర్సిటీ

మన లేఖలు

పోస్టాఫీస్ స్థాయిని పెంచాలి

వడ్డేపల్లి మండల కేంద్రమైన శాంతినగర్‌లో వున్న పోస్టాఫీస్ స్థాయిని పెంచాలి. ప్రస్తుతం చాలా పోస్టాఫీసులు కంప్యూటరీకరణ అవుతున్నాయి. కానీ మండల కేంద్రంలో వున్న శాంతినగర్ పోస్టాఫీస్ మాత్రం ఇంతవరకు కంప్యూటరీకరణ కాకపోవడం, మండల ప్రజలను విస్మయానికి గురిచేస్తుంది. శాంతినగర్ మండల కేంద్రం కావడంతో ఇక్కడ చాలా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, బ్యాంకులు ఉన్నాయి. చాలామంది పోస్టల్ సేవలను వినియోగించుకోవడానికి ఆసక్తి చూపుతారు. కంప్యూటరీకరణ లేకపోవడంతో చాలా మంది అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ పోస్టాఫీసులో మనీ ఆర్డర్ కానీ, రిజిస్టర్ పోస్టు కానీ చేస్తే, దానికి సంబంధించిన రసీదు మరుసటి రోజు ఇస్తున్నారు. ఇలాంటి అసౌకర్యాల కారణంగా చాలామంది పోస్టల్ సేవలు వినియోగించకుండా, ప్రైవేట్ కొరియర్లపై ఆధారపడుతున్నారు. ఈ కారణంగా పోస్టల్ శాఖ ఆదాయం తగ్గిపోతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేలుకోవాలి. శాంతినగర్‌లో పోస్టాఫీసును కంప్యూటరీకరణ చేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా వుంటుంది.

- షేక్ అస్లాం షరీఫ్,
శాంతినగర్, జోగులాంబ గద్వాల జిల్లా

పీడీయస్‌యూ రాష్ట్ర మహాసభలు

పీడీయస్‌యూ రాష్ట్ర మహాసభలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయి. ఫిబ్రవరి 10, 11 తేదీలలో ఉదయం 10 గంటలకు నాలికల్ రోడ్, రోటరీక్లబ్ ఫంక్షన్ హాల్, కామ్రేడ్ జార్జిరెడ్డి ప్రాంగణంలో ప్రతినిధుల సభ జరుగుతుంది. కె. వేణుగోపాల్, ప్రొఫెసర్ కె. లక్ష్మి నారాయణ, ఎన్. వేణుగోపాల్, ప్రొఫెసర్ కె.వై.రత్నం తదితరులు పాల్గొంటారు.

- పీడీయస్‌యూ,
తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం

ఏదైనా.., అది నిజమైనా, అబద్ధమైనా... చెబితే 'గోడ కట్టినట్టుండాలి' అంటుంటారు. ఇటుక మీద ఇటుక పేర్చి కట్టే గోడ ఒక్కోసారి ఇల్లవుతుంది, మరొకసారి జైలవుతుంది. మనచుట్టూ గోడలెన్నో ఉన్నాయి. సమాజంలో అంధవిశ్వాసాల గోడలు.., వ్యక్తుల మధ్య అపార్థాల గోడలు..., ప్రకృతికి, మనిషికి మధ్య అత్యాశల గోడలు. పూరిగుడిసైనా, అద్దాల మేడయినా... నాలుగు గోడలు తప్పనిసరి. కూడు, గూడు, నీడ అన్నారు.., మరి ఈ నీడనిచ్చే ఇల్లే నాలుగు గోడల పందిరి. నాలుగు గోడలు కలిస్తే ఒక ఇల్లవుతుంది, నాలుగిళ్ళు కలిస్తే ఒక ఊరవుతుంది. జీవితం చెప్పిన పాఠాల్ని మనం వినక పోతే, అది మన చేత 'గోడ కుర్చీ' వేయించక మానదు. వలపు మొగ్గతొడిగినపుడు వయసు గోడలు దూకకా మానదు. నినాద చిత్రాలకు కాన్వాస్ గోడే! తొలినాటి వార్తలకు వేదిక గోడ పత్రికలే! నాలుగ్గోడల మధ్య నలుగురు కలిసి జీవించవచ్చు, కానీ నలుగురి మధ్య 'గోడలు' ఉండకూడదు. గోడ అంటే బలం, దాన్ని బద్దలు కొట్టాల్సి వచ్చినపుడు అది నీ బలాన్ని సవాలు చేస్తుంది. నీ లోపలి గోడలనైనా, నీ చుట్టూ సమాజం కట్టిన గోడలనైనా కూల్చి తీరాల్సిందే! కానీ కొన్ని గోడలు చరిత్రకు చూపుడువేళ్ళవుతాయి, మరికొన్ని గోడలు కళ్ళకు, మెదళ్ళకు చూపునిస్తాయి. జీవితాన్ని అల్లుకున్న 'గోడ' ఇవాళ మిమ్మల్ని 'మైత్రి'లో పలకరిస్తోంది. - మీ 'మైత్రి'

భయం - భరోసా

గోడ




'నిలువెత్తు' జ్ఞాపకాలు

మనిషి గోడల్ని నిర్మించాడని మనం భావిస్తున్నా, గోడలు చరిత్రను నిర్మించిన దాఖలాలు ప్రపంచంలో చాలానే ఉన్నాయి. అలాంటి కొన్ని గోడల గురించి తెలుసుకుందామా?

చూయింగ్ గమ్ వాల్ (చూయింగ్ గమ్‌తో నిర్మించిన గోడ)

అమెరికాలోని సీటెల్‌లో 'చూయింగ్ గమ్ వాల్' ప్రపంచ పర్యాటకులకు అత్యంత ప్రీతిపాత్రమైన విశేషం. ఇదేమీ వందల, వేల ఏళ్ళ చరిత్ర కలిగిన గోడ కాదు. ఇటీవలి కాలంలో అంటే 1990ల్లో ఈ గోడ ఉనికిలోకి వచ్చింది. అప్పట్లో ఒక నాటక ప్రదర్శన శాల దగ్గర టిక్కెట్ల కోసం జనం క్యూలు కట్టేవారు. టిక్కెట్ కోసం వేచి చూసి, చూసి విసిగిపోయి తాము నములుతున్న చూయింగ్ గమ్‌ను గోడకి అతికించడం మొదలు పెట్టారు. అలా చూయింగ్ గమ్‌ను గోడకు అతికించే అలవాటు ఒకరి నుంచి మరొకరికి వైరస్‌లా పాకి పోయింది. గోడ మీదికి వేలాది చూయింగ్ గమ్‌లు వచ్చి చేరాయి. రంగుల రంగుల ఎంగిలి చూయింగ్ గమ్‌లతో ఈ గోడ కన్నుల పండుగలా ఉంటుంది. అయితే అవసరం ఉన్నా, లేకున్నా చూయింగ్ గమ్ ప్రేమికులు తమ కళాభినివేశాన్ని చాటుకోవడానికి తాము నమిలిన చూయింగ్ గమ్‌తో చిత్రాల్ని, తమ పేర్లని గోడ మీద చిత్రించడం మొదలు పెట్టారు. ప్రపంచంలోని పర్యాటక స్థలాల్లో ఇదే అత్యంత భారీ మొత్తంలో సూక్ష్మక్రిముల్ని కలిగిన ప్రదేశమని కూడా చెబుతారు.



బెర్లిన్ వాల్




రష్యాలో కమ్యూనిస్టుల పాలన అంతమై, రాజకీయ స్వాతంత్ర్యం ప్రభవించిన సందర్భానికి గుర్తుగా ఈ గోడను 1961లో తూర్పు జర్మనీ ప్రారంభించింది. రష్యన్ నియంతృత్వ పాలనను భరించలేక పశ్చిమ బెర్లిన్‌కు పారిపోతున్న తూర్పు బెర్లిన్ వాసుల్ని నిరోధించేందుకు ఈ గోడను నిర్మించారు. ఈ గోడలో భాగంగా ఒక చారిత్రక మ్యూజియం కూడా ఉంది. ఇందులో 1990 నుంచి 150 మంది చిత్రకారులు చిత్రించిన పెయింటింగ్‌లను పర్యాటకుల దర్శనార్థం ఉంచారు. ఈ గోడను స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల చిహ్నంగా కూడా భావిస్తారు.

చైనా మహాకుడ్యం (ది గ్రేట్ చైనా వాల్)



అంతరిక్షం నుంచి కూడా భూమ్మీద ఉన్న చైనా మహాకుడ్యం కనిపిస్తుందంటే అది ఎంత భారీ నిర్మాణమో మనం అర్థం చేసుకోవచ్చు. పర్వతాలు, ఎడారులు, పచ్చికబయళ్ళ మీదుగా ప్రయాణించే ఈ గోడ తూర్పు చైనా నుంచి పశ్చిమ చైనా పర్యంతం 5,500 మైళ్ళ మేరా విస్తరించి ఉంటుంది. ఇది కేవలం ఒక్క గోడ మాత్రమే కాదు, ఎన్నో చిన్నా, పెద్దా గోడల సముదాయం. ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటైన చైనా మహాకుడ్య నిర్మాణంలో క్రీస్తుపూర్వం 220-206 కాలానికి చెందిన చైనా చక్రవర్తి క్విన్ షి హాంగ్ నిర్మించిన గోడ విశేషమైంది. చైనా మహాకుడ్యాన్ని నిర్మించడానికి రెండువేల సంవత్సరాల కాలం పట్టింది.

ప్రేమ కుడ్యం (వాల్ ఆఫ్ లవ్)



ప్యారిస్ అంటే ప్రేమనగరం అంటారు. ఈ నగరంలోని అబీసెస్‌గార్డెన్‌లో నిర్మించిన 'వాల్ ఆఫ్ లవ్' వల్ల కూడా బహుశా ప్యారిస్‌కు ఈ పేరు వచ్చి ఉండవచ్చు. నలభై చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ గోడ మీద 612 లావా స్టోన్ పెంకులతో తాపడం చేశారు. లావాస్టోన్ అంటే అగ్నిపర్వతాల విస్ఫోటనంలో ప్రవహించిన లావా వల్ల ఏర్పడిన రాయి అన్నమాట. ఈ రాయిని అత్యంత ఎక్కువ ఉష్ణోగ్రతలో వేడి చేస్తారు. ఇలాంటి 'అగ్ని'రాతి పలకలతో తాపడం చేసిన ఈ గోడ మీద 'నైన్ -ని-నె-స్నే- ఇ- కొ-నొ', 'సె -రెట్- లెక్','తియా అమో' అంటూ పలుభాషల్లో 'నేను నిన్ను ప్రేమించాను' అనే చల్లని ప్రేమసందేశాల్ని రచించారు. దాదాపు మూడు వందల భాషల్లో వెయ్యిసార్లు ఈ ప్రేమసందేశాన్ని లిఖించారు. ఈ గోడను విశ్వప్రేమకు సంకేతంగా ఇద్దరు కళాకారులు రూపొందించారు.

బెల్‌ఫాస్ట్ శాంతి కుడ్యం



బ్రిటన్‌లోని పశ్చిమబెల్‌ఫాస్ట్‌లో నిర్మించిన శాంతికుడ్యానికి మతపరమైన కారణం ఉంది. క్రైస్తవమతానికి చెందిన ప్రొటెస్టెంట్లు, కాథలిక్కులు నివసించే ప్రాంతాల మధ్య అడ్డు గోడగా దీనిని నిర్మించారు. ఏనాడో సమసిపోయిన సంక్షోభాన్ని ఈ గోడ ఇంకా గుర్తుకు తెస్తూనే ఉందని చాలామంది విమర్శించినప్పటికీ, దీనిని శాంతికుడ్యంగానే పిలుస్తున్నారు. శాంతి అమూల్యమైనదన్న సందేశానికి చిహ్నంగా దీనిని పరిగణిస్తున్నారు.

- కల్కి

• వల్లన కవిత



కవితా భవంతులు

కాగితం మీద సిరాక్షరాలుగాను, పుస్తకాలుగాను కవిత్వం మన మనోఫలకమ్మీద ముద్రితమవడం సర్వసాధారణం. కాస్త అధివాస్తవికంగా అనిపించినా సరే, సామాన్య సత్యాన్నే అసామాన్య సత్యాలుగా పాఠకుల మనోకుడ్యాల మీద కవులు తమ భావోద్వేగాల్ని కవితలుగా చిత్రిస్తుంటారు. ఇదంతా మనకు తెలిసిన విషయమే. కానీ నెదర్లాండ్స్‌లోని 'లీడెన్' అనే నగరంలోని భవంతుల గోడల మీద పలు ప్రపంచభాషలకు చెందిన 110 కవితల్ని భారీగా పెయింట్ చేశారట. భవంతి గోడ ఎంత పెద్దదిగా ఉంటే అంత పెద్ద అక్షరాలతో గోడనంతా నింపేసేలా కవితల్ని చిత్రించడం మాత్రం ఆసక్తికరమైన అంశం. 'వాల్ పోయెమ్స్' అనే ఈ ప్రాజెక్ట్‌ను 'టెజెన్ బీల్డ్' అనే ప్రైవేట్ సంస్థ 1992లో మరీనా స్వెతైవా అనే రష్యన్ కవయిత్రి కవితతో ప్రారంభించింది. ఈ ప్రాజెక్ట్‌ను స్పానిష్ కవి ఫెడరికో గార్షియా లోర్కా కవితతో 2005న ముగించారు. ఇలా లీడెన్ నగర భవంతుల గోడలపై మెరిసిన కవితలలో ఇ.ఇ. కమ్మింగ్స్, లాంగ్‌స్టన్ హ్యూస్, జాన్ హాన్లో, లూయీస్ ఆలివర్, పాబ్లోనెరూడా, విలియమ్ షేక్స్‌పియర్, డబ్ల్యు బి ఈట్స్ వంటి పేరెన్నికగన్న కవుల కవితలు కూడా ఉన్నాయి. అన్నింటికన్నా విశేషం ఏమిటంటే, క్రీస్తుశకం 900 - 1100 కాలానికి చెందిన మన భారతీయ కవి వల్లన రచించిన ఒక సంస్కృత కవిత కూడా లీడెన్ నగరంలోని హాగ్వెగ్ 14 అనే వీధిలోని ఒక భవంతిపై చిత్రించారట. భారతీయులుగా మనం గర్వించాల్సిన విషయం ఇది.



గోడ నుంచి పుట్టిన 'వాల్ స్ట్రీట్'

అమెరికా ఆర్థిక సామ్రాజ్యానికి పెట్టని కోట 'వాల్‌స్ట్రీట్'. ప్రపంచ సంపన్నుల్లో అత్యధికులు నివసించే ధనహర్మ్యం ఈ ప్రాంతం. న్యూయార్క్ నగరంలోని వాల్‌స్ట్రీట్ పేరులోనే 'వాల్' (గోడ) అని ఉండడం వెనుక ఒక కారణం ఉంది. వాల్‌స్ట్రీట్ ఉనికి ఒక గోడతో మొదలైందని చరిత్ర చెబుతోంది. మన్‌హట్టన్ ద్వీపానికి దక్షిణ భాగంలో న్యూఆమ్‌స్టర్‌డామ్ అనే ప్రాంతంలో 17వ శతాబ్దంలో డచ్ పరిపాలకులు 12 అడుగుల గోడను నిర్మించారు. సముద్రపు దొంగలు, స్థానిక ఆటవిక జాతుల ప్రజల నుంచి తరచూ ఎదురవుతున్న దాడులను అరికట్టడానికి వారు ఈ గోడను నిర్మించారు. తదనంతర కాలంలో ఈ గోడకు సమీపంలో ఉన్న ప్రాంతానికి వాల్‌స్ట్రీట్ అని పేరు వచ్చింది. వాల్‌స్ట్రీట్ ఈస్ట్ రివర్, హడ్సన్ రివర్‌ల మధ్య (కాలువలు) ఉన్న వీధి. వాణిజ్య కార్యకలాపాలకు పెట్టింది పేరుగా ప్రసిద్ధి చెందింది వాల్‌స్ట్రీట్. అయితే 1699న బ్రిటీష్ వలస సామ్రాజ్యం ఈ గోడను కూల్చివేసింది. అయినప్పటికీ, ఈ వీధి పేరు మాత్రం వాల్‌స్ట్రీట్‌గానే కొనసాగుతోంది. కాలక్రమంలో వాల్‌స్ట్రీట్ అమెరికా ఆర్థిక సామ్రాజ్యంగా ఎదిగింది. కార్పొరేట్ సంస్కృతికి, ఉన్నత వర్గాల అహంభావానికి ప్రతీకగా ఎదిగింది ఈ వాల్‌స్ట్రీట్. వాల్‌స్ట్రీట్‌లోని మరో విశేషం ఏమిటంటే, ఈ వీధిలో బుసలు కొడుతూ పరుగెడుతున్న భంగిమలో ఒక ఎద్దు శిల్పం ఉంటుంది. దీన్ని 'ఛార్జింగ్ బుల్' లేదా 'వాల్ స్ట్రీట్ బుల్' అని పిలుస్తారు. దీని బరువు 3,200 కిలోలు. పదకొండు అడుగుల ఎత్తు, పదహారు అడుగుల వెడల్పు ఉన్న ఈ శిల్పాన్ని ఆర్థిక పురోగతికి, ఆశావాదానికీ చిహ్నంగా భావిస్తారు. వ్యావహారిక ఆర్థిక భాషా శాస్త్రంలో 19, అక్టోబర్, 1987ని బ్లాక్ మండేగా పిలుస్తారు. ఆ రోజున ప్రపంచంలోని స్టాక్‌మార్కెట్లన్నీ భారీ నష్టాలతో కుప్పకూలాయి. అయితే అంతటి గడ్డు పరిస్థితిలోను అమెరికా, ముఖ్యంగా వాల్‌స్ట్రీట్ సంపన్నుల ఆత్మవిశ్వాసం చెక్కుచెదరలేదని చెప్పడం కోసమే ఈ శిల్పాన్ని ప్రతిష్ఠించారు. ఆర్టురో డి మోడికా అనే ఇటాలియన్ శిల్పి ఈ శిల్పాన్ని రూపొందించారు. అయితే వాల్‌స్ట్రీట్ నడిబొడ్డున రంకెలేస్తున్న ఈ శిల్పం ఎదురుగా దీన్ని సవాలు చేస్తోందా అన్నట్టు 'ఫియర్‌లెస్ గర్ల్' పేరిట మరో శిల్పాన్ని గత ఏడాది ఏర్పాటు చేశారు.



అయితే దీన్ని 2018న తొలగించాల్సి ఉన్నప్పటికీ, ఈ ఏడాది ఫిబ్రవరి మాసమంతా వాల్‌స్ట్రీట్ నడిబొడ్డున అలాగే కొనసాగించేందుకు నగరపరిపాలనాధికారులు అంగీకరించారు. వ్యాపార ప్రపంచంలో ముందుకు దూసుకు వెళుతున్న మహిళల ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా ఈ శిల్పాన్ని ఏర్పాటు చేశారు. పోనీటైల్‌తో, గౌను ధరించిన ఒక అమ్మాయి ప్రతిమ ఇది.

వివాదం

ట్రంప్ 'అడ్డుగోడ'

ఇవాళ అంతర్జాతీయ మీడియా ఒక గోడ గురించి ఆదుర్దా పడుతోంది. మీడియా మాత్రమే కాదు, అమెరికా ప్రజల గుండెల్లో కూడా ఈ గోడ గుబులు పుట్టిస్తోంది. 'నీ పైత్యానికి అంతూ పొంతూ లేకుండా పోయింది' అంటూ అమెరికన్లు ఇవాళ తమ దేశ అధ్యక్షుడైన డోనాల్డ్ ట్రంప్‌ను ఈసడించుకుంటున్నారు. అయినా ట్రంప్‌గారి మాటే శాసనం కదా! గోడ వద్దంటూ ఎందరు గోల పెట్టినా ససేమిరా అంటూ 'గోడ కట్టాల్సిందే'నంటూ ఆదేశాలు జారీ చేసేశారు. మెక్సికో, అమెరికాల మధ్య సరిహద్దు ప్రాంతంలో వెయ్యి మైళ్ళ మేర అడ్డుగోడ కట్టితీరాల్సిందేనని ట్రంప్ గట్టి పట్టుపట్టారు. 'ఏ శక్తీ చొరబడలేనంతగా, అత్యంత శక్తిమంతమైన, పొడవైన, అందమైన గోడ'ను నిర్మించాలి. నిజానికి మెక్సికో- అమెరికా సరిహద్దు దాదాపు 3,100 కిలోమీటర్ల విస్తీర్ణాన్ని కలిగి ఉంటుంది. ట్రంప్ మహాశయుడేమో ఇందులో వెయ్యి కిలోమీటర్ల మేర గోడను నిర్మించాలని నిర్ణయించారు. మెక్సికో నుంచి అక్రమ చొరబాట్లను నియంత్రించడానికి ఇలా అడ్డుగోడ కట్టి తీరాల్సిందేనన్నది ఆయన ఉద్దేశం. ఈ అడ్డుగోడ నిర్మాణానికి రమారమి 10 నుంచి 12 బిలియన్ల డాలర్లు ఖర్చు అవుతాయని నిపుణులు అంచనా వేశారు. గోడ నిర్మాణానికి సంబంధించిన ఆదేశాల మీద సంతకాలు పెడుతూ, గోడ నిర్మాణానికి అవసరమయ్యే ప్రాథమిక నిధుల్ని అమెరికా ప్రజానీకమే పన్నుల రూపంలో చెల్లించాలని అధ్యక్షుల వారు హుకుం జారీ చేసేశారు. అయితే డబ్బు ఖర్చు పెట్టి కట్టుకోవడానికి ఇదేమీ ట్రంప్ గారి పెరటి గోడ కాదు. ఈ గోడ నిర్మాణం కోసం ఆ ప్రదేశంలో ఎన్నో అరుదైన జీవజాతులు నివసించే అభయారణ్యాలను తుడిచిపెట్టాల్సి వస్తుంది. జీవ వైవిధ్యానికి హాని చేసి కట్టే ఈ గోడ వల్ల ఎవరికీ ఉపయోగం లేదని భౌగోళిక శాస్త్రవేత్తలు పెదవి విరుస్తున్నారు. చరిత్రలో అత్యంత ప్రసిద్ధికెక్కిన 'చైనా వాల్'ను నిర్మించడానికి రెండు వేల సంవత్సరాలు పట్టిందని, అయినా ఏ ఆటవిక జాతుల దాడుల్ని నిలువరించడానికి దాన్ని నిర్మించారో, ఆయా జాతుల దాడుల్ని ఆ



గోడ ఆపలేక పోయిందని, 'ట్రంప్ వాల్' నిర్మాణం వల్ల ఖర్చు, పర్యావరణ నష్టం తప్ప మరో ప్రయోజనం లేదని వీరందరూ ముక్తకంఠంతో చెబుతున్నారు. గోడ నిర్మాణాన్ని తలపెట్టిన భూభాగం స్వభావం కూడా భిన్నమైందని, అక్కడ గోడ నిర్మాణాన్ని చేపట్టినా, ఆ గోడ ఎక్కువ కాలం నిలబడదని, ఆ మట్టిలో క్లోరైడ్ నిల్వలు అధికంగా ఉండడం వల్ల గోడ నిర్మాణంలో ఉపయోగించే ఇనుము త్వరగా పాడై పోయి, గోడ స్వల్పకాలంలోనే కూలిపోతుందని నిపుణులు చెబుతున్నారు. అయినా రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా? ట్రంప్ తలచుకుంటే, గాల్లో కూడా గోడలు, కోటలు కట్టేయగలరు మరి.., 'ట్రంప్ వాల్' భవితవ్యాన్ని కాలమే నిర్ణయించాలి.

హైదరాబాద్‌లో అన్నా హజారే 'సందేశ్ సభ'

(మొదటిపేజీ తరువాయి)

సన్నాహక కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హజారే, ఇందులో భాగంగా హైదరాబాదులో పర్యటించనున్నారు. ఈ మేరకు ఇండియా ఎగెనెస్ట్ కరప్షన్ వాలంటీర్స్ (ఐఏసీవీ) అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి రజనీకాంత్ ఒక ప్రకటన చేశారు. రైతులను ఆదుకునేందుకు, ఎన్నికల వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు, అవినీతిని అంతమొందించాలనే డిమాండ్లతో హజారే ఉద్యమం వచ్చే నెల ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా మార్చి 23 నుంచి ఢిల్లీలో హజారే అమరణ నిరాహార దీక్ష చేపట్టనున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో ఆయన విస్తృతంగా పర్యటించనున్నారు. హజారే దీక్షకు ప్రజలను సన్నద్ధం చేసేందుకు బహిరంగ సభలను పెద్ద ఎత్తున ఐఏసీవీ నిర్వహిస్తోంది. హైదరాబాద్, ఏవీ కాలేజీలో జరిగే అన్నా హజారే బహిరంగ సభను 'సందేశ్ సభ' పేరుతో వ్యవహరిస్తున్నట్టు అసోసియేషన్ తెలిపింది. ఈ కార్యక్రమంలో 100 స్వచ్ఛంద సంస్థలు పాల్గొంటుండగా, 5000 మంది రైతులు, యువతీ యువకులు ఈ సభకు తరలివస్తున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. రైతులకు 50 శాతం మద్దతు ధర, 60 ఏళ్లు నిండిన అన్నదాతలకు ఐదు వేల రూపాయల పెన్షన్, అవినీతి లేని సమాజం కోసం లోక్ పాల్ వంటివి ప్రధాన డిమాండ్లుగా మరోమారు హజారే ఉద్యమం తెరపైకి వచ్చింది.

కంది.. రంది



(మొదటిపేజీ తరువాయి)

పంటకు పెట్టుబడి? బయట అప్పడిగితే.. రూ.100కు 4 రూపాయల వడ్డీ అంటుర్రు. వేరే మార్గం లేక అక్కడే ఉన్న దళారులకు క్వింటాకు రూ.2 వేల చొప్పున విక్రయించి ఇంటిబాట పట్టాడు. తిరిగి అదే దళారీ రైతు నుంచి కొన్న 2గంటల్లోనే మార్కెట్ అధికారులకు రూ.5450 చొప్పున కందులను విక్రయించాడు. ఇదీ రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో నిత్యకృత్యంగా కన్పిస్తోందంటే.. అతిశయోక్తి కాదు.

దగా పడుతున్న రైతులు..

కందికి మద్దతు ధరగా రూ.5450ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 1.34 లక్షల టన్నుల కందులు విక్రయానికి వస్తాయని ప్రభుత్వ అంచనాకనుగుణంగా మార్క్‌ఫెడ్, హాకాల ద్వారా కందుల కొనుగోళ్లను చేపట్టింది. ఇంకా రైతుల వద్ద దాదాపు 60 వేల టన్నుల కందులు ఉన్నట్టు అంచనా వేసింది. ఇదే అదునుగా భావించిన దళారులు స్థానికంగా పీఏసీఎస్, మార్కెట్ అధికారులతో కుమ్మక్కై రైతులను నిలువునా దోచుకుంటున్నారు. మార్కెట్ యార్డులకు విక్రయించేందుకు తీసుకొచ్చిన కందులను రకరకాలుగా కొర్రీలు పెడుతూ మద్దతు ధర అందనివ్వడం లేదు. కొనుగోళ్ల ప్రక్రియకు దాదాపు నెల రోజుల సమయం పడుతుంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు దళారులకు విక్రయిస్తున్నారు. ఈ విక్రయం సమయంలోనే సదరు రైతు పట్టా పుస్తకం, తదితర పత్రాలను జిరాక్స్ తీసుకుంటున్నారు. తదనంతరం అధికారులతో ముందస్తుగా చేసుకున్న ఒప్పందంతో, దర్జాగా ఆ రైతుల పేరు మీదనే దళారులు మద్దతు ధరకు కందులను విక్రయిస్తున్నారు. దీనికిగాను అధికారులకు దళారులు పెద్దమొత్తంలో ముట్టజెప్పుతుండడం విశేషం.

తప్పించుకునే ప్రయత్నంలో ప్రభుత్వం

ఈ ఏడాది 1.39 లక్షల టన్నుల మేర కంది దిగుబడి ఉంటుందని అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, అందులో 25 శాతం కందులను కొనుగోలుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. అయితే సాధారణంగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు దళారులు కొనుగోలు చేసే ధరకు వందల్లోనే వ్యత్యాసం ఉంటుంది. దాంతో రైతులు ప్రభుత్వానికి విక్రయించడం కంటే.. దళారులకు విక్రయిస్తేనే డబ్బులు త్వరగా అందుతాయని.. ప్రైవేటు వైపే మొగ్గు చూపేవారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకునే కేంద్రం 25 శాతం కొనుగోలు చేస్తామన్నా.. సరేనంది. కానీ ఈసారి ఆ పరిస్థితి తలకిందులవుతూ రూ.2 వేల నుంచి రూ.3వేలకు పైగా వ్యత్యాసం ఉండడంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల బాట పట్టారు. దీనికితోడు కేంద్రం 67వేల మెట్రిక్ టన్నుల కంటే మించి ఒక్క గింజా కొనుగోలు చేసేది లేదని తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వంపై పిడుగు పడ్డట్టైంది. ఇప్పటికే రైతుల నుంచి మార్క్‌ఫెడ్, హాకా సంస్థలు దాదాపు 1,40,021 టన్నుల కందులను కొనుగోలు చేసింది. వీటికి సంబంధించి రైతులకు మార్క్‌ఫెడ్, హాకాలు రూ.76364 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు రూ.226.53 కోట్లు మాత్రమే చెల్లించాయి. ఒకవేళ కేంద్రం 67 వేల టన్నుల కందులను కొనుగోలు చేస్తే.. రూ.140 కోట్ల వరకు అందుతాయి. మిగిలిన రూ.396 కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుంది.

కొత్తగా కందులను కొనుగోలు చేస్తే మరింత భారం పడుతుందనే కారణంతో కందుల కొనుగోలు మందగించనుంది, ఈ ఉద్దేశంతో..ఆయా జిల్లా మార్కెటింగ్ అధికారులకు కందుల కొనుగోళ్లపై ఆచితూచి వ్యవహరించాలని మౌఖిక ఆదేశాలు అందినట్టు సమాచారం. ఒకవేళ కేంద్రం లక్ష టన్నులకు పైగా కొనుగోలు చేస్తేనే.. కందుల కొనుగోళ్లను

రాష్ట్ర ప్రభుత్వమూ మొండి చేయ్యి చూపే అవకాశం

ముమ్మరం చేయాలని సూత్రపాయంగా తెలిపినట్టు మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. నిజంగా ఇదే పరిస్థితి ఎదురయితే.. దళారులు మరింతగా రెచ్చిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో చెల్లిస్తున్న రూ.1800 నుంచి రూ.2 వేల ధర కాస్త.. రూ.1000కి పడిపోయే అవకాశం ఉంది. ఏదీఏమైనా ప్రభుత్వం తెగించి కందులు కొనుగోలు చేస్తుందా..? లేక భారం పడుతుందని తప్పుకుంటుందా? అనే విషయంపై కంది రైతులు రంది పడుతున్నారు.

రాహుల్ పప్పుకాదు.. పిప్పి చేస్తాడు

(మొదటిపేజీ తరువాయి)



అయ్యారన్నారు. సభ్య త, మర్యాద మరచి తమ పార్టీ వారు మాట్లాడినా సరికాదని తాను తరచూ గుర్తు చేస్తుంటానన్న జానా రెడ్డి, 'మా పార్టీని లోఫర్ పార్టీ అంటే, టీఆర్ఎస్ బ్రోకర్ల పార్టీ అంటే ఏం చెప్పగలం?' అని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పట్ల కనీస గౌరవం లేకుండా టీఆర్ఎస్ మాట్లాడుతోందని, ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని ఆయన అన్నారు. తమ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై కేటీఆర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ముక్త కంఠంతో ఖండించారు. రాహుల్‌కు రెండు సార్లు ప్రధాని అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ఆ పదవిని వద్దనుకున్న గొప్ప నేత రాహుల్ గాంధీ అంటూ జానారెడ్డి అన్నారు. రాహుల్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగానే గుజరాత్ ఎన్నికల్లో మోదీకి మూడు చెరువుల నీళ్లు తాగించారని, అలాంటి తమ నేత, కేటీఆర్ కంటికి పప్పులా కనిపిస్తున్నారా అంటూ జానా ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ పప్పు కాదని, పిప్పి పిప్పి చేసే నాయకుడని, ఓటమి భయంతోనే కేటీఆర్ దిగజారి మాట్లాడుతున్నట్టు జానా రెడ్డి ధ్వజమెత్తారు. వ్యక్తులకు గౌరవం ఇవ్వకపోయినా, పదవిని చూసైనా గౌరవమివ్వాలని ఆయన సూచించారు. మరోవైపు కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై టీఆర్ఎస్ ప్రశ్నిస్తే, తమ పార్టీ ఇందుకు మద్దతిస్తుందని మరో ప్రశ్నకు సమాధానంగా జానా రెడ్డి జవాబిచ్చారు.

ఉద్యమ స్ఫూర్తి ఏమైంది?

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రధాని మోదీ అవమానపరిచేలా మాట్లాడినా సభలో టీఆర్ఎస్ ఎంపీలు నోరుమూసుకుని కూర్చున్నారని మరో కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి ఆరోపించారు. సీబీఐ కేసులకు భయపడే కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టు పెడుతూ, రాష్ట్రానికి ఎంత అన్యాయం జరిగినా పెదవి విప్పడం లేదని జీవన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ఎక్కడికి పోయిందని, జై తెలంగాణ నుంచి జై ఆంధ్ర అయిందని ఆయన ఎద్దేవా చేశారు. విద్యావంతుడైన కేటీఆర్, ప్రపంచ దేశాలన్నీ చుట్టివచ్చాక ప్రయోగిస్తున్న భాష సరైంది కాదని సీఎల్పీ ఉపనేత గీతా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం అసెంబ్లీలోని మీడియా హాల్‌లో మీడియాతో ముచ్చటించిన కాంగ్రెస్ నేతలు, తమ పార్టీపైన, పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి పైన కేటీఆర్ గురువారం చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు.

రిజిజుపై సభాహక్కుల నోటీసు

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత రాజ్యసభలో రేణుకాచౌదరి నవ్వుకు సంబంధించిన వీడియో పెట్టి పోస్ట్ చేశారు. ప్రధాని కూడా తనకు రామాయణం సీరియల్ తర్వాత ఇప్పుడే ఇలాంటి నవ్వు చూసే అవకాశం లభించిందంటూ పరోక్షంగా శూర్పణఖ అన్నట్లు ప్రసంగంలో ప్రస్తావించారు. ప్రధాని వ్యాఖ్యలు, రిజిజు ఫేస్‌బుక్ పోస్ట్ రెండూ అభ్యంతరకరంగానే ఉన్నాయని రేణుకా చౌదరి మండిపడ్డారు. ఫేస్‌బుక్ పోస్ట్‌పై అభ్యంతరాలు రావడంతో దాన్ని తొలగించిన రిజిజు.. ట్విట్టర్‌లో మాత్రం రామాయణం క్లిప్ లేకుండా మిగిలిన వీడియోను ఆయన పోస్ట్ చేశారు. ప్రధానమంత్రి తన పదవికి ఉన్న గౌరవాన్ని కూడా మట్టిలో కలిపారని, అందుకు ఆయన క్షమాపణ చెప్పాల్సిందేనని రేణుకాచౌదరి డిమాండు చేశారు. కేవలం ఒక మహిళా పార్లమెంటు సభ్యురాలు నవ్వినంత మాత్రాన ప్రధాని ఇలా వ్యాఖ్యానించడం సిగ్గుచేటని, అందుకు ఆయన క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆనంద్ శర్మ కూడా డిమాండ్ చేశారు. ఇక ఆయన మంత్రుల్లో ఒకరు ఏకంగా సోషల్ మీడియాలో అత్యంత అభ్యంతరకరమైన పోస్టింగ్ పెట్టినా దానిపై కూడా ప్రధాని మౌనంగా ఊరుకోవడం తగదని చెప్పారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

తరలిస్తుండంగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచాడు. ఉప్పలయ్యకు తనకున్న మూడు ఎకరాల పొలంలో వానకాలంలో రెండు ఎకరాల్లో వరిసాగు చేశాడు. దోమ పోటు సోకడంతో అప్పు చేసి మందు కొట్టాడు. అయినప్పటికీ పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. మరో ఎకరంలో మిర్చి పంట వేయగా ఆ పంట చీడ సోకింది. దీంతో ఆ పంటను తీసీ కూరగాయల సాగు మొదలుపెట్టాడు. ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసికంగా కుంగిపోయాడు. గురువారం రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఉపలయ్యకు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. రోడ్డున పడ్డ వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రత్యేకహోదాకు మద్దతు

- పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయాలి
- ఏపీ వాళ్లవి న్యాయమైన డిమాండ్లు
- ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఆంధ్రప్రదేశ్ ప్రజల న్యాయమైన డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్ద తు ఇస్తుందని, ఆ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇచ్చి తీరాల్సిందేనని పార్టీ జాతీయాధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ఇందుకోసం పార్టీలన్నీ ఏకమై ఈ డిమాండుకు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ''ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు పోలవరం ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేయాలన్న న్యాయమైన ప్రజల డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తోంది. ఇప్పటికైనా అన్ని పార్టీలు ఏకమై న్యాయపోరాటానికి మద్దతివ్వాలి'' అని రాహుల్ ట్వీట్ చేశారు. దానికి 'ఐఎన్‌సీ స్టాండ్స్ విత్ ఆంధ్రా' అనే హ్యాష్ ట్యాగ్ కూడా జతచేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత పార్లమెంటు ఉభయ సభల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, అలాగే బడ్జెట్ కేటాయింపులలో అన్యాయాన్ని సరిచేయాలని గట్టిగా పోరాడుతున్న విషయం తెలిసిందే. తెలుగుదేశం, వైఎస్ఆర్‌సీపీలకు చెందిన ఎంపీలు ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేయడంతో పాటు గురువారం ఏపీ మొత్తం బంద్ నిర్వహించారు కూడా. మరోవైపు ఏపీలో ప్రత్యేక హోదా సాధన కోసం జేఏసీ ఏర్పాటుకు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రయత్నాలు ప్రారంభించారు.

అందరికీ ఆరోగ్య పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)



సేవలను మరింత సమర్ధవంతంగా ఉపయోగించుకునే విధంగా కార్యచరణ రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు ప్రగతి భవన్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఆశా వర్కర్లకు మరోసారి జీతాలు పెంచాలని సీఎం నిర్ణయించారు. వీరితో పాటు సెకండ్ ఏఎన్ఎంలకు కూడా జీతాలు పెంచుతున్నట్లు ప్రకటించారు. ప్రజారోగ్యం విషయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా ఉండేలా నిలపాలని అధికారులను ఆదేశించారు.

బోదకాలు బాధితులకు పెన్షన్

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి బోదకాలు బాధితులకు నెలకు వెయ్యి రూపాయలు పింఛన్ ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. రాష్ట్రంలో 47 వేల మంది బోదకాలు బాధితులు ఉన్నారని అంచనా. పెన్షన్ కోసం అవసరమైన నిధులు వచ్చే బడ్జెట్‌లో కేటాయించనున్నారు. తమ నియోజక వర్గ పరిధిలో బోదకాలు బాధితులు ఎక్కువగా ఉన్నారని , వారిని ఆదుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరావు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో వీరి సమస్యపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. బోదకాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని , అన్ని గ్రామాల్లో బోదకాలు బాధితుల వివరాల సేకరణకు సర్వే చేయాలని సీఎం ఆదేశించారు.

గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారు రోగనిర్ధారక పరీక్షలు చేయించుకోవాలన్న అవగాహన ఉండకపోవడం వల్ల చాలా రోగాలను ప్రాథమిక దశలో గుర్తించలేకపోతున్నారని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇక నుంచి ఇలా జరగడానికి వీలులేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వమే అన్ని గ్రామాల్లో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయిస్తుందని కేసీఆర్ ప్రకటించారు. రక్త నమూనాలు సేకరించి , రోగ నిర్ధారక పరీక్షలు చేయించి , రోగం గుర్తించిన వెంటనే ప్రభుత్వ పరంగానే చికిత్స చేయాలని, మందులు అందించాలని , దీని కోసం ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదని సీఎం ప్రకటించారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడడం కన్నా మించిన ప్రాధాన్యత ప్రభుత్వానికి ఏదీ లేదన్నారు. రోగాలు ప్రబలకుండా ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఏర్పడిన తరువాత ప్రభుత్వ వైద్యం తీరు మారింది. ప్రభుత్వ ఆసుపత్రులు కూడా ఎంతో మెరుగయ్యాయి. కేసీఆర్ కిట్ పథకం అద్భుతంగా అమలు అవుతుందని సీఎం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించింది. వైద్యాధికారులు పని తీరుపై సంతృప్తి, సంతోషం వ్యక్తమతున్నదని, వైద్యాధికారులు తీసుకుంటున్న చర్యల వల్ల మలేరియా, డెంగ్యూ మరణాలు తగ్గాయని చెప్పారు. గ్రామాల్లో నిరుపేదల ముంగిట్లోకే వైద్యం చేరాలని సీఎం ఆకాంక్షించారు. గ్రామాల్లో పని చేస్తున్న వైద్య సిబ్బంది, అధికారులను సమన్వయం చేస్తూ, ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలు పెంచుతామని తెలిపారు. ప్రజారోగ్యం విషయంలో తెలంగాణ దేశానికి దారి చూసే విధంగా తయారు కావాలన్నది తన లక్ష్యమని సీఎం ప్రకటించారు. కేసీఆర్ కిట్ మూలంగా అనవసర ఆపరేషన్లు బాగా తగ్గాయని సీఎం తెలిపారు. ఓపికగా విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి ఇన్సెంటివ్స్ ఇస్తామని ప్రకటించారు. ప్రయివేట్ ఆసుపత్రులకు కేసీఆర్ కిట్‌ను వర్తింప చేయమని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ, ముఖ్యకార్యదర్శులు నర్సింగ్ రావు, శాంతకుమారి, మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర వాకాటి కరుణ, మిషన్ భగిరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికో 'అగ్రి'యూనిట్

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన 'అగ్రి టెక్ సౌత్-2018 ఎగ్జిబిషన్', 'అగ్రి టెక్నాలజీ, ఇన్నోవేషన్స్' సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ఏ చేయి అన్నం పెడుతుందో.. అదే చేయి పెట్టుబడికి అప్పు కోసం చేయి చాస్తోందన్నారు. అందుకే ఏ తల్లిదండ్రులూ తమ పిల్లలను వ్యవసాయం చేసేందుకు ప్రోత్సహించడం లేదని చెప్పారు. వీటిని దూరం చేసేందుకు రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగు నీరందించడమే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని శరవేగంగా చేపడుతున్నట్టు తెలిపారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే దేశంలోనే తొలిసారిగా ముందస్తు పెట్టుబడిగా ఎకరానికి రూ.4వేలు అందిస్తున్నామని, మే 15 నాటికి రైతులకు చెక్కులు అందజేయనున్నట్టు వివరించారు. కనీస మద్దతు ధర అందినప్పుడే.. రైతులకు న్యాయం జరుగుతుందని, మద్దతు ధర అంశం కేంద్రం పరిధిలో ఉన్నదని గుర్తు చేశారు. ఈ ఏడాది సంవత్సరంలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల కందులు పండితే.. కేంద్ర ప్రభుత్వం కేవలం 70 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామనడం సరికాదన్నారు. కేంద్రం, వ్యాపారులు రైతుల పంటలను కొనుగోలు చేయనిపక్షంలో రైతు సమన్వయ సమితులు కొనుగోలు చేస్తామని చెప్పారు. అలా కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు పెద్ద ఎత్తున గోదాంలను నిర్మించినట్టు పేర్కొన్నారు. దేశంలోనే అత్యధికంగా పాలీహౌజ్‌లను మంజూరు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ నిలిచిందని, ఉన్నత విద్యను అభ్యసించిన వారే ఈ పాలీహౌజ్ రంగంలోకి వస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో రమేశ్ దాట్ల, అనిల్ కుమార్, డాక్టర్ వి.ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సభా సంఘం నివేదికను అమలు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

సందర్శించారు. దీక్షలో కూర్చున్న వారితో నిమ్మరసం తాగించి దీక్ష విరమింప చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రైవేట్ యాజమాన్యం కలిసి కార్మికులను రోడ్డుపాలు చేశాయన్నారు. కర్మాగారానికి ప్రైవేట్ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి 24 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు వారికి వేతనాలు అందించలేదని, కార్మికులు అర్ధ ఆకలితో అలమటిస్తున్నారన్నారు. ఇప్పటివరకు నలుగురు కార్మికులు మృతి చెందారని, వారికి కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు వారి కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

జనసేన తడబాటు

చర్చనీయాంశంగా మారిన జేఏసీ ఆలోచన



- రాజకీయ పార్టీగా రూపాంతరం ఎప్పుడు
- నిర్మాణం, కమిటీలపై దృష్టి పెడతారా..లేదా..!
- ఉండవల్లి.. జేపీతో చర్చలు దేనికి సంకేతం
- సమస్యలపై అవగాహనకే సమయం సరి
- ఏపీ బంద్‌కు మద్దతు పలికినట్లా.. లేనట్టా
- రోడ్లమీద కనిపించని జనసేన జెండాలు

(మనం ప్రతినిధి, అమరావతి)

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై రాష్ట్రమంతా ఒక్కటై ఆందోళన చేసినా, బంద్ పాటించినా అసలు ఈ ఉద్యమంలో జనసేన పాత్ర ఎక్కడా కనిపించలేదు. రోడ్ల మీద ఒక్క కార్యకర్త గానీ.. ఎక్కడైనా జనసేన జెండా గానీ కనిపిస్తే ఒట్టు. అసలు ఆ పార్టీ అడుగులు ఎటువైపు..? సొంతంగా పోటీ చేస్తారా..! 2014 సీన్‌ను రిపీట్ చేస్తూ ఏదో ఒక పార్టీ లేదా కొన్ని పార్టీల కూటమికి మద్దతుగా ఉండిపోతారా? ఏమో, పవన్ కల్యాణ్ ఎప్పుడు ఏ నిర్ణయమైనా తీసుకోవచ్చు. అసలు ఎన్నికల రాజకీయాలు పక్కన పెడితే ఈలోపు చేయాల్సిన కర్తవ్య నిర్వహణలో కూడా జనసేన విఫలమవుతోందన్న మాట వినిపిస్తోంది. దీంతో రాష్ట్రంలో బలమైన మూడో ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్న వారికి నిరాశే మిగిలేలా ఉంది.

అందరూ ముందున్నా..

ఎన్నికలు సమీపిస్తున్నాయి. అన్ని పార్టీలు తమ అస్త్ర శస్త్రాలన్నింటినీ సిద్ధం చేసుకుంటున్నాయి. ఎన్నికల వేడి రగులుతున్న వేళ ఓటర్ల నాడి పట్టి ఓట్ల కలెక్షన్లను రాబట్టేందుకు ఇప్పటి నుంచి వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగి తేలుతున్నాయి. నేరుగా ప్రజల వద్దకు వెళ్లే ప్రణాళికలను ఇప్పటి నుంచే అమలు చేస్తున్నాయి. వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర పేరుతో ప్రజల వద్దకు వెళుతుండగా మరో వైపు అధికార తెలుగుదేశం పార్టీ నిన్న మొన్నటి దాకా జన్మభూమి పేరుతో తమ ప్రతినిధులను ప్రజల వద్దకు పంపించింది. ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యేలను, మంత్రులను నిరంతరం క్షేత్రస్థాయి పనులకు పురమాయిస్తున్నారు. మరి, రాష్ట్రంలో మూడో రాజకీయ పార్టీగా ఆవిర్భవించే అవకాశాలున్న జనసేన మాత్రం దిశానిర్దేశం లేని సందిగ్ధ స్థితిలోనే ఉండిపోతోంది. జనసేన పార్టీ ఇంకా పూర్తిగా నిర్మాణం కాకపోవచ్చు గానీ పవన్ కల్యాణ్ పిలుపిస్తే ఆయన అభిమానులు వేలాదిగా రోడ్లమీదకు వస్తారు. తెలంగాణ, రాయలసీమలో అక్కడక్కడ పర్యటనలు చేసి తిరిగి హైదరాబాద్ వెళ్లిన పవన్.. ఇప్పుడు ప్రత్యేక హోదా కోసం జేఏసీ అంటూ కొత్త ప్రతిపాదన తేవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధన రాజకీయాల్లో నెగ్గుకురాలేమని ప్రకటన చేసి.. పూర్తిగా రాజకీయాలకు దూరంగా ఉన్న జేపీని పవన్ కలవడంపై ఎవరికీ ఆక్షేపణ లేదు కానీ.. ఇపుడున్న పరిస్థితుల్లో జనసేన కోసం ఎదురుచూస్తున్న వారికి ఎలాంటి సంకేతాలను ఇవ్వదలిచారో అర్థం కావటం లేదు. స్వీయానుభావాలతో పవన్‌కు జేపీ ఎలాంటి సలహాలు ఇచ్చి ఉంటారో ఊహించటం కష్టమేమీ కాదు. 'ఎన్నికల రాజకీయాలు అంత తేలిక కాదు.. అమాయకంగా ముందుకు వెళ్లొద్దు' అనే ఆయన హితబోధ చేసినట్లు లీకులు కూడా వచ్చాయి. ఒక వైపు తెలంగాణలో జేఏసీ క్రమంగా రాజకీయ పార్టీగా మారుతుంటే.. ఏపీలో పార్టీగా ఉన్న జనసేన ఇప్పుడు జేఏసీ ప్రతిపాదనలు తెచ్చి రాజకీయంగా ఎందుకు వెనకడుగు వేస్తోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్రంలో టీడీపీ, వైఎస్ఆర్‌సీపీలకు ఉన్నట్టుగా జనసేనకు పార్టీ నిర్మాణం లేదు. ఎక్కడా కమిటీలను ఏర్పాటుచేసిన దాఖలాలు కూడా లేవు. టీడీపీ.. వైఎస్ఆర్‌సీపీ లాంటి బలమైన పార్టీలను ఢీకొనాలంటే జనసేన పార్టీ వెల్లువలా ముందుకు ఉరకాలి. ప్రజల వద్దకు రావాలి. దుష్టపాలనను దునుమాడాలి. కానీ అదంతా పవన్ మాటల్లో తప్ప చేతల్లో చూపించటం లేదు. పార్టీ పర్యటనలు చేస్తూ టీడీపీ మంత్రుల ఆతిథ్యం స్వీకరించడం విమర్శలకు తావిచ్చింది.

జేఏసీ ఎందుకు?

విభజన హామీల అమలుకు జేఏసీ ఏర్పాటుచేయాలని పవన్ ఇప్పుడు నిర్ణయించడం చాలా ఆలస్యంగా తీసుకున్న నిర్ణయమనే అంటున్నారు. నాలుగేళ్లుగా పలు సందర్భాల్లో ప్రత్యేక హోదా గురించి ఇతర అంశాల గురించి ఆయన ప్రశ్నించారు. నిజంగా జేఏసీ ఆలోచనే ఉంటే అదేదో రెండు మూడేళ్ల క్రితమే ఏర్పాటు చేసి ఉంటే ఇప్పటికి దాని విజయాలు కనిపించేవి. ఇపుడు ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ, స్వయంగా అధికారపక్షం సైతం రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ రోడ్లమీదకు వచ్చాక ఇప్పుడు జేఏసీ ఏం చేస్తుంది? జేఏసీ నిర్మాణం, కార్యాచరణకు పట్టే సమయమెంత? ఇవన్నీ ప్రశ్నార్థకాలుగానే మిగిలిపోతున్నాయి. అందువల్లే జనసేన అడుగులు తడబడుతున్నాయన్న అభిప్రాయం నెలకొంది.



జాతీయస్థాయిలో పేరు తెచ్చుకున్న దక్షిణాది దర్శకుడు మణిరత్నం. జయాపజయాలతో సంబంధం లేకుండా ఆయన సినిమాల కోసం ఎదురుచూస్తుంటారు ప్రేక్షకులు. ప్రస్తుతం ఈ లెజండరీ డైరెక్టర్.. కుటుంబకథా నేపథ్యంగా సాగే ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. శింబు, అరవింద్ స్వామి, అరుణ్ విజయ్, విజయ్ సేతుపతి, జ్యోతిక, అదితి రావ్ హైదరీ, ఐశ్వర్యరాజేష్, ప్రకాష్ రాజ్, జయసుధ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి తెలుగు, తమిళ భాషల్లో టైటిల్స్‌ను ప్రకటించారు. తెలుగులో 'నవాబ్' పేరుని.. తమిళంలో 'చెక్క చివంద వాణం' అనే పేరుని నిర్ణయించారు. ఈ రెండు భాషలకి చెందిన ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌ను కూడా శింబు, అరవింద్ స్వామి, అరుణ్ విజయ్, విజయ్ సేతుపతి కళ్ళను చూపుతూ డిజైన్ చేశారు. మణిరత్నం ఆస్థాన సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహమాన్ స్వరాలను సమకూరుస్తున్న ఈ చిత్రానికి తెలుగు వెర్షన్‌కు గాను సిరివెన్నెల సీతారామశాస్త్రి పాటలను అందిస్తున్నారు. సంతోష్ శివన్ సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు చేపడుతున్నారు. మద్రాస్ టాకీస్, లైకా ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ ఏడాదిలోనే ఈ సినిమా తెరపైకి రానుంది.

ప్రేమికుల రోజున..

రామ్ చరణ్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'రంగస్థలం'. సుకుమార్ దర్శకుడు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ (సి.వి.ఎం) నిర్మాతలు. ఈ చిత్రాన్ని మార్చి 30న విడుదల చేస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీత సారథ్యం వహిస్తున్నారు. 'ఎవడు' తర్వాత చరణ్, దేవిశ్రీ కాంబినేషన్‌లో రానున్న సినిమా ఇది. ఈ ఆల్బమ్‌లో తొలి పాటను వేలంటెన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 13న విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రం మా బ్యానర్ వాల్యూను పెంచడమే కాకుండా మా సంస్థకు హ్యాట్రిక్ హిట్‌ను అందించే చిత్రమవుతుందని చిత్ర నిర్మాతలు తెలిపారు.


• సమంత

సినిమాకు కథే హీరో

– వరుణ్‌తేజ్

వరుణ్‌తేజ్, రాశీ ఖన్నా జంటగా నటించిన చిత్రం 'తొలిప్రేమ'. వెంకీ అట్లూరి దర్శకుడు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాత. ఫిబ్రవరి 10న సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరో వరుణ్ తేజ్ పాత్రికేయులతో సినిమా గురించి ముచ్చటించారు..

రెండింటికీ పోలిక లేదు..

మా 'తొలిప్రేమ'ను కల్యాణ్ బాబాయ్ తొలిప్రేమతో పోల్చలేం. ఎందుకంటే అప్పటి జనరేషన్‌కు తగినట్లు ఆ తొలిప్రేమను తెరకెక్కించారు. ఆ సినిమా విడుదలై 20 సంవత్సరాలవుతుంది. ఇప్పటి తరానికి నచ్చేలా మా 'తొలిప్రేమ'ను తెరకెక్కించాం.

– పాత తొలి ప్రేమలో హీరో దగ్గర మొబైల్ ఉండదు. తన ప్రేమను చెప్పడానికి రక్తంతో లవ్ లెటర్ రాసిస్తాడు. జనరేషన్ గ్యాప్, ప్రవర్తన ఎలా ఉంటుందో సినిమాలో చూపిస్తున్నాం.



కథకు తగ్గ టైటిల్..

సినిమా 70 శాతం చిత్రీకరణ పూర్తయ్యేంత వరకు టైటిల్ విషయంలో క్లారిటీ రాలేదు. వెంకీ అట్లూరి రెండు మూడు టైటిల్స్ అనుకున్నారు. ఇంగ్లీష్ టైటిల్స్ వచ్చాయి. తెలుగు టైటిల్ అయితే క్యాచీగా ఉంటుందనిపించింది. సినిమాలో కథకు రిలేటెడ్‌గా ఉండాలని బాపిగారు.. తొలిప్రేమ టైటిల్‌ను సూచించారు. అయితే ఈ టైటిల్‌ను పెట్టాలా లేదా? అనే దానిపై చాలా ఆలోచించాం. కథేంటో తెలుసు కాబట్టి. కథకు యాప్ట్ అయ్యే టైటిల్ ఇదేనని యూనిట్ అందరికీ అనిపించి ఈ టైటిల్‌కే ఫిక్స్ అయ్యాం.

ఆ చర్చ రాలేదు..

కల్యాణ్ బాబాయ్‌తో ఈ టైటిల్ గురించి డిస్కషన్ రాలేదు. అయితే ఉషాకిరణ్ మూవీస్ వారి దగ్గర ఈ టైటిల్ ఉందని తెలిసి.. నిర్మాతలు వారిని సంప్రదించి మాట్లాడారు. వారు తొలిప్రేమ టైటిల్‌ను మాకు ఇచ్చారు.

క్యారెక్టర్స్ పరంగా తేడా కనపడుతుంది..

క్యారెక్టరైజేషన్ పరంగా ఫిదాకు ఈ సినిమాకు చాలా తేడా ఉంటుంది. ఫిదాలో నేను ఎన్నారై యువకుడిగా, సాఫ్ట్‌గా కనపడతాను. కానీ తొలిప్రేమలో నా పాత్ర చాలా ఎగ్రెసివ్‌గా ఉంటుంది. 'ఫిదా' విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటే.. 'తొలిప్రేమ' న్యూ ఏజ్ మూవీ.

స్నేహితుల అనుభవాల నుండి..

ఫస్ట్ లవ్ చాలా టఫ్‌గా ఉంటుంది. దాన్ని మిస్ చేసుకుంటే.. దాని నుండి బయటకు రావడం చాలా కష్టం. నా స్నేహితుల్లో చాలా మంది దాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేశారు. ఓ అబ్బాయి, అమ్మాయి మధ్య తొలిప్రేమ పుట్టిన తర్వాత దాన్నుండి బయటకు రావడం అంత సులభం కాదు. అదే విషయాన్ని మేం ఎనిమిది సంవత్సరాల టైమ్ పీరియడ్‌లో మూడు ఫ్రేమ్స్‌లో చూపించాం.

పెద్దనాన్న, నాన్న, బాబాయ్ హాలీవుడ్ సినిమాలు బాగా చూస్తారు. నేను కూడా మూవీ లవర్‌ని కావడంతో.. చిన్నప్పట్నుంచి సినిమాలు బాగా చూసేవాడిని. హాలీవుడ్ తరహాలో కొత్త జోనర్ సినిమాలెందుకు చేయలేమనే ఆలోచన మదిలో ఉండేది. నేను హీరో అయ్యాక.. ఆ విషయంలో ముందడుగు వేస్తే తప్పేంటి అని ఆలోచించి నా వంతుగా ప్రయత్నాలు చేస్తున్నాను.

ఇష్టమైన సీన్..

ఈ సినిమాలో క్లైమాక్స్ నాకు చాలా బాగా ఇష్టమైన సీన్. ప్రేమికుల మధ్య బ్రేకప్స్ జరిగేటప్పుడు దానికి పెద్ద కారణాలుండవు. పరిణితితో ఆలోచించకపోవడం వల్ల కూడా బ్రేకప్స్ జరుగుతుంటాయి. ఈ సినిమాలో కూడా అలాగే చూపించాం. చాలా మంది ఈ సినిమా చూసినప్పుడు ఇలాంటి ఎలిమెంట్స్‌కు బాగా కనెక్ట్ అవుతారు. యు.ఎస్.లో ప్రీమియర్స్ చూసినవారు నాకు 'సినిమా చూడగానే ఒకసారి మేం గతంలోకి వెళ్లాం' అంటూ మెసేజ్‌లు పంపుతున్నారు.

దర్శకుడు వెంకీ గురించి...

వెంకీతో ఐదారేళ్లుగా పరిచయం ఉంది. అయితే తను దర్శకుడు కావాలనుకుంటున్నట్లు తెలియదు. కలిసినప్పుడు సాధారణంగా మాట్లాడుకునేవాళ్లం కానీ వెంకీ ఎప్పుడూ చెప్పలేదు. అలాగే మా నిహారిక చేసిన 'ముద్దపప్పు అవకాయ్' వెబ్ సిరీస్‌కు తను రైటింగ్ సైడ్ సహాయం చేశాడు. ఒకసారి కలిసి కథ చెబుతానన్నాడు. ఏ సినిమాకైనా కథే హీరో అని నేను బాగా నమ్ముతాను. కథ వినగానే బాగా నచ్చింది. వెంకీ ఆల్‌రెడీ రైటింగ్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ చేశాడు కాబట్టి నాకు వెంకీపై నమ్మకం ఉండేది.

నిర్మాతల గురించి..

సినిమా మేకింగ్‌లో నిర్మాతలు ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్‌గారు ప్రొడక్షన్ వ్యవహారాలు చూసుకుంటే.. బాపినీడు స్టోరీ డిస్కషన్స్ నుండి యూనిట్‌తో ట్రావెల్ అవుతూ వచ్చారు. మరుసటి రోజు ఏం చేయాలనేది కూడా మా అందరితో బాపినీడు డిస్కస్ చేసేవారు.

తదుపరి చిత్రం..

సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో ఓ సైన్స్ ఫిక్షన్ మూవీ చేయబోతున్నాను. అంతరిక్షానికి సంబంధించిన కథాశంతో నడిచే సినిమా అది. 'కంచె' సినిమాను నిర్మించిన రాజీవ్‌రెడ్డిగారు ఈ సినిమాను నిర్మించబోతున్నారు. కథ మాత్రమే విన్నాను. నాకు ఇది కచ్చితంగా ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ అవుతుంది.

మోడ్రన్ రాబిన్‌హుడ్

మనం రివ్యూ

మెగా ఫ్యామిలీకి కలిసొచ్చిన దర్శకులలో వి.వి.వినాయక్ మొదటి స్థానంలో ఉంటారు. మెగా కథానాయకులతో ఆయన తొలిసారి చేసిన చేసిన సినిమాలన్నీ ఘనవిజయం సాధించాయి. చిరంజీవితో 'ఠాగూర్', అల్లు అర్జున్‌తో 'బన్ని', రామ్ చరణ్‌తో 'నాయక్' చిత్రాలు చేసి మంచి విజయాలు అందుకున్నారు వినాయక్. ఇప్పుడు మరో మెగా హీరో సాయిధరమ్ తేజ్ కాంబినేషన్‌లో తొలి ప్రయత్నం చేశారు. అదే 'ఇంటిలిజెంట్'. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రంపై 'మనం' అందిస్తున్న సమీక్ష మీ కోసం..



చిత్రం: ఇంటిలిజెంట్
బ్యానర్: సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్
తారాగణం: సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి, నాజర్, బ్రహ్మానందం, ఆశిష్ విద్యార్థి, రాహుల్ దేవ్, కాశీ విశ్వనాథ్, జయప్రకాశ్ రెడ్డి, పృథ్వీ, రాజేశ్వరి నాయర్, శ్రీ హర్ష తదితరులు
ఛాయాగ్రహణం: ఎస్.వి.విశ్వేశ్వర్
కూర్పు: గౌతంరాజు
సంగీతం: ఎస్.తమన్
కథ: ఆకుల శివ
నిర్మాత: సి.కల్యాణ్
స్క్రీన్ ప్లే, దర్శకత్వం: వి.వి.వినాయక్

కథ:

మనిషికి మనిషి తోడు.. మనం చేసే మంచే మనకు సాయం చేస్తుందన్నది నంద కిశోర్ (నాజర్) ఫిలాసఫీ. విజన్ సాఫ్ట్‌వేర్ కమ్యూనికేషన్స్ పేరిట ఆయన ఓ కంపెనీ నడుపుతుంటాడు. అనాథలకు ఆశ్రయం ఇస్తూ.. మంచిమనిషిగా పేరు తెచ్చుకుంటాడు. నందకిశోర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుంటాడు సాయిధరమ్ తేజ్ (సాయిధరమ్ తేజ్). చిన్నప్పట్నుంచీ.. నందకిశోర్ మాటలకు ప్రభావితుడైన తేజు.. ఆయన అడుగుజాడల్లోనే నడుస్తుంటాడు. తేజు ప్రతిభ చూసి.. వేరే కంపెనీవాళ్ళు పెద్ద మొత్తంలో జీతం ఇస్తామన్నా.. 'జాబ్ చేసేది ఆడంబరం కోసం కాదు.. ఆనందం కోసం' అంటూ సున్నితంగా ఆ అవకాశాన్ని తిరస్కరిస్తాడు. ఇదిలా ఉంటే.. విచిత్రమైన పరిస్థితుల్లో సంధ్య (లావణ్య త్రిపాఠి)కి దగ్గరవుతాడు తేజు. అమెరికా నుంచి వచ్చిన సంధ్య మరెవరో కాదు.. నంద కిశోర్ కూతురే. మొదట్లో సంధ్య.. తేజుని అపార్థం చేసుకున్నా.. తల్లి పట్ల అతను చూపే ప్రేమను చూసి ఇంప్రెస్ అవుతుంది. మరోవైపు నంద కిశోర్ ప్రత్యర్థి.. అతని కంపెనీపై కన్నేస్తాడు. వీరూభాయ్ (రాహుల్ దేవ్) తనకి ఆ కంపెనీ రాసివ్వమని బ్లాక్ మెయిల్ చేస్తే.. దాన్ని ఫేస్ బుక్ లో షేర్ చేస్తాడు తేజు. దానికి తేజుని అభినందిస్తాడు నంద కిశోర్. అయితే అనూహ్యంగా అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకుంటాడు. దీంతో.. ఆయనది ఆత్మహత్య కాదు.. ఏదో జరిగి ఉంటుంది అని రంగంలోకి దిగుతాడు తేజు. నందకిశోర్ చావు వెనుక కారణాలు తెలుసుకునే క్రమంలో తేజుకి ఎదురయ్యే పరిస్థితులేంటి? నంద కిశోర్‌ని చంపిన వారిపై ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడు? అనేదే మిగిలిన కథ.

విశ్లేషణ

పెద్దవాళ్ళను కొట్టి పేదవాళ్ళకు పంచాలి అనే రాబిన్ హుడ్ తరహా కథలకి మరో వెర్షన్ 'ఇంటిలిజెంట్' మూవీ. వినడానికి పాత కథాంశమైనా.. వి.వి.వినాయక్ తనదైన శైలిలో చేసుకుపోయారు. దానికితోడు సాయిధరమ్ తేజ్ లాంటి కథానాయకుడు దొరకడంతో.. తన పని మరింత సులువైంది. అలాగే తేజులో ఉన్న మేనమామ పోలికలపై బాగా దృష్టి పెట్టి.. వాటిని పాటల్లోనూ, సన్నివేశాల్లోనూ బాగానే ఆవిష్కరించారు. అయితే, ప్రథమార్థంపై పెట్టిన దృష్టి ద్వితీయార్థంపై పెట్టకపోవడం మైనస్‌గానే చెప్పాలి. నటీనటుల విషయానికి వస్తే.. సాయిధరమ్ తేజ్ ఎప్పటిలాగే తన పాత్రలో తాను ఒదిగిపోయారు . డ్యాన్సుల్లో మరోసారి రాణించారు. ముఖ్యంగా 'చమకు చమకు చాం' రీమిక్స్‌లో చిరు స్టెప్పుల్లో గ్రేస్ బాగానే మెయిన్ టెయిన్ చేశారు. పోరాట సన్నివేశాల్లోనూ మెప్పించారు. ఇక కథానాయిక లావణ్య త్రిపాఠి విషయానికి వస్తే.. గతేడాది వచ్చిన సినిమాల కంటే ఈ సినిమాల్లో అందంగా కనిపించింది. డ్యాన్సుల విషయంలో కష్టపడింది. అయితే.. ఈ పాత్రకి సినిమాలో పెద్దగా ప్రాముఖ్యత లేకపోవడం వల్ల.. నటిగా ఆమె గురించి చెప్పుకోవడానికి ఏమీ లేదు. నాజర్ తనకు అలవాటైన పాత్రలో ఒదిగిపోయారు. మిగిలిన నటీనటులు ఓకే అనిపిస్తారు.

సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే.. తమన్ పాటల్లో 'చమకు చమకు చాం' రీమిక్స్ ఆకట్టుకుంటుంది. మిగిలిన పాటలు సో సోగా ఉన్నాయి. నేపథ్య సంగీతం కొన్ని సన్నివేశాల్లో బాగానే వర్కవుట్ అయ్యింది. విశ్వేశ్వర్ సినిమాటోగ్రఫీ బాగుంది. ముఖ్యంగా పాటల చిత్రీకరణలో ఆయన కెమెరా పనితనం మెప్పిస్తుంది. ఎడిటింగ్ క్రిస్పీగా ఉంది. డైలాగులు అక్కడక్కడా నవ్వు తెప్పిస్తాయి. నిర్మాణ విలువలు బాగున్నాయి.

చివరగా.. మోడ్రన్ రాబిన్‌హుడ్

రేటింగ్.. 2.5/5

శీనుగాడి ప్రేమ పాటలు

సుష్మ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా పతాకంపై శ్రీనివాసరావు హీరోగా నటిస్తూ నిర్మిస్తోన్న చిత్రం 'శీనుగాడి ప్రేమ'. ఆర్.కె.దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రణవి, కావేరి, చాందిని కథానాయికలు. రమణ సాకే సంగీతాన్ని సమకూర్చిన ఈ చిత్ర ఆడియో శుక్రవారం ప్రసాద్ ల్యాబ్స్ లో విడుదలైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన టిఎఫ్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ తొలి సీడీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''కొత్తవారు చిత్ర పరిశ్రమకు రావాలి. ఇలాంటి చిత్రాలను ఆదరించాలి. నా వంతు ప్రయత్నంగా థియేటర్స్ ఇప్పించడానికి ప్రయత్నిస్తాను. మంచి పబ్లిసిటీతో సినిమాను సరైన డేట్ చూసుకుని విడుదల చేయాల్సిందిగా దర్శక నిర్మాతలకు సూచిస్తున్నా'' అన్నారు. సంగీత దర్శకుడు రమణ సాకే మాట్లాడుతూ ''ఈ సినిమాకు మ్యూజిక్ చేసే అవకాశాన్ని కల్పించిన దర్శక నిర్మాతలకు నా కృతజ్ఞతలు'' అన్నారు. హీరో, నిర్మాత శ్రీనివాసరావు మాట్లాడుతూ ''నటన అంటే నాకు ఆసక్తి. మంచి కథ కావడంతో ఇందులో హీరోగా నటిస్తూ, నేనే నిర్మించాను. దర్శకుడు ఆర్.కె. చెప్పిన దానికంటే సినిమాను అద్భుతంగా చిత్రీకరించాడు. రమణ సాకే క్యాచీ ట్యూన్స్ ఇచ్చారు'' అని తెలిపారు. దర్శకుడు ఆర్.కె.మాట్లాడుతూ ''లవ్, కామెడీ, ఎమోషన్ ఇలా ఆడియన్స్‌కు కావాల్సిన అన్ని అంశాలు పొందుపరిచాం. ఎన్ని అడ్డంకులు వచ్చినా...మా నిర్మాత వాటన్నింటినీ అధిగమించి ఈ సినిమాను ఇక్కడి వరకు తీసుకొచ్చారు. కచ్చితంగా సక్సెస్ కొడతాం అన్న నమ్మకంతో ఉన్నాం'' అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు చిత్ర యూనిట్‌ను అభినందించారు.





మాట మార్చని మంత్రి!

- తూచా తప్పకుండా... అక్కడ చెప్పిందే
- జైట్లీ నోట... రాజ్యసభలోనూ అదే పాట
- అది చేశాం.. ఇది చేశాం.. ఎంతో చేస్తాం
- ఆంధ్రప్రదేశ్‌లో రగులుతున్న ప్రజాగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయంపైనా, విభజన హామీలు నెరవేర్చకపోవడం గురించి ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ 'మాట మార్చలేదు'... విభజన సమయంలో రాష్ట్రానికి అన్యాయం జరిగిన మాట నిజమేనని మాత్రం అంగీకరించారు. అందుకే రాష్ట్రానికి న్యాయం చేయాలని తాము ఆనాడు పట్టుబట్టామన్నారు. తాము అధికారంలోకి రాగానే తొలి ఏడాది రెవిన్యూ లోటు భర్తీకి రూ.3,979 కోట్లు ఇచ్చామని చెప్పుకొచ్చారు. మొత్తమ్మీద లోక్‌సభలో గురువారం వినిపించిన పాత పాటనే శుక్రవారం రాజ్యసభలో మరోసారి వినిపించారు. ''అది చేశాం... ఇది చేశాం.. ఇంకా ఎంతో చేసేస్తాం... అన్నీ పరిశీలనలో ఉన్నాయ్'' అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో రగులుతున్న ఆగ్రహానికి మరింత ఆజ్యం పోశారు. ముందురోజు పరిణామాల సెగతో రాజ్యసభలో కనీస ఊరట కలిగించే ప్రకటనైనా చేస్తారని ఆశించిన రాష్ట్ర ఎంపీలు ఆయన మాటలతో అవాక్కయ్యారు. కాకపోతే లోక్‌సభలో ఎంపీల ఆందోళన, నిరసన నినాదాల నడుమనే ఆర్థిక మంత్రి ప్రసంగం సాగిపోగా రాజ్యసభలో ఎలాంటి సందడి లేకుండా నిశ్శబ్దంగా కూర్చుని ఏ మార్పూలేని మంత్రి ప్రసంగాన్ని వినడం గమనార్హం. కాగా, జైట్లీ ప్రసంగానికి ముందు సభాధ్యక్షుడు వెంకయ్యనాయుడు టీడీపీ ఎంపీలను సముదాయించినట్లు సమాచారం. ఆ మేరకు మధ్యాహ్నం వారితో దాదాపు రెండు గంటలకుపైగా చర్చించారని తెలియవచ్చింది. ఈ భేటీలో జైట్లీతోపాటు బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, సుజనా చౌదరిసహా ఇతర ఎంపీలు పాల్గొన్నారని భోగట్టా. ఆయన బుజ్జగింపుతో టీడీపీ ఎంపీలు నిరసన వీడి మౌనం వహించారు.

ఆర్థిక మంత్రి అనర్గళ 'పాత ప్రసంగం'

ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలపై స్పష్టత వస్తుందని ఆశించిన ఎంపీలకు నవనాడులూ కుంగిపోయేంత నిరాశ కలిగిస్తూ గురువారం లోక్‌సభలో కంఠతా పట్టిన ప్రసంగాన్ని గడగడా వల్లించేశారు... ''ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికే కాకుండా వెనుకబడిన జిల్లాలకూ నిధులిచ్చాం. రాష్ట్రంలో అభివృద్ధి కార్యకలాపాల కోసం తగువిధంగా నిధులు అందజేస్తూనే ఉన్నాం. విద్యా సంస్థల ఏర్పాటుకు దశలవారీగా నిధులు విడుదల చేస్తున్నాం.

రెవిన్యూ లోటు భర్తీ చేసేదిశగా కొంత ఇప్పటికే ఇచ్చాం. ఇంకా ఇవ్వాల్సినదానిపై రాష్ట్ర లెక్కల్లో తేడాలొచ్చాయి. అందుకే దానిపై మరోసారి చర్చించి భర్తీచేస్తాం. ఉక్కు కర్మాగారంసహా ఓడరేవుల నిర్మాణంపై సంబంధిత శాఖలు కసరత్తు చేస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు పనులు ఆగిపోకుండా నిధులు ఇస్తూనే ఉన్నాం. రైల్వేజోన్, దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ-చెన్నై కారిడార్ తదితరాలపై సంబంధిత మంత్రిత్వ శాఖలు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాయి'' అంటూ ముక్తాయించారు.

లోపలా.. బయటా..

- ఉభయ సభల్లో అదే ఆందోళన
- ఏపీపై వెనక్కు తగ్గని ఎంపీలు
- హామీల అమలుకు వీడని పట్టు
- మార్చి 5కు పార్లమెంటు వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: పార్లమెంటు లోపలా, బయటా ఐదు రోజులుగా అదే దృశ్యం. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై ఎంపీలు నిరసన కొనసాగించారు. విభజన చట్టం హామీలను నెరవేర్చాలని, రాష్ట్రానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉభయ సభల్లో ఎంపీలు ఆందోళన నిర్వహించారు. లోక్‌సభ ప్రారంభమైన వెంటనే టీడీపీ, వైసీపీ ఎంపీలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టి నిరసన చేపట్టారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగించవద్దని స్పీకర్ సుమిత్రా మహాజన్ చెప్పినా ఎంపీలు శాంతించలేదు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కూడా అదే పరిస్థితి నెలకొంది.



ఏపీకి న్యాయం చేయాల్సిందేనని ఎంపీలు ఆందోళన

కొనసాగించారు. సభ్యులు శాంతించకపోవడంతో స్పీకర్ సభను మార్చి 5వ తేదీకి వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. టీడీపీ, కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేయడంతో సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. రాజ్యసభ తిరిగి ప్రారంభం కాగానే మరోసారి సభ్యులు నిరసనకు దిగారు. దీంతో సమావేశాలు మధ్యాహ్నం 2.30 గంటలకు వాయిదా పడ్డాయి. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ.. ఏపీ సభ్యుల డిమాండ్‌పై మాట్లాడారు. లోక్‌సభలో చెప్పిందే జైట్లీ మళ్లీ చెప్పారంటూ ఎంపీలు నిరసన తెలిపారు.

పార్లమెంటు ఆవరణలో నిరసన

అంతకుముందు పార్లమెంటు ఆవరణలో టీడీపీ ఎంపీలు నిరసన చేపట్టారు. గాంధీ విగ్రహం వద్ద ఎంపీలు ఆందోళనకు దిగారు. తిరుమల వెంకటేశ్వరస్వామి పాదాల సాక్షిగా నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏపీకి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

శివప్రసాద్ వినూత్న వేషధారణలో..

ఎంపీ శివప్రసాద్ తాంత్రికుడి వేషధారణలో ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోవడంపై వెంకటేశ్వరస్వామి, కనకదుర్గమ్మ ఆగ్రహించారని చెప్పారు. అందుకే తనను ఆవహించి పార్లమెంట్ సాక్షిగా హెచ్చరిస్తున్నారని తెలిపారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కేంద్రం లెక్కచేయడం లేదని అన్నారు. ఏపీలో కాంగ్రెస్‌కు ఎలాంటి గతిపట్టిందో.. బీజేపీకి కూడా అలాంటి పరిస్థితే వస్తుందని శివప్రసాద్ హెచ్చరించారు.

ఏపీ భవన్ వద్ద కాంగ్రెస్ నిరసన

విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని కోరుతూ ఏపీ కాంగ్రెస్ నేతలు ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద నిరసన చేపట్టారు. ఏపీ భవన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని ఏపీకి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, ఎంపీ కేవీపీ రామచంద్రరావు, సీనియర్ నేతలు జేడీశీలం, సుబ్బరామిరెడ్డి తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.



బెజవాడలో హైకోర్టు జడ్జిల బృందం

- తాత్కాలిక హైకోర్టుకు భవనాల పరిశీలన

గన్నవరం విమానాశ్రయం, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): నవ్యాంధ్ర రాజధానిలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటుకు అనువైన భవనాలను పరిశీలించేందుకు ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తుల బృందం శుక్రవారం విజయవాడ చేరుకొంది. మూడు రోజులు పాటు వారు వివిధ ప్రాంతాల్లోని భవనాలను పరిశీలించనున్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి గన్నవరం విమానాశ్రయం చేరుకున్న బృందానికి కృష్ణా జిల్లా జడ్జిలు వై.లక్ష్మణరావు, ఎ.వి.రవీంద్రబాబు, విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, ఆర్డీవో సి.హెచ్.రంగయ్య తదితరులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తుల బృందం గన్నవరంలోని వెటర్నరీ యూనివ ర్శిటీ భవనాన్ని పరిశీలించారు. కాగా, న్యాయమూర్తి బృందంలో జస్టిస్ వి.రామసుబ్రమణ్యం, జస్టిస్ సునీల్ చౌదరి, జస్టిస్ సత్యనారాయణ మూర్తి, జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ శేషశాయి ఉన్నారు. వారికి యూనివర్శిటీ భవనాలకు సంబంధించిన అన్ని వివరాలను ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్ పి.శ్రీమన్నారాయణ, ఏఈ మాధవ్ స్వరూప్‌లు తెలియజేశారు. శని, ఆదివారాల్లో వారు మరిన్ని భవనాలను పరిశీలించనున్నారని తెలుస్తోంది.

ఏడీజీలుగా అమిత్‌గార్గ్, సునీల్ కుమార్

అమరావతి, ఫిబ్రవరి 9 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులకు పదోన్నతి లభించింది. 1993 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారులు అమిత్‌గార్గ్, పి.వి.సునీల్ కుమార్‌లను అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఐజీ హోదాలో అమిత్ గార్గ్ సీఐడీ విభాగంలో పనిచేస్తున్నారు. ఇదే హోదాలో ఉన్న సునీల్ కుమార్ సైబర్ క్రైమ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఏడీజీలుగా పదోన్నతి పొందిన అమిత్‌గార్గ్, సునీల్ కుమార్‌లను కలిసి పలువురు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

- మంత్రి అమరనాథ్‌రెడ్డి



తిరుపతి, ఫిబ్రవరి 9 (మనం న్యూస్ బ్యూరో): రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు అవసరమని పరిశ్రమల శాఖా మంత్రి అమరనాథరెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం నాడు పలమనేరు నియోజకవర్గంలోని వి.కోట మండలంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ అయినా, ప్రతిపక్ష పార్టీ అయినా రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇందు కోసం పార్టీలను పక్కనపెట్టి.. కేంద్రం మెడలు వొంచి రాష్ట్రానికి అవసరమైన నిధులు తీసుకురావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనలో బీజేపీ భాగస్వామ్యం కూడా ఉందని మంత్రి గుర్తు చేశారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉంటూ రాష్ట్రాన్ని విభజిస్తే ఏపీకి అన్యాయం జరుగుతుందని చెప్పింది బీజేపీనేనని, ఏం చేస్తే బాగుంటుందో సలహాలు ఇచ్చిందీ కూడా ఆ పార్టీనేనని ఆయన చెప్పారు. రాష్ట్ర విభజనతో ఆర్థికంగా ఎంతో నష్టపోయిన ఏపీని ఏదో ఒక దశలో కేంద్ర ప్రభుత్వం ఆదుకోదా అని చంద్రబాబు ఇన్నాళ్లూ ఎదురుచూశారని మంత్రి చెప్పుకొచ్చారు. చివరి బడ్జెట్‌లోనైనా మేలు చేస్తారని భావించామని, ఇందుకు భిన్నంగా దురదృష్టవశాత్తు రాష్ట్రానికి పూర్తి అన్యాయం జరిగిందని మంత్రి అమరనాథ రెడ్డి అభిప్రాయపడ్డారు.

బీజేపీ రాజకీయ కోణంలోనో.. మరోవిధంగానో రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీయాలని భావిస్తే ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని మాత్రమే కేంద్రంతో నేటి వరకు కలిసి నడిచామని, హోదాతో సమానమైన ప్యాకేజీ ఇస్తామంటే రాష్ట్ర భవిష్యత్తు కోసం సరే అన్నామని మంత్రి చెప్పారు. ఇప్పటికైనా ఏపీకి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని.. కాని పక్షంలో కఠినమైన నిర్ణయం తీసుకుంటామని అమరనాథరెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కూడా రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు. అలా కాకుండా, ముఖ్యమంత్రిపై వ్యక్తిగతంగా విమర్శలు చేయడం దేనికి సంకేతమని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై మంత్రి పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. బీజేపీ తీరు ఇలాగే కొనసాగితే కాంగ్రెస్‌కు పట్టిన గతే పడుతుందని మంత్రి అమరనాథ రెడ్డి హెచ్చరించారు.

హైకోర్టు కర్నూలులోనే పెట్టాలి

- మంత్రి నారాయణను అడ్డుకున్న లాయర్లు
- సీఎంతో చర్చించి న్యాయం చేస్తాం: మంత్రి

కర్నూలు, ఫిబ్రవరి 9 (మనం న్యూస్ బ్యూరో): నవ్యాంధ్రలో కొత్తగా ఏర్పాటు చేసే హైకోర్టును ఒకప్పటి రాజధాని కర్నూలులోనే పెట్టాలని రాయలసీమ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్ చేస్తూ 20 రోజులుగా దీక్షలు చేస్తున్న లాయర్లు శుక్రవారం కర్నూలు వచ్చిన మంత్రి నారాయణను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఒకప్పటి రాజధాని కర్నూలు నగరంలో హైకోర్టు ఏర్పాటు చేయాలని శ్రీబాగ్ ఒడంబడికలోని నిర్ణయించారని, తప్పని సరిగా కర్నూలులోని హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కర్నూలుకు న్యాయం చేయాలని కోరారు. దీంతో సీఎం చంద్రబాబుతో మాట్లాడి తగు నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ వారికి హామీ ఇచ్చారు. అనంతరం లాయర్లు మంత్రి నారాయణకు వినతి పత్రం సమర్పించారు.

'వీఆర్' కాంట్రాక్ట్ రద్దు చేయండి

అనంతరం కర్నూలు నగరపాలక సంస్థ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా కార్పొరేషన్ అభివృద్ధికి కేటాయించిన నిధులతో 6 నెలలుగా పనులు మొదలు పెట్టకపోవడంతో ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులపై ఆయన మండిపడ్డారు. దీర్ఘకాలం పనులను పెండింగ్‌లో పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులలో ఆలస్యం జరిగితే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఆరు నెలల క్రితం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ వీఆర్ పనులు ప్రారంభించకపోవడంపై నోటీసులు జారీ చేసి టెండర్ రద్దు చేసి కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. సింగిల్ టెండర్ ద్వారా త్వరతగతిన పనులను ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే మార్చి పూర్తి అయ్యేనాటికి అభివృద్ధి పనులలో లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

రొయ్యల చెరువులకు అడ్డంకులు తొలగిస్తాం

- 'తూర్పు' రైతులకు మంత్రి ఆదినారాయణ హామీ



అమరావతి, ఫిబ్రవరి 9 (మనం ప్రతినిధి): తూర్పుగోదావరి జిల్లాలో రొయ్యల చెరువుల అనుమతుల విషయంలో ప్రభుత్వ పరంగా ఏవైనా అడ్డంకులుంటే పరిశీలించి నిబంధనలకు లోబడి అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డి చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రొయ్యల సాగు రైతులు శుక్రవారం మధ్యాహ్నం మంత్రిని సచివాలయంలో కలసి తమకు సమస్యల పై వినతిపత్రం అందచేశారు. జిల్లాలో 30 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతున్నా.. 9 వేల ఎకరాలకే అనుమతులు ఉన్నాయని, మిగిలిన వాటి రెగ్యులరైజేషన్‌కు నిబంధనల ప్రకారమే దరఖాస్తు చేసినా అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. కోర్టు కేసులు, ఫిర్యాదులున్నాయంటూ జిల్లాస్థాయి కమిటీ తమ దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టేసిందని తెలిపారు. తనిఖీలు చేసి నిబంధనలు అతిక్రమించిన వారిని పక్కనపెట్టి... అన్నీ సక్రమంగా ఉన్న వారికి అనుమతులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో సమస్య లేదని ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే సమస్య ఉందని ఈ సందర్భంగా వారు మంత్రికి విన్నవించారు. వారి గోడు విన్న మంత్రి స్పందిస్తూ.. నిబంధనలకు లోబడి ఉన్న వారికి అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనుమతుల మంజూరులో ప్రభుత్వపరంగా ఏవైనా అడ్డంకులు ఉంటే వాటిని వెంటనే తొలగిస్తామని చెప్పారు.

ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థుల మృతి


వినుకొండ, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. శుక్రవారం గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామం సమీపంలో గుండ్లకమ్మ వద్ద విషాదం చోటు చేసుకుంది. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థి అన్వేష్ రెడ్డి, ఇంటర్ విద్యార్థులు కొంకేరు నాగేశ్వరరావు, తమ్మిశెట్టి కోటేశ్వరరావు, సయ్యద్ నాగూర్ వలీలు గుండ్లకమ్మ వద్దకు ఈతకు వెళ్లారు. నదిలోకి దిగిన విద్యార్థులకు ఈత రాకపోవడంతో కొట్టుకుపోయారు. అక్కడే స్నానం చేస్తున్న నాగిరెడ్డి అనే వ్యక్తి తన పంచెను విసిరి అన్వేష్‌రెడ్డిని కాపాడగా, మిగిలిన ముగ్గురు మునిగిపోయారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు అక్కడికి చేరుకొని గజఈతగాళ్ల సాయంతో గాలించి మృతదేహాలను వెలికి తీశారు.

పెద్దలు ఒప్పుకోలేదని ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (మనం న్యూస్ బ్యూరో): ప్రేమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదని యువ జంట జీవితాన్ని ముగించాలనుకొంది. చివరిగా ఇద్దరూ కలిసి సరదాగా గడిపి ఉసురు తీసుకోవాలని ఇంటి నుంచి పారిపోయారు. అనుకున్న ప్రకారమే విహరించి ఆత్మహత్యకు యత్నించారు. అదృష్టవశాత్తు అనూహ్య పరిణామాల మధ్య ప్రాణాలతో బయటపడ్డారు. అరకు లోయలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన సుజిత్, ప్రియ ఒకే కళాశాలలో బీకాం చదువుతున్నారు. కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్న వీరిద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. కానీ వీరి ప్రేమను పెద్దలు అంగీకరించలేదు. దీంతో కలిసి బతకలేకపోయినా కలిసి చనిపోదామని నిర్ణయించుకున్నారు. చివరిగా ఆనందంగా విహరించాలని బుధవారం ఇంటి నుంచి పారిపోయి అరకు చేరుకున్నారు. ఇక్కడి ఓ ప్రైవేటు లాడ్జిలో ఉంటూ ప్రకృతి అందాల మధ్య ఆనందంగా విహరించిన ప్రేమ జంట తాము చనిపోతున్నామంటూ స్నేహితులకు మెసేజ్‌లు పంపి నిద్రమాత్రలు మింగేశారు. మెసేజ్‌లను మిత్రులు గుడివాడ పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అరకులో ఉన్నారని గుర్తించి అరకు పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో పోలీసులు హుటాహుటీన లాడ్జికి చేరుకుని ప్రేమ జంటను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు చెప్పారు.

వైసీపీ డబుల్ గేమ్


- ఎంపీలు డ్రామా ఆడుతున్నారు: ఎమ్మెల్సీ డొక్కా



అమరావతి, ఫిబ్రవరి 9 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రయోజనాల కోసం టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో అలుపెరగని పోరాటం చేస్తుంటే... కేసుల మాఫీ కోసం వైసీపీ నాయకులు డబుల్ గేమ్ ఆడుతున్నారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ విమర్శించారు. శుక్రవారం గుంటూరులో టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఓ వైపు కేంద్ర బడ్జెట్ బాగుందని వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ప్రశంసిస్తుంటే.. మరోవైపు జగన్ మాత్రం ఇంతవరకు బడ్జెట్‌పై నోరు మెదపకపోవడం చాలా దారుణమన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారం విషయంలో పార్లమెంట్ లోపలా, వెలుపలా టీడీపీ ఎంపీలు పోరాటం చేస్తున్నారని, ప్రధాని నరేంద్ర మోదీని గుంటూరు ఎంపీ జయదేవ్ సూటిగా ప్రశ్నించారని కితాబిచ్చారు. కేంద్ర మంత్రి సుజనా చౌదరి తన పదవిని పక్కనబెట్టి కేంద్రంపై నిరసన గళాన్ని వినిపించారని ఆయన ప్రశంసించారు.

మా ఎమ్మెల్యేలను టీడీపీ కొనేస్తోంది

- స్పీకర్ అధికార పార్టీకి తొత్తు
- సీఈసీతో వైసీపీ ఎంపీ విజయసాయి




అమరావతి, ఫిబ్రవరి 9 (మనం ప్రతినిధి): వైసీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి కేంద్ర ఎన్నికల కమిషనర్ రావత్‌తో శుక్రవారం భేటీ అయ్యారు. రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ ప్రలోభాలకు పాల్పడే అవకాశముందని ఆయన ఫిర్యాదు చేశారు. ఇప్పటికే వైసీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను టీడీపీ ప్రలోభాలకు గురి చేసి తమ పార్టీలో చేర్చుకుందని విజయసాయిరెడ్డి చెప్పారు. స్పీకర్ కోడెల శివప్రసాద్ రావుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా.. పక్షపాతంగా వ్యవహరిస్తూ అధికార పార్టీకి తొత్తుగా మారాడని ఆయన ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వైసీపీకి 44 మంది ఎమ్మెల్యేలున్నారని, అందులో మరో నలుగురిని కొనేందుకు టీడీపీ ప్రయత్నిస్తోందని, ఆ విషయాన్ని ఈసీకి వివరించానని విజయసాయి రెడ్డి చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ రావత్ తాము చెప్పిన అంశాలపై సానుకూలంగా స్పందించారని ఎంపీ చెప్పారు. న్యాయసలహాదారుతో వైసీపీ విజ్ఞప్తులపై మాట్లాడారని తెలిపారు. సీఈసీ చట్టం ప్రకారం రాజ్యసభ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

ఎంపీలకు సచివాలయ ఉద్యోగుల మద్దతు

- కేంద్రాన్ని నిరసిస్తూ అమరావతిలో ర్యాలీ


అమరావతి, ఫిబ్రవరి 9 (మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ఎంపీలు పార్లమెంట్‌లో చేస్తున్న ఆందోళనకు సంఘీభావంగా అమరావతిలో సచివాలయ ఉద్యోగులు ర్యాలీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలంటూ మూడో బ్లాక్ వద్ద నినాదాలు చేశారు. కేంద్రం ఏపీకి అన్యాయం చేసిందంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజలతో ఆడుకోవద్దని, న్యాయం చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ అన్యాయంగా నాడు ఏపీని విభజించారని, ఇప్పుడు విభజన హామీలను అమలు చేయకుండా



మోసగిస్తున్నారని అన్నారు. విభజన హామీల కోసం పార్లమెంట్‌లో ఎంపీలు పోరాడుతున్నారని, ఇప్పటికైనా హామీలు నెరవేర్చకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని చెప్పారు. అన్ని ఉద్యోగ సంఘాలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తెస్తామని మురళీకృష్ణ స్పష్టం చేశారు.

వారం రోజుల్లో రాష్ట్ర రైతు సమన్వయ సమితి

- అధ్యక్షుడిగా గుత్తా పేరు ఖరారు..!



హైదరాబాద్, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి): మరో వారం రోజుల్లో రాష్ట్ర రైతు సమన్వయ సమితిని ప్రభుత్వం ప్రకటించనుంది. రాష్ట్ర సమితి అధ్యక్షుడికి కేబినెట్ ర్యాంకు హోదాను కల్పించనుంది. ఆ రోజే రైతు సమన్వయ సమితుల బాధ్యతలు, విధులను నిర్దిష్టంగా తెలపనున్నట్టు తెలిసింది. మొదటి నుంచి ఈ సమితికి రాష్ట్ర అధ్యక్షుడిగా నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేరు ప్రచారంలో ఉంది. గుత్తానే దాదాపు ఖరారైనట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.


నేటి నుంచి సీపీఎం మహాసభలు: మధు

భీమవరం, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): సీపీఎం రాష్ట్ర మహాసభలకు సర్వం సిద్ధమైం ది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి. మధు పిలుపునిచ్చారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహాసభలకు జాతీయ నేతలు సీతారాం ఏచూరి, ప్రకాష్ కారత్, బీవీ రాఘవులు తదితరులు హాజరవుతారని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లాలో తొలిసారిగా భీమవరంలో మహాసభలు జరుగుతున్నాయని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

సెన్సెక్స్ ఫిబ్రవరి 9 2018

34,005.76

▼-407.40



పెరిగినవి	%	తగ్గినవి	%
టాటా స్టీల్	1.83	యస్ బ్యాంకు	-2.84
డాక్టర్ రెడ్డీస్	0.83	ఐసీఐసీఐ బ్యాంకు	-2.33
ఏసియన్ పెయింట్స్	0.67	హెచ్‌డీఎఫ్‌సీ	-2.13
హెచ్.యు.ఎల్	0.57	ఇన్ఫోసిస్	-2.01
టీసీఎస్	0.20	కోటక్ మహీంద్రా	-1.93

నిఫ్టీ ఫిబ్రవరి 9 2018

10454.95

▼-121.90



పెరిగినవి	%	తగ్గినవి	%
హెచ్‌సీఎల్ టెక్	2.08	యస్ బ్యాంకు	-2.82
టాటా స్టీల్	2.06	ఇన్ఫోసిస్	-2.21
సిప్లా	1.43	భారతీ ఇన్‌ఫ్రా	-2.21
లుపిన్	1.19	ఐడియా సెల్యులర్	-2.16
డాక్టర్ రెడ్డీస్	0.61	హెచ్‌డీఎఫ్‌సీ	-2.14


టాప్ లూజర్స్ 9 ఫిబ్రవరి

34,005.76

పాయింట్లు	బి.ఎస్.ఇ సెన్సెక్స్	%
325.55	యస్ బ్యాంకు	-2.84%
326.75	ఐసీఐసీఐ బ్యాంకు	-2.33%
1773.20	హెచ్‌డీఎఫ్‌సీ	-2.13%
1111.80	ఇన్ఫోసిస్	-2.01%
1031.00	కోటక్ మహీంద్రా	-1.81%
421.75	భారతీ ఎయిర్‌టెల్	-1.80%
296.40	ఎస్‌బీఐ	-1.68%
285.00	విప్రో	-1.59%
559.50	యాక్సిస్ బ్యాంకు	-1.58%
369.20	టాటా మోటార్స్	-1.51%

▼ -407.40

బులియన్ | గత 7 రోజులు



శాన్యోకి మహీంద్రా వాటా విక్రయం

న్యూఢిల్లీ: మహీంద్రా శాన్యోలో ఉన్న 22 శాతం వాటాను రూ. 146.32 కోట్లకు శాన్యో స్పెషల్ స్టీల్ కంపెనీ లిమిటెడ్‌కు విక్రయించేందుకు మహీంద్రా అండ్ మహీంద్రా అంగీకరించింది. మహీంద్రా శాన్యో స్పెషల్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎం.ఎస్.ఎస్.ఎస్.పి.ఎల్)లో చెల్లించిన మూలధనం సగటున 22 శాతం కిందకు వచ్చే రూ. 10 ముఖ విలువ కలిగిన 26,36,401 ఈక్విటీ షేర్లను రూ. 146.32 కోట్లకు శాన్యో స్పెషల్ స్టీల్ కంపెనీ లిమిటెడ్‌కు విక్రయించేందుకు అంగీకరించినట్లు మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ శుక్రవారం బి.ఎస్.ఇకి తెలిపింది. ఎం అండ్ ఎం (51 శాతం వాటా), జపాన్‌కు చెందిన శాన్యో స్పెషల్ స్టీల్ కంపెనీ లిమిటెడ్ (29 శాతం), మిత్సుయి అండ్ కంపెనీ లిమిటెడ్ (20 శాతం) కలసి సంయుక్త రంగంలో ఎం.ఎస్.ఎస్.ఎస్.పి.ఎల్‌ను నెలకొల్పాయి. వాటా విక్రయంతో ఎం.ఎస్.ఎస్.ఎస్.పి.ఎల్‌లో మహీంద్రా కంపెనీ వాటా 29 శాతానికి తగ్గుతుంది.

'పెట్టుబడులు సాకారమవుతున్నాయి'

ఆహార శుద్ధి పరిశ్రమకు మంచి రోజులు రానున్నాయన్న మంత్రి హర్‌సిమ్రత్ కౌర్



న్యూఢిల్లీ: ఆహార శుద్ధి రంగం వచ్చే రెండుమూడేళ్ళలో 1400 కోట్ల అమెరికన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించగలవని ఆహార శుద్ధి శాఖ మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ చెప్పారు. వరల్డ్ ఫుడ్ సమ్మిట్ సందర్భంగా దేశ, విదేశీ పెట్టుబడిదార్లు ఆ మేరకు మాట ఇచ్చినట్లు తెలిపారు. తన మంత్రిత్వ శాఖకు బడ్జెట్ కేటాయింపును ప్రభుత్వం రెండింతలు చేసి, వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ. 1400 కోట్లు ఇచ్చిందని ఆమె తెలిపారు. ఆహార ప్రాసెసింగ్ మౌలిక వసతులు మెరుగుపరచేందుకు, గొలుసుకట్టు శీతల గిడ్డంగుల గ్రిడ్‌లు నెలకొల్పేందుకు ఆ మొత్తాన్ని వెచ్చించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆహార ప్రాసెసింగ్ స్థాయిని రెండింతలు చేసి, 20 శాతానికి తీసుకెళ్ళాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆమె చెప్పారు. ''వరల్డ్ ఫుడ్ సమ్మిట్ సందర్భంగా 1300 కోట్ల నుంచి 1400 కోట్ల అమెరికన్ డాలర్ల విలువైన పెట్టుబడుల రాకకు అవగాహనా పత్రాలపై సంతకాలు జరిగాయి. వాటిని స్వయంగా నేనే పరిశీలిస్తున్నాను'' అని బాదల్ ఇక్కడ 'వన్ గ్లోబ్ ఫోరమ్ 2018' సందర్భంగా పత్రికల వారితో విడిగా మాట్లాడుతూ చెప్పారు. ప్రభుత్వం గత నవంబరులో వరల్డ్ ఫుడ్ ఇండియా 2017 నిర్వహించింది. ఈ ఎం.ఓ.యులు కాగితాలకు పరిమితమైనవి కావని, ప్రాజెక్టులు నెలకొల్పేందుకు పెట్టుబడిదార్లు పనులు చేపట్టారని ఆమె చెప్పారు. వచ్చే రెండుమూడేళ్ళలో వీటిలో చాలా భాగం భౌతికంగా దర్శనమిచ్చి, కార్యకలాపాలు ప్రారంభించడాన్ని మనం చూడవచ్చని మంత్రి అన్నారు. దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు నెలకొల్పడాన్ని అమెజాన్ ఇప్పటికే ప్రారంభించిందని ఆమె చెప్పారు. పాడైపోయే పండ్లు, కూరగాయల నిల్వకు, సంరక్షణకు సదుపాయాలు కల్పిస్తే అవి వృధా కావడాన్ని తగ్గించవచ్చని చెప్పారు. ఆహార శుద్ధి మౌలిక వసతులు, శీతల గిడ్డంగులు తగినన్ని లేకపోవడం వల్ల ఏటా కోట్లాది డాలర్ల విలువైన పండ్లు, కూరగాయలు పనికిరాకుండా పోతున్నాయని అంచనా. ఉత్పత్తి కేంద్రాల నుంచి వినిమయ ప్రాంతాలకు అవి సులభంగా, వేగంగా రవాణా కావడానికి గొలుసుకట్టు శీతల గిడ్డంగులు సహాయపడతాయని హర్‌సిమ్రత్ కౌర్ అన్నారు.

• వడ్డీరేట్ల ప్రభావం

మళ్లీ ప్రపంచ మార్కెట్లు కుదేలు



నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీలు

ముంబయి: ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు శుక్రవారంనాడు మరోసారి పతనమయ్యాయి. దానికితోడు దేశంలో వడ్డీ రేట్లు పెరగవచ్చనే భయాలు పెరిగాయి. ఫలితంగా, బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ) సెన్సెక్స్ 407.40 పాయింట్లు క్షీణించి 34,005.76 పాయింట్ల వద్ద ముగిసింది. గత నెల రోజుల్లో అది ఇంత కనిష్ఠ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి నిఫ్టీ 10,500 స్థాయికన్నా దిగువకు పతనమైంది. నిఫ్టీ శుక్రవారం 121.90 పాయింట్లు కోల్పోయి 10,454.95 పాయింట్ల వద్ద ముగిసింది. ''ప్రపంచ వ్యాప్తంగా వడ్డీ రేట్ల ధోరణి, పర్యవసానంగా ద్రవ్యోల్బణంపై పడగల ప్రభావం, ప్రపంచ ఆర్థిక వృద్ధి, విదేశీ నిధుల ప్రవాహం ఈ వారమంతా మదుపరుల సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తూ వచ్చాయి'' అని బీఎన్‌పి పరిబస్ మ్యూచువల్ ఫండ్‌లో ఈక్విటీల సీనియర్ ఫండ్ మేనేజర్ కార్తీక్‌రాజ్ లక్ష్మణన్ చెప్పారు. ''అమెరికాలో ఉద్యోగాలు లేవనే క్లైములలో వరుసగా రెండవ వారంలో తరుగుదల కనిపించి, ఆర్థిక వ్యవస్థలో పటిష్టమైన ఉద్యోగాల వృద్ధి గతిని సూచించింది. దాంతో హెచ్చు ద్రవ్యోల్బణానికి సంబంధించిన భయాలకు అంతు లేకుండా పోయింది. ఫలితంగా అమెరికాలో ఊహించిన దానికన్నా వేగంగా వడ్డీ రేట్లు పెరగవచ్చనే భావన నెలకొంది'' అని ఆయన అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వడ్డీ రేట్లు పెరిగితే ప్రవర్థమాన మార్కెట్ల వంటి రిస్కుతో కూడిన ఆస్తులలోకి నిధుల ప్రవాహం మందగించవచ్చని నిపుణలు చెబుతున్నారు.

గుక్క తిప్పకోనివ్వని చైనా

చైనాలో షేర్ల ధరలు 4 శాతం పతనమవడంతో ప్రపంచ స్టాక్ మార్కెట్లు శుక్రవారం అతలాకుతలమయ్యాయి. ప్రపంచ స్టాక్ మార్కెట్ల పరిస్థితి మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా తయారైంది. వాల్‌స్ట్రీట్ కోలుకోకపోవడంతో ఆందోళన పెరిగింది. రుణ వ్యయాలు పెరగవచ్చనే భయాలు మార్కెట్లను పట్టుకున్నాయి. షేర్ల ధరల్లో తీవ్ర హెచ్చు తగ్గులు మరింత పెరిగాయి. ఇది ఘోరమైన వారంగానే పరిణమించే పరిస్థితి కనిపిస్తోంది. యూరో జోన్ సంక్షోభం తర్వాత, స్టాక్ మార్కెట్లు ఇంతలా కంపనలకు గురికావడం ఇదే మొదటిసారి. యూరప్ మార్కెట్లు సాపేక్షంగా చూస్తే ట్రేడింగ్ మొదట్లో తక్కువ నష్టాలకే గురయ్యాయి. కానీ, చైనా మార్కెట్ కూడా పడిపోవడంతో మదుపరులలో నమ్మకం సడలిపోయింది. అమెరికాలో డౌ జోన్స్ ఇండస్ట్రియల్ సూచి ఈ వారంలో రెండవ విడతగా 1000 పాయింట్లు కోల్పోవడంతో మార్కెట్ సర్దుబాటుకు లోనవుతున్నట్లు కనిపిస్తోంది. షాంఘై కాంపోజిట్ ఇండెక్స్ దాదాపు 6 శాతం నష్టపోయి 2017 మే తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. బ్లూచిప్ సి.ఎస్.ఐ 300 ఇండెక్స్ కూడా దాదాపు 6.1 శాతం నష్టపోయింది. మార్కెట్లు ముగిసే సమయానికి ఆ రెండు సూచీలు నష్టాలను 4 శాతానికి కొద్ది పైచిలుకుకు తగ్గించుకోగలిగాయి. అయినా, 2016 ఫిబ్రవరి తర్వాత ఒకే రోజులో అవి ఇన్ని పాయింట్లు కోల్పోవడం ఇదే మొదటిసారి. జపాన్‌కు చెందిన నికాయ్ 2.55 శాతం నష్టపోయింది. విస్తృతమైన మోర్గాన్ స్టాన్లీ క్యాపిటల్ ఇండెక్స్, 47 దేశాల ఏ.సి.డబ్ల్యు.ఐ 6.2 శాతం తరుగుదలను చవి చూశాయి. యూరప్‌కు చెందిన స్టాక్స్ 600 షేర్ ఇండెక్స్ 0.2 శాతం క్షీణించింది.



ఎన్.పి.ఏల ఊబిలో ఎస్.బి.ఐ




ముంబయి: మొండి బాకీలు, వాటికి పక్కన పెట్టిన మొత్తాలు పెరగడంతో భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్.బి.ఐ) గ్రూప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో భారీ స్థాయిలో రూ. 1886.57 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. అది 2016–17 ఆర్థిక సంవత్సరం అక్టోబరు–డిసెంబరు త్రైమాసికంలో రూ. 2,152.14 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అది ఇచ్చిన రుణాలలో నికర మొండి బాకీల నిష్పత్తి 2017–18 మూడవ త్రైమాసికంలో 4.24 శాతం నుంచి 5.61 శాతానికి పెరిగింది. స్థూల కొరగాని ఆస్తుల నిష్పత్తి ఈ క్యూ 3లో 7.23 శాతం నుంచి 10.35 శాతంగా నిలిచింది. ఒక్క మాటలో చెప్పాలంటే, బ్యాంకు ఆస్తులలో నిరర్థక రుణాల విలువ రూ. 1,99,141.43 కోట్లుగా ఉంది. ఎస్.బి.ఐ నికర నిరర్థక ఆస్తులు రూ. 61,430.45 కోట్ల నుంచి దాదాపు రెండింతలై రూ. 102,370.12 కోట్లకు చేరుకున్నాయి. బ్యాంకు వడ్డీయేతర ఆదాయం రూ. 11,507 కోట్ల నుంచి రూ. 8,084 కోట్లకు తగ్గింది. ఫీజుయేతర ఆదాయం రూ. 14,401 కోట్ల నుంచి రూ. 11,755 కోట్లకు తగ్గింది. ఫీజుల ద్వారా ఆదాయం రూ. 4,710 కోట్ల నుంచి రూ. 4,979 కోట్లకు పెరిగింది.

డివిడెండ్ ప్రకటించిన హెచ్.పి.సి.ఎల్

న్యూఢిల్లీ: అధిక రిఫైనరీ మార్జిన్లు, నిల్వలతో పొందిన లబ్ధి వల్ల హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్.పి.సి.ఎల్) ఈ ఆర్థిక సంవత్సర మూడవ త్రైమాసికంలో నికర లాభాన్ని 22 శాతం పెంచుకోగలిగింది. కంపెనీ 2017 అక్టోబరు–డిసెంబరు కాలంలో ఒంటరిగా రూ. 1950 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఇది గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో రూ. 1590 కోట్లుగా ఉంది. మెరుగైన రిఫైనరీ మార్జిన్, నిల్వల వల్ల ఒనగూడిన లబ్ధితో లాభాలు పెరిగినట్లు హెచ్.పి.సి.ఎల్ చైర్మన్ ముకేశ్ కె. సురానా చెప్పారు. కంపెనీకి ముంబయి, విశాఖపట్నంలలో రెండు చమురు శుద్ధి కర్మాగారాలున్నాయి. ముడి చమురును శుద్ధి చేసి ఇంధనంగా మార్చడంలో ఈ క్యూ 3లో ప్రతి పీపాకు 9.04 అమెరికన్ డాలర్లను గడించినట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో, స్థూల రిఫైనింగ్ మార్జిన్ పీపాకు 6.38 అమెరికన్ డాలర్లుగా మాత్రమే ఉంది. చమురు నిల్వల వల్ల రూ. 1477 కోట్లు గడించగలిగినట్లు సురానా చెప్పారు. అది నిర్దిష్ట ధర వద్ద ముడి చమురు కొని, దాన్ని శుద్ధి చేసి ఇంధనంగా, పెట్రోలియం ఉత్పత్తులుగా మార్చి వాటిని విక్రయించేనాటికి ధరలు పెరిగితే నిల్వల వల్ల లాభపడినట్లు భావిస్తారు. కంపెనీ టర్నోవరు కూడా గత ఆర్థిక సంవత్సర క్యూ 3లోని రూ. 55,471 కోట్ల నుంచి రూ. 62,832 కోట్లకు పెరిగింది. హెచ్.పి.సి.ఎల్‌కు చెందిన రెండు రిఫైనరీలు అక్టోబరు–డిసెంబరు కాలంలో 4.52 మిలియన్ టన్నుల ముడి చమురును శుద్ధి చేశాయి. దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల అమ్మకాలు పెట్రోలు (7.1 శాతం), డీజిలు (2.3 శాతం), ఎల్.పి.జి (9.2 శాతం), విమాన ఇంధనం (7.7 శాతం) పెరిగాయి. షేర్‌కు రూ. 14.50 డివిడెండ్ ప్రకటిస్తున్నట్లు సురానా తెలిపారు. హెచ్.పి.సి.ఎల్‌ను ఓ.ఎన్.జి.సి స్వాధీనం చేసుకుంటోంది. హెచ్.పి.సి.ఎల్‌కి 2017 డిసెంబరు 31 నాటికి సుమారు రూ. 12,000 కోట్ల అప్పులున్నాయి.

ఉద్యోగార్హులు పెరిగారు

న్యూఢిల్లీ: కొత్తగా కాలేజీల నుంచి బయటకొస్తున్నవారిలో ఉద్యోగార్హత గత కొద్ది ఏళ్ళలో గణనీయంగా 45.60 శాతానికి పెరిగింది. ముఖ్యంగా ఇంజనీరింగ్, బిఫార్మా, ఎం.సి.ఏ విభాగాల వారికి పిలుపులొస్తున్నాయి. ఉద్యోగాల్లో నియమితులయ్యేందుకు అర్హత ఉన్నవారు 2014లో ఉన్న 33 శాతం నుంచి ఈ ఏడాది 45.60 శాతానికి పెరిగే అవకాశం ఉందని ఇండియా స్కిల్స్ రిపోర్ట్ వెల్లడించింది. జనరిక్ కోర్సులకన్నా ఒకే అంశంపై దృష్టి కేంద్రీకరించిన వృత్తి విద్యా కోర్సులు ఉద్యోగాల్లో వెంటనే నియమించేందుకు అర్హులైన వారిని అందిస్తున్నాయని ఆ నివేదిక తెలిపింది. ఆ కోర్సుల అధికారిక పాఠ్య ప్రణాళికలో ఆచరణాత్మక అనుభవాలను, ఇంటర్న్‌షిప్‌లను భాగం చేస్తున్నారని



పేర్కొంది. ఉద్యోగాల మార్కెట్ 2017లో మందగొడిగా ఉందని, ఇప్పుడు సరఫరా వైపు స్థితి మెరుగుపడడంతోపాటు, సంస్థలు కూడా ఉద్యోగాలు సృష్టించేందుకు సన్నద్ధమవుతున్నాయని టెక్నాలజీ కంపెనీ పీపుల్‌స్ట్రాంగ్ సి.ఇ.ఓ పంకజ్ బన్సల్ చెప్పారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సహకారంతో హెచ్.ఆర్ సొల్యూషన్స్ అండ్ టెక్నాలజీ కంపెనీ పీపుల్‌స్ట్రాంగ్, ప్రతిభా మదింపు సంస్థ వీబాక్స్ ఈ నివేదికను తయారు చేశాయి. ఎం.బి.ఏ చేసినవారికి పిలుపులు తగ్గాయని నివేదిక తెలిపింది. ఎం.బి.ఏ కాలేజీల సంఖ్య పెరిగిపోవడం, ప్రమాణాలు తగ్గిపోవడం దానికి కారణమని చెప్పింది. ఉద్యోగ నియామకార్హత పెంచుకునే విధంగా నైపుణ్యాలను అభివృద్ధిపరచడంలో ప్రభుత్వం, ఇతర సంస్థలు చేస్తున్న కృషి ఫలితాలనివ్వడం మొదలుపెట్టిందని వీబాక్స్ సి.ఇ.ఓ నిర్మల్ సింగ్ అన్నారు. దేశంలోని 5,200 విశ్వవిద్యాలయాలు, వృత్తి నైపుణ్య సంస్థలలో సర్వే చేసి ఈ నివేదికను రూపొందించారు.


ఎగజిమ్మిన లాభాలు

న్యూఢిల్లీ: చమురు, సహజ వాయు సంస్థ (ఓ.ఎన్.జి.సి) ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబరు క్వార్టర్‌లో నికర లాభంలో 15 శాతం పెరుగుదలను కనబరచింది. ఉత్పత్తుల హెచ్చు ధరల వల్ల లాభాలు ఒనగూడినట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర అక్టోబరు–డిసెంబరు త్రైమాసికంలో రూ. 5,014.67 కోట్ల నికర లాభాన్ని గడించింది. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో అది రూ. 4,352.33 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఓ.ఎన్.జి.సి 2017–18 క్యూ 3లో 15.4 శాతం పెరుగుదలతో మొత్తం రూ. 24,122.42 కోట్ల ఆదాయాన్ని వెల్లడించింది.

మహీంద్రా లాభాల్లో జోరు

న్యూఢిల్లీ: మహీంద్రా అండ్ మహీంద్రా 2017 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 12.49 శాతం పెరుగుదలను కనబరుస్తూ ఒంటరిగా రూ. 1215.91 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలో కంపెనీ గడించిన నికర లాభం రూ. 1080.85 కోట్లుగా ఉంది. కంపెనీ రాబడి గత ఏడాది అదే కాలం నాటి రూ. 11,843.74 కోట్ల నుంచి రూ. 11,577.78 కోట్లకు తగ్గింది. కానీ, ఈ రెండు రాబడులను పోల్చడానికి లేదు. జి.ఎస్.టికి ముందు ఎక్సైజ్ సుంకం కూడా రాబడిలో కలిసి ఉండేది. ఇప్పుడది జి.ఎస్.టిలో కలిసింది. గత ఆర్థిక సంవత్సరం అదే కాలంలోకన్నా ఈ ఆర్థిక సంవత్సరం క్యూ 3లో 8 శాతం ఎక్కువగా మొత్తం 1,21,786 వాహనాలను విక్రయించినట్లు కంపెనీ తెలిపింది. పాసింజర్ వాహనాల విభాగం 6.1 శాతం వృద్ధిని కనబరచినట్లు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర మూడవ త్రైమాసికంలో ట్రాక్టర్ల అమ్మకాలు కూడా 6 శాతం పెరిగి 76,943 యూనిట్లుగా నిలిచాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ 3లో ఈశాన్య రుతుపవనాలు సాధారణంగా ఉండడం, జలాశయాలలో నీటి మట్టాలు చక్కని స్థితిలో ఉండడం గ్రామీణ సెంటిమెంట్‌ను, ట్రాక్టర్లకు డిమాండ్‌ను పెంపొందించాయని కంపెనీ తెలిపింది. రానున్న నెలల్లో కూడా ఈ వృద్ధి ధోరణి ఇలాగే కొనసాగేందుకు కళకళలాడుతున్న జలాశయాలు, రబీ నాట్లలో చక్కని ప్రగతి, రబీ పంటలకు కనీస మద్దతు ధరలు పెరగడం దోహదపడవచ్చని కంపెనీ వెల్లడించింది. కొన్ని పరిణామాత్మక అంశాలు ఇటీవలి కాలంలో చూపిన ప్రభావం చెదిరిపోతూ ఆర్థిక వ్యవస్థ జి.ఎస్.టి అమలుకు అలవాటుపడడం వల్ల వృద్ధిలో వేగం ఇలాగే కొనసాగవచ్చని కంపెనీ అభిప్రాయపడింది. సమతూకంతో కూడిన, వ్యవసాయ అనుకూల బడ్జెట్ వ్యవసాయ ఆదాయాలు పెంచి, గ్రామీణ డిమాండ్‌ను ఉద్దీపింపజేయగలదని, ఆర్థిక రికవరీ మరిన్ని చిగుర్లు వేయడానికి తోడ్పడగలదని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది.

విభజనలో మార్పు శుభ సంకేతం



న్యూఢిల్లీ: నిరర్థక ఆస్తుల (ఎన్.పి.ఏ) విభజనకు సంబంధించిన నిబంధనలు సడలించడం వల్ల రూ. 80,000 కోట్ల స్ట్రెస్సడ్ రుణాలతో కునారిల్లుతున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు పెద్ద ఊరట లభించవచ్చు. ''ఎన్.పి.ఏ కేటగిరీకరణకు సవరించిన నిబంధనలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ) ఆమోదించిన తర్వాత, 2017 సెప్టెంబరు 1 నుంచి 2018 జనవరి 31 మధ్యకాలంలో చెల్లించాల్సిన బకాయిలను ఇంతకుముందు మాదిరి 90 రోజులలో కాకుండా 180 రోజుల లోపల చెల్లించే వీలు కలుగుతుంది'' అని ఎం.ఎస్.ఎం.ఇ శాఖ (ఇండిపెండెంట్ చార్జ్) సహాయ మంత్రి గిరిరాజ్ సింగ్ చెప్పారు. వస్తువులు, సేవల పన్ను ప్రభావానికి లోనైన ఎం.ఎస్.ఎం.ఇ రంగానికి ఊతం ఇచ్చేందుకు, దానిలో ఉపాధి అవకాశాల సృష్టిని ప్రోత్సహించేందుకు, ఎం.ఎస్.ఎం.ఇ సంస్థల వర్గీకరణ ప్రాతిపదికలో చేసిన మార్పులకు కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలిపింది. 'ఫ్యాక్టరీ, యంత్రాలు, యంత్రపరికరాలలో పెట్టుబడులు' నుంచి 'వార్షిక టర్నోవరు' వరకు వివిధ అంశాల ఆధారంగా వాటి వర్గీకరణను మార్చారు. అవి తీసుకున్న రుణాలను 180 రోజుల లోపల చెల్లించేందుకు వీలు కల్పించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా రంగంలో దాదాపు రూ. 80,000 కోట్ల మేరకు స్ట్రెస్సడ్ రుణాలున్నాయని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల మంత్రిత్వ శాఖ అరుణ్ కుమార్ పండా చెప్పారు. ''ఆస్తి వర్గీకరణలో డౌన్‌గ్రేడ్ తీసుకురాకుండా, సడలించిన వ్యవధి కింద చెల్లింపులు స్వీకరించేందుకు బ్యాంకులు, నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు అనుమతిస్తాయి. ఇది ఈ రంగ చిరకాల డిమాండ్'' అని ఆయన అన్నారు. ''వ్యాపార నిర్వహణను సులభతరం చేయడాన్ని ఇది ప్రోత్సహిస్తుంది. వర్గీకరణ నిబంధనలను వృద్ధికి తోడ్పడేవిగా చేసి, ఆ సంస్థలను కొత్త పన్ను వ్యవస్థతో అనుసంధానపరుస్తాయి'' అని ఒక అధికారిక ప్రకటన వెల్లడించింది. వస్తువులు ఉత్పత్తి చేసే, సేవలందించే సంస్థలను వార్షిక టర్నోవరు ప్రాతిపదికన నిర్వచించేందుకు 2006 నాటి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల అభివృద్ధి (ఎం.ఎస్.ఎం.ఇ.డి) చట్టంలోని 7వ సెక్షన్‌ను సవరిస్తారని ఆ ప్రకటన తెలిపింది. వార్షిక టర్నోవరు రూ. 5 కోట్లు దాటనివాటిని సూక్ష్మ, టర్నోవరు రూ. 5 కోట్లు పైన ఉండి రూ. 75 కోట్లు దాటనివాటిని చిన్న, టర్నోవరు రూ. 75 కోట్లకు పైన ఉండి రూ. 250 కోట్లు మించని వాటిని మధ్య తరహా సంస్థలుగా పరిగణిస్తారు. పరిశ్రమల రంగం కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరచగలదని చెప్పింది. కొత్త ''నిర్వచనం వ్యాపార నిర్వహణను సులభతరం చేయడంతోపాటు ఈ రంగంలో స్థాయిని, అధునాతన భావనలను, వేగాన్ని ప్రోత్సహించేందుకు తోడ్పడుతుంది. పైగా, కొత్త టర్నోవరు ఆధారిత కొలబద్ద జి.ఎస్.టి వ్యవస్థకు అనుగుణంగా అమరడం వల్ల జి.డి.పిలో ఎం.ఎస్.ఎం.ఇ.ల వాటా ఏ మేరకు ఉన్నదీ మదింపు చేసేందుకు సరైన సాధనం అందివచ్చినట్లు అవుతుంది.'' అని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ డైరెక్టర్–జనరల్ చంద్రజిత్ బెనర్జీ అన్నారు.

తగ్గిన నికర లాభం

చెన్నై: ఇండియా సిమెంట్స్ 2017 డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికంలో ఒంటరిగా రూ. 15.24 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 'అత్యంత సవాళ్ళతో కూడిన త్రైమాసికాల్లో' అది ఒకటైనప్పటికీ, లాభాలు గడించగలిగామని కంపెనీ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం క్యూ 3లో ఇండియా సిమెంట్స్ రూ. 35.34 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. హెచ్చు ఇంధన వ్యయాలు, పెట్ కోక్ వినియోగంపై అనిశ్చితి, ప్రధాన మార్కెట్ అయిన తమిళ నాడులో పేలవంగా ఉన్న అమ్మకాలు సమస్యలుగా పరిణమించాయని కంపెనీ చైర్మన్ ఎన్. శ్రీనివాసన్ చెప్పారు. మహారాష్ట్రలో మటుకు సిమెంటుకు మంచి డిమాండ్ కనపడినట్లు ఆయన తెలిపారు.

మనం రియల్

శనివారం, 10 ఫిబ్రవరి 2018


www.manamnews.com



స్థిరాస్తి అంటే.. కదలకుండా స్థిరంగా ఉంటుందని మన నమ్మకం.. బంగారంలా దొంగలు ఎత్తుకెళ్లలేరు. డబ్బులా కరిగిపోదు.. జీవితాంతం తోడునీడలా ఉంటూ.. అవసరానికి ఆదుకుంటుంది. అందుకే, అందరూ తమ స్థాయి, స్తోమత బట్టి భూముల్నీ, ఫ్లాట్లనూ.. కనీసం ఇల్లు, ఫ్లాటును కొనేస్తుంటారు. ఇలా కొన్న ఆస్తులకు ఏమైనా చిక్కులు వస్తే? మానసికంగా ఎంతో ఆవేదన.. అలాంటి పరిస్థితి మీకు ఎదురవకూడదు అనుకుంటే.. కొనేప్పుడు ఏం చూడాలి. కొన్నాక ఏం చేయాలి? తెలుసుకోవాలి.

ఆస్తులు కొందాం!

వ్యవసాయ భూమి.. పరిశ్రమలకు, వ్యాపార భవంతులకు పనికొచ్చే పట్టణ భూమి.. నివాస స్థలం (ప్లాటు), ఇల్లు, ఫ్లాటు.. ఏదైనా సరే.. ఇవన్నీ భూమిలో భాగమే. మీరు కొనబోయే భూమికి దారి ఉందా? నీటి వసతి ఉందా? నేల ఎలాంటిది అనే విషయాలు తెలుసుకుంటారు. ఇవి ఎంత అవసరమో.. భూమికి నిజమైన యజమాని ఎవరు.. మనకు అమ్మే వారి హక్కులు ఏమిటి? అతడు యజామానా? యజమాని నుంచి హక్కులు, అధికారాలేమైనా పొందాడా? ఆ హక్కులు, అధికారాలు ఇంకా అమల్లో ఉన్నాయా? అనేవీ అంతే ప్రధానం. ఇవన్నీ తెల్సుకోవాలంటే... అతని వద్ద ఉన్న పత్రాల్ని అడగాలి. వాటిని పరిశీలించాలి. మనకు అర్థం కాకపోయినా, అనుమానం వచ్చినా అంత సమయం, అనుభవం లేకపోయినా మనకు నమ్మకమైన అనుభవజ్ఞులైన స్థిరాస్తి న్యాయవాదుల్ని సంప్రదించాలి. ఎందుకంటే.. స్థిరాస్తి పత్రాలు అర్థం కావాలంటే వాటికి సంబంధించిన చట్టాలు, నిబంధనలు, ఎప్పటికప్పుడు మారుతూ ఉండే భాష్యాలు, పరిపాలనా విధివిధానాలు, సాంకేతిక మార్పులు తదితరాలపైన పూర్తి అవగాహన ఉండాలి. చట్టాలు అవే ఉన్నా.. వాటి అమలు, తీరును బట్టి మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మారుతూ ఉంటాయి. భూ యాజమాన్య హక్కుల్ని తెలుసుకోవడం చాలా సులువని చాలామంది అనుకుంటూ ఉంటారు. ఏముందీ ప్లాటు అయితే లేఅవుటు, దస్తావేజు, తనఖా పత్రం (ఈసీ) చూసి చెప్పేయొచ్చు.. ఫ్లాట్/ఇల్లు అయితే నిర్మాణ అనుమతి ఉందా? వ్యవసాయ భూమి అయితే.. పహాణీ/అడంగల్ ఉన్నాయా? పాస్ పుస్తకాలు ఉన్నాయా?



ఏం చూడాలి

అధికారులిచ్చే పాసు పుస్తకాలకూ, కోర్టు డిక్రీలకూ, రిజిష్టర్డు దస్తావేజులు మాత్రమే కాదు. వీటితోపాటు పరిశీలించాల్సిన అనేక ఇతర అంశాలు కూడా ఉన్నాయి. అవేమిటో తెలుసుకుంటే.. ఏ ఆస్తి కొనాలన్నదానిపై ఓ అవగాహన వస్తుంది. వారసత్వంగా సంక్రమించిన సందర్భాల్లో వారసులెవ్వరో తెలియాలి. మతాన్ని బట్టి వారసత్వ చట్టాలు వర్తిస్తాయి. హిందువులకు హిందూ ధర్మ సూత్రాలు, చట్టాలు ఉంటాయి. ముస్లింలలో సున్నీ, షియా తెగలకు తేడా ఉంది. క్రిష్టియన్, పార్శీలకు ఆయా శాసన నిబంధనలు వర్తిస్తాయి. అయితే, రిజిష్టరు వివాహం చేసుకున్న దంపతులకు వారి మతంతో సంబంధం లేకుండా లౌకిక వారసత్వ చట్టం వర్తిస్తుంది. హిందువులైనా రాష్ట్రాలను బట్టి అక్కడ అమల్లో ఉన్న చట్టాల్లో తేడా ఉంది. అమల్లోకి వచ్చిన తేదీల్లో వ్యత్యాసం ఉంది.

ఇతర ఆస్తి బదిలీ అంటే జీవించి ఉన్న వారి మధ్య జరిగే స్థిరాస్తి లావాదేవీలు, క్రయం, కౌలు, దానం, తనఖా, పరటా(మార్పిడి)లాంటివి. తప్పనిసరిగా రిజిష్టరు చేయించాలి. రిజిష్టరు కాకపోతే హక్కులు బదిలీ కావు.

వారసత్వం అయినా.. హక్కుల బదిలీ అయినా.. అసలు వ్యక్తికున్న హక్కులేకానీ, అతనికి లేని హక్కులు ఏమీ సంక్రమించవు. బదిలీ కావు. ఆస్తికి తనఖా ఉన్నా.. కౌలు ఉన్నా.. ఇతర ఆంక్షలేమైనా ఉన్నా వాటికి లోబడే వారసులు లేదా ఆస్తి రాయించుకున్న వారి హక్కులు ఉంటాయి.

ఆస్తి ఉంటే సరిపోదు. బదిలీ చేసే దా, అధికారం కూడా ఉండాలి. మైనర్లు, మతిస్థిమితం లేని వారు, దివాళాతీసిన వ్యక్తులు రాసిన దస్తావేజులు చెల్లవు. అలాగే కోర్టు నిషేధపు ఉత్తర్వుల్నీ, చట్టపరమైన ఆంక్షల్నీ అతిక్రమించి, చేసిన లావాదేవీలేమీ చెల్లవు.

చట్టపరమైన ఆంక్షలు అనేకం. షెడ్యూల్డు ప్రాంతాల్లో గిరిజనేతర్లు వారసత్వంగా తప్ప, ఆస్తి బదిలీ రూపంలో హక్కులు పొందలేరు. అవి చెల్లవు. ఆస్తి బదలాయింపు హక్కులు లేకుండా, ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు ఇచ్చిన పట్టాభూములు అమ్మినా, కొన్నా, ఇతరంగా పొందినా చెల్లవు. ఈ విషయంలో కోర్టు డిక్రీలు చెల్లవు.

ప్రభుత్వ భూములు

ప్రభుత్వ భూములు ఇవే అని కచ్చితమైన అధికారిక భోగట్టా అంటూ ఏమీ లేదు. ఉన్నా వాటిని దొరకనీయరు. లేదా రకరకాల మాయలు చేస్తుంటారు. గత కొన్నేళ్లుగా భూ రికార్డులు కంప్యూటరీకరణ చేయాలన్న ప్రయత్నాలకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారే కానీ, ఫలితం కనిపించడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్ చట్టాన్ని సవరించింది. దీని ప్రకారం ప్రభుత్వం లేదా ప్రభుత్వ సంస్థల భూములని భావిస్తే.. ప్రభుత్వ ప్రకటన ద్వారా ఆ భూముల రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయొచ్చు. ఈ ప్రకటన ప్రక్రియ ప్రభుత్వ భూమల్ని కాపాడటం కంటే అవినీతికి తెరలేపింది. కోర్టుల్లో కొత్తరకం దావాలకు దారి తీసింది. కారణాలు, సాక్ష్యాధారాలకంటే.. ఎలాంటి విచారణ, నోటీసులు లేకుండా కేవలం కలెక్టరు నివేదికల్ని ప్రాతిపదికగా చేసుకోవడం దీనికి కారణం. వీటి మర్మం తెలుసుకోవాలంటే..సమాచార చట్టాన్ని వినియోగించి వెంటబడటమే ఏకైక మార్గం. అయితే, సమయానికి సరైన సమాచారం దొరకడం నిజంగా చాలా గొప్ప అదృష్టం.



ఇక ఆస్తి అమ్మ జూపేవారి దస్తావేజు ఉంటే సరిపోదు. గతంలోనే అన్యాక్రాంతం చేశారా.. తనఖాలు వగైరా ఏమైనా ఉన్నాయా? అని తెల్సుకోవాలి. లేకపోతే మోసపోయినట్టే. దీనికి తనఖా ధ్రువపత్రం లేదా ఈసీ తీసుకోవడం రివాజు. సంబంధిత రిజిస్ట్రారు రుసుం కట్టించుకొని ఇచ్చే ఈ ధ్రువపత్రానికి హామీ లేదు. అనేకసార్లు దీన్లో చాలా రిజిష్టర్డు పద్దులు కనిపించవు. అయినా, సార్వభౌమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే అధికారం, నష్టపోయిన వారికి నష్టపరిహారం ఇప్పించే అవకాశం చట్టం ఇవ్వలేదు.



అయితే, చట్టం ఈ పద్దులకు సంబంధించిన ఇండెక్స్ పుస్తకాలను పరిశీలించే ఏర్పాటు చేసింది. దీన్ని కూడా భద్రతా పరిపాలనా కారణాలుగా అధికార్లు నిరాకరిస్తున్నారు. ఇండెక్స్ పుస్తకాల్ని పూర్తిగా డిజిటలైజ్ చేసి అంతర్జాలం ద్వారా బట్వాడా చేసేందుకు ప్రయత్నాలు ఇంకా నత్తనడకన నడుస్తున్నాయి.



స్థిరాస్తి విషయంలో ప్రభావితం చేసేవి కోర్టులు, అనేక చట్టాల కింద సంబంధించిన అధికార్లు జారీ చేసే ఉత్తర్వులు, డిక్రీలు వగైరా. కోర్టులు, అధికార్లు ఏ ఉత్తర్వులు ఏయే భూముల విషయంలో జారీ చేస్తున్నారు తెలుసుకోవడానికి సరైన వ్యవస్థ లేదు. కొంత వరకూ అంతర్జాలంలో లభించే సమాచారం వల్ల వీలవుతుంది. దానికీ చాలా అవగాహన అవసరం. అదీ అసమగ్రం. కోర్టులో కొనసాగుతున్న కేసులకు



సంబంధించిన స్థిరాస్తులను తెలిసికొన్నా.. తెలియక కొన్నా ఆ కోర్టు ఉత్తర్వులకు లోబడే ఉంటుంది. అందుకే చాలామంది కేసు పడగానే మభ్యపెట్టి అయినకాడికి అమ్మేస్తుంటారు. కోర్టు డిక్రీలు, అధికారుల ఉత్తర్వులు ఖాయమయయ్యాయో.. పైకోర్టుల్లో ప్రశ్నించారో కూడా వాకబు చేసుకోవాలి. ఆ ఉత్తర్వుల ప్రభావం ఏమిటి ఎవర్ని బద్ధుల్ని చేస్తాయి.. అనే విషయంలోనూ న్యాయ సలహా అవసరం. అసలు పత్రాలు ఎక్కడున్నాయి అనేది చూసుకోవాలి. ఎందుకంటే.. వాటిని కుదవ పెట్టి ఉండొచ్చు. కాబట్టి, తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

భూమికి సంబంధించి సర్వే/రెవిన్యూ రికార్డులనూ సరి చూసుకోవాలి. కానీ, కేవలం వాటిపైనే ఆధారపడ కూడదు. ఎందుకంటే అవి హక్కుల్ని కల్పించవు. హక్కులను ప్రతిబింబించేవి మాత్రమే. వాటి ప్రాధికారత అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. అలాగే భూ వినయోగం, నిర్మాణానికి సంబంధించిన నిబంధనలపై అవగాహన కావాలి.

పరిమితి దాటి

వ్యవసాయ భూములు ఒక పరిమతికి మించి ఎవరికీ ఉండరాదు. పరిమితి దాటి ఏ రూపంగా పొందినా, వారసత్వంగా కానీ, కొనుగోలు, డిక్రీ రూపంగా ఇతరంగా ఎలా వచ్చినా, సంబంధిత చట్ట వలయంలోకి వస్తారు. వారు విధిగా తమ భూముల్ని సంబంధిత అధికారి ముందు నిర్ణీత పత్రం ద్వారా తెలియజేయాలి. ఆ తర్వాత తగు ఉత్తర్వులు పొంది, మిగులు భూమిని స్వాధీనం చేస్తే తప్ప, వారు చేసే లావాదేవీలు చెల్లవు. హైదరాబాద్, వరంగల్, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం నగరాల్లో పట్టణ భూముల పరిమితి చట్టం అమల్లో ఉండేది. ఆ చట్టాన్ని 27.03.2008 నుంచి తెలుగు రాష్ట్రాల్లో రద్దు చేశారు. అయినా, ఆలోగా మిగులు భూములుగా నిర్ధారణ అయి, ఖాయపడిన భూములు ప్రభుత్వానికి చెందుతాయి. వాటి గురించి ప్రభుత్వం క్రమబద్ధీకరణకు నిబంధనలు తెచ్చి, డబ్బు కట్టించుకున్నప్పటికీ తగు ఉత్తర్వులు జారీ కానీ కేసులు అనేకం. అలాగే కోర్టుల్లో అపరిష్కృతంగా ఉన్న కేసులు ఉన్నాయి. కాబట్టి, ఈ విషయంలో తనిఖీ అవసరం. ఇక చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సింది, ప్రభుత్వ భూములా, లేదా దేవాదాయ, ధర్మాదాయ భూములా అన్న విషయం. దేవాదాయ, ధర్మాదాయ, భూమల విషయంలో కొంత వరకూ రికార్డులు దొరుకుతాయి. ప్రభుత్వ భూముల విషయంలో తెల్సుకోవడం చాలా కష్టం.



స్థిరాస్తిని కాపాడుకోవాలంటే..!

బంగారం బ్యాంకు లాకర్లో పెట్టొచ్చు. గేదెను తాడుతో కట్టేయొచ్చు. కానీ, స్థిరాస్తిని కాపాడుకోవాలంటే.. చట్ట రక్షణ కావాలి. ఏదైనా సమస్య వచ్చినప్పుడు కోర్టుల్నో, అధికారులనో ఆశ్రయించాలి. అందుకు పత్రాలు కావాలి. లాయర్లు కావాలి. వాదనలు జరగాలి. ఆర్డర్లు కావాలి. అమలు జరగాలి. ఇవన్నీ సమస్య వచ్చినప్పుడు దొరకవు. రాకముందే.. రాకుండానే.. అన్నీ పరిశీలించి, పేచీలేని వివాదంకాని ఆస్తుల్ని సరైన పత్రాల్తో కొనుక్కోవాలి. అంతేకానీ, చౌకగా వస్తోందనో, బ్యాంకు లోను దొరికిందనో, మనవాళ్లు చూసుకుంటారనో, రిజిష్టర్డు పత్రాలున్నాయనో.. కోర్టు డిక్రీలున్నాయనో.. ఇలాంటి పరిమిత కారణాలతో కొని సమస్య వచ్చినప్పుడు వ్యక్తుల్నీ, వ్యవస్థల్నీ నిందించొద్దు.



సరైన పత్రాలు ఉండాలి

బ్యాంకులోను వచ్చింది కదా? అని కొందరు.. రిజిష్టర్డు పత్రం ఉంది కదా అని మరికొందరు.. కోర్టు డిక్రీనో, తహసీల్దార్ ఇచ్చిన పాసుపుస్తకం ఉంది కదా? వాటికేం విలువ లేదా అంటూ నిలదీస్తూ ఉంటారు మరికొందరు. మరి ఇవన్నీ ఉన్నా.. సమస్యలు ఎందుకు వస్తున్నాయి. కోర్టు కేసులు ఎందుకు పడ్తున్నాయి. అధికార్లు ఎందుకు నోటీసులిస్తున్నారు? మీ పత్రాలకు విలువ లేదనో.. మీ స్థలం ఇది కాదనో.. మీరు కొన్న స్థలం మాదనో ఎందుకు తగాదాలు పడుతున్నట్లు?

వడ్డీ తప్పదు!




స్థిరమైన రాబడి.. పెట్టుబడికి హామీ అనగానే వెంటనే గుర్తుకు వచ్చేవి ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్లు. వీటిపై లభించే వడ్డీకి ఆదాయపు పన్ను వర్తించడం ఒక్కటే ఇందులో ప్రతికూలాంశం. అయినప్పటికీ ఎక్కువమందికి ఇవే నమ్మకమైన పొదుపు పథకాలు. తాజాగా బ్యాంకు డిపాజిట్లపై వర్తించే ఆదాయపు పన్ను విషయంలో కొన్ని మార్పులు వచ్చి చేరాయి. ఎరిమితికి మించిన ఆదాయం ఉన్న వారెవరైనా సరే నిబంధనలకు అనుగుణంగా ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. మరి, పెట్టుబడులు పెట్టినప్పుడు వచ్చిన రాబడి కూడా ఆదాయమే. అందుకే, దానినీ మన మొత్తం ఆదాయంలో కలిపి చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. మరి ఈ పన్ను భారం తగ్గించుకోవాలన్నా.. పూర్తిగా మినహాయింపు పొందాలన్నా కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. బ్యాంకు పొదుపు ఖాతాలో సాధారణంగా 4శాతం వార్షిక వడ్డీ లభిస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో వచ్చిన వడ్డీ మొత్తం రూ.10వేలు మించకపోతే ఆదాయపు పన్ను సెక్షన్ 80టీటీఏ ప్రకారం ఎలాంటి పన్నూ వర్తించదు. ఒకవేళ రూ.10వేలు దాటితే పన్ను వర్తిస్తుంది. అయినప్పటికీ బ్యాంకు మూలం వద్ద పన్ను కోతను విధించదు. రిటర్నులు దాఖలు చేసేప్పుడు ఈ విషయాన్ని పేర్కొని, ఇతర ఆదాయంగా చూపించి నిబంధనల మేరకు పన్ను చెల్లించాలి.

ప్రణాళికలో తప్పులు వద్దు



స్థూల ఆర్థిక ప్రణాళికలో పన్ను ఆదా పథకాలకూ ప్రముఖ స్థానం ఉంది. పూర్తి అవగాహన లేకుండా ప్రణాళిక రూపొందించుకుంటే భవిష్యత్తులో నష్టపోవాల్సి రావచ్చు. ఆర్థిక సంవత్సరం చివర్లో చాలామంది పన్ను ప్రణాళికల్లో కొన్ని తప్పులు చేస్తుంటారు. పన్ను మినహాయింపు పొందేందుకు కొంత మొత్తం పెట్టుబడి పెట్టాలనగానే చాలామంది ఏ ఆలోచనా లేకుండా అంత మొత్తాన్నీ ఏదో ఒక పాలసీలోనో.. లేదా ఏదైనా ఒక పెట్టుబడి పథకంలోనే మదుపు చేస్తుంటారు. స్వల్పకాలిక దృష్టితో దీర్ఘకాలిక పెట్టుబడులను ఎంచుకోవడం ఎప్పుడూ పొరపాటే. కాబట్టి, ముందుగా పన్ను ఆదా కోసం ఎంత కేటాయించాలి? దానివల్ల మనకు వచ్చే ప్రయోజనాలు ఎలా ఉన్నాయి అనే సంగతులన్నీ తెలుసుకోవాలి. ఆదాయపు పన్ను మినహాయింపు కోసం వేటిని పరిగణనలోనికి తీసుకుంటారన్న విషయంలో చాలామందికి అవగాహన ఉండదు. అందుకే, పన్ను ప్రణాళిక సిద్ధం చేసుకునేప్పుడు ముందుగా తెలుసుకోవాల్సిన విషయం ఇదే. ఇంటి అద్దె, ఎల్‌టీఏ, భోజనం కూపన్లు, వైద్య ఖర్చుల తిరిగి చెల్లింపు, ఆరోగ్య బీమా, ఇతర భత్యాల్లాంటివి కొన్ని పరిమితులకు లోబడి పన్ను మినహాయింపు వర్తిస్తుంది. చాలామంది వీటికి సంబంధించి పూర్తి స్థాయిలో మినహాయింపును పొందలేరు. కారణం తమకు వస్తున్న భత్యాలు, ఇతర చెల్లింపుల గురించి వారికి తగిన అవగాహన లేకపోవడమే.

కార్డుంటే చాలు!



కొత్త కారుకోసం అప్పు కావాలా? సొంతింటి కోసం రుణం తీసుకోవాలా? వ్యక్తిగత రుణం, క్రెడిట్ కార్డు తీసుకుంటే ఎలా ఉంటుందని ఆలోచిస్తున్నారా? వీటన్నింటికన్నా ముందు.. మీ రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరు సంగతేమిటి? తొలిసారిగా కార్డు వాడుతున్నారు కాబట్టి, బిల్లులకు సంబంధించిన విషయాల్లో కచ్చితంగా ఉండండి. మీపై నమ్మకం కలిగేలా ప్రవర్తించండి. అప్పుడే మీ క్రెడిట్ స్కోరు పెరగడానికి అవకాశం ఉంది. ఇప్పటికే మీ వద్ద మూడు క్రెడిట్ కార్డుల కన్నా ఎక్కువున్నాయా? మళ్లీ కొత్త కార్డు తీసుకోవాలని భావిస్తున్నారా? అయితే.. మీ చేజేతులా క్రెడిట్ స్కోరు తగ్గించుకోవడానికి కృ షి చేస్తున్నారన్నమాట. గరిష్ట పరిమితి ఇచ్చే కంపెనీ కార్డును మాత్రమే ఎంచుకోండి. మీరు అంత మొత్తం వినియోగించుకోకున్నా ఎక్కువ మొత్తంలో ఉండటం వల్ల క్రెడిట్ స్కోరు పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది. ఏళ్ల తరబడి వాడుతున్న దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకండి. కార్డును రద్దు చేసుకోవాల్సిన అవసరం వస్తే.. కొత్తగా తీసుకున్న వాటిని మొదట వదిలించుకోండి. ఒకటికి మించి కార్డులుంటే అన్ని కార్డులను వాడటానికి ప్రయత్నించండి. కొన్ని కార్డు కంపెనీలు మీరు ఆరు నెలలకు మించి వాడకుంటే.. మీరు కార్డును రద్దు చేసుకున్నట్లుగా భావిస్తాయి. ఇలాంటప్పుడు మీ క్రెడిట్ స్కోరు ప్రభావితం అయ్యే అవకాశాలున్నాయి. కొత్తగా వచ్చిన క్రెడిట్ కార్డుకు క్రెడిట్ పరిమితి భారీగా ఉండి, పాత కార్డుకు తక్కువ మొత్తంలో ఉందనుకోండి. రెండింటిలో ఒకదానిని రద్దు చేసుకోవాల్సిన అవసరం వచ్చినప్పుడు దేన్ని ఎంచుకోవాలి? ముందుగా మీ పాత క్రెడిట్ కార్డు బ్యాంకును సంప్రదించి మీ గురించి తెలియజేయండి.



భారత్ ఇంటికి

క్వార్టర్స్‌లో ఓడిన పురుషులు, మహిళల జట్లు

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

అలోర్ సెటర్ (మలేసియా): ఏ ఒక్కరితోనో జట్టు గెలవదు. ఐదు వేళ్ల బిగిస్తేనే పిడికిలి అవుతుందన్నట్టు అందరూ కలిసి కట్టుగా ఆడితేనే జట్టు విజయాలను సొంతం చేసుకుంటుంది. ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సరిగ్గా ఇదే జరిగింది. హైదరాబాద్ స్టార్ షట్లర్ పీవీ సింధు ఒంటరి పోరు కొనసాగించింది. మిగిలిన వాళ్లు కనీస పోరాటం చేయకపోవడంతో మహిళల జట్టు నిష్క్రమించింది. శుక్రవారమిక్కడ జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో పీవీ సింధు ఒక్కతే గెలిచింది. మిగిలిన వాళ్లంతా సత్తా చాటలేకపోవడంతో భారత్ 1-3తో ఇండోనేషియా చేతిలో ఓటమిపాలై ఇంటి ముఖం పట్టింది. గురువారం జపాన్ చేతిలో ఓడిన మాదిరిగానే శుక్రవారం కూడా జరిగింది. తొలి సింగిల్స్‌లో సింధు 21-13, 24-22తో ఫిట్రియాని ఫిట్రియానిపై పోరాడి గెలిచి జట్టుకు ప్రోత్సహకరమైన ఆరంభాన్ని ఇచ్చింది. ఆ తర్వాత భారత జట్టు పతనమైంది. వరుసగా మూడ మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. తర్వాత జరిగిన డబుల్స్‌లో అశ్వినీ పొన్నప్ప, సిక్కిరెడ్డి జంట 5-21, 16-21తో గ్రేసియా పొల్లి, అప్రియాని రహాయు జోడీ చేతిలో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో భారత ద్వయం ఏ దశలోనూ పోరాట పటిమ ప్రదర్శించలేదు. తర్వాత జరిగిన మరో సింగిల్స్‌లో ప్రియ కుడారవల్లిపై 8-21, 15-21తో హన్నా రమదిని గెలిచింది. ఇక్కడ కూడా ప్రియ తన ప్రత్యర్థిపై ప్రతిఘటించలేకపోయింది. తర్వాత జరిగిన రెండో డబుల్స్‌లో సింధు, సంయోగిత ఘోర్పడే 9-21, 18-21తో అనగ్గియా షిట్టా అవాండా, మహదేవి ఇస్తరాని చేతిలో ఓటమిపాలు కావడంతో భారత జట్టు ఓటమి పరిపూర్ణమైంది. పురుషుల జట్టు పోరులోనూ అదే కొనసాగింది. కిదాంబి శ్రీకాంత్ నేతృత్వంలోని పురుషుల జట్టు కూడా 1-3తోనే చైనా చేతిలో ఓడింది. తొలి సింగిల్స్‌లో శ్రీకాంత్ గెలిచాడు. కానీ తర్వాతి మ్యాచ్‌ల్లో ఒక్కరు కూడా జట్టును గెలిపించే ప్రయత్నం చేయలేదు.



దక్షిణ కొరియాలోని పియాంగ్‌చాంగ్‌లో వింటర్ ఒలింపిక్స్ శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భారత లుగర్ అథ్లెట్ శివ కేశవన్ త్రివర్ణ పతాకధారిగా వ్యవహరించాడు.

భారత్‌కు మూడు పతకాలు

ఐటీటీఎఫ్ ఒమన్ ఓపెన్ టెబుల్ టెన్నిస్



మస్కట్: ఐటీటీఎఫ్ ఒమన్ వరల్డ్ జూనియర్ అండ్ క్యాడెట్ ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో శుక్రవారం భారత్ మూడు పతకాలను గెలుచుకుంది. విరాట్ కోహ్లీ ఫౌండేషన్ మద్దతిస్తున్న స్వస్తిక్ ఘోష్, వరుణి జైస్వాల్ జోడీ సబ్ జూనియర్ బాలికల టీమ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలిచింది. సెమీఫైనల్లో సిరియాను ఓడించిన ఈ భారత జంట ఫైనల్లో చైనా చేతిలో ఓట మిపాలైంది. క్యాడెట్ బాలుర విభాగంలో రిశికేష్ మల్హోత్రా, జాష్ మోడీ జోడీ క్వాలిఫయింగ్ రౌండ్‌లో సౌదీ అరేబియా, ఇండోనే షియా జట్లను ఓడించి మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. కానీ మెయిన్ డ్రాలోనూ ఒమన్-ఎ, జోర్డాన్ జట్లను ఓడిం చిన రిశికే ష్, జాష్ ద్వయం ఫైనల్లో చైనా చేతిలో ఓటమిపాలై రజ తంతో సంతృప్తి చెందింది. ఇక క్యాడెట్ బాలికల టీమ్ విభాగంలో సుహానా సైనీ, అనన్య జంట కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

ఐసీసీ డైరెక్టర్‌గా ఇంద్రా నూయి నియామకం



దుబాయ్: ఐసీసీ బోర్డు తొలి స్వతంత్ర మహిళా డైరెక్టర్‌గా పెప్సీ కో చైర్మన్, సీఈఓ ఇంద్రా నూయిని నియమించినట్టు అంత ర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) శుక్ర వారం ప్రకటించింది. జూలైలో పదవీ బాధ్యతలు చేపట్టనున్న ఈమె ఐసీసీ స్వతంత్ర చైర్మన్‌తో కలిసి పనిచేస్తారు. ఈమె నియామకంపై ఐసీసీ సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. ఐసీసీకి ఒక స్వతంత్ర చైర్మన్ ఉండాలని.. అదీ మహిళే అయివుండాలన్న ఆలోచనకు 2017 జూన్‌లో జరిగిన ఐసీసీ సర్వసభ్య కౌన్సిల్‌లో ఆమోద ముద్ర పడింది. ఐసీసీని అభివృద్ధి చేసే క్రమంలో రాజ్యాంగంలో భారీ మార్పులు చేపట్టాలోంచి పుట్టిందే ఈ స్వతంత్ర మహిళా డైరెక్టర్ పదవి అని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. పెప్సీకో చైర్మన్ ప్రపంచ వ్యాప్త వ్యాపారవేత్త. ఈమె ప్రపంచ అత్యంత శక్తివంతమైన మహిళల మేగజైన్ ఫార్చ్యూన్ మేగజైన్‌లో క్రమం తప్పకుండా ర్యాంక్‌లు తెచ్చుకుంటూనే ఉంటుంది. ఈమె పెప్సీకోలో చీఫ్ అర్కిటెక్ట్ కూడా. 2006 నుంచి ఈమె నేతృత్వంలో పెప్సికో సంస్థ అనేక రకాల వాతావరణ ప్రభావరహిత పౌష్టికాహారాలను, పానీయాలను మార్కెట్లోకి తెస్తోంది. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ సందర్భంగా ఐసీసీ చైర్మన్ శశాంక్ మనోహర్ మాట్లాడుతూ.. 'ఇంద్రాను ఐసీసీలోకి సంతోషంగా ఆహ్వానిస్తున్నాం. మా పరిపాలనను మరింత మెరుగు పరుచుకునేందుకు ఓ స్వతంత్ర డైరెక్టర్‌ను.. అందులోనూ ఓ మహిళను నియమించి కీలకమైన ముందడుగు వేశాం. ప్రపంచ గేమ్ క్రికెట్‌కు ఇంద్రా సామర్థ్యం ఎంతో ఉపయోగపడుతుంది. వ్యాపారంలో అత్యంత ప్రభావవంతమైన వారిలో ఇంద్రా వరుసగా గుర్తింపు తెచ్చుకుంటోంది. ప్రపంచంలోని అతిపెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఒకటైన పెప్సికోను ఆమె నడిపిస్తోంది. మా సంస్థతో ఇప్పటికే అనుబంధం కలిగి అసాధారణ ప్రతిభ ఉన్న సరైన అభ్యర్థి కోసం వెతికినప్పుడు ఇంద్రా నూయి పేరు తెరపైకి వచ్చింది.

సిరీస్‌పై గురి

నేడు ఇండియా, సౌతాఫ్రికా నాలుగో వన్డే

సాయంత్రం 4-30 నుంచి సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం



జొహన్నెస్‌బర్గ్: సౌతాఫ్రికా పర్యటనలో టెస్టు సిరీస్‌లో పేలవ ప్రదర్శన కనబరిచిన కోహ్లీ సేన వన్డే సిరీస్‌లో వరుస విజయాలతో దూసుకెళుతోంది. వరుసగా మూడు వన్డేల్లో గెలిచిన టీమిండియా నాలుగో వన్డేలోనూ గెలిచి చారిత్రాత్మక సిరీస్‌ను కైవసం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. మరోవైపు గాయాలతో సతమతమవుతున్న సౌతాఫ్రికా సిరీస్ ఆశలను సజీవంగా నిలుపుకునేందుకు గట్టి ప్రయత్నమే చేయనుంది. శనివారమిక్కడ ఇండియా, సౌతాఫ్రికా మధ్య కీలకమైన నాలుగో వన్డే జరగనుంది. ఆరు మ్యాచ్‌ల ఈ వన్డే సిరీస్‌లో 3-0 ఆధిక్యంతో నిలిచిన కోహ్లీ సేన తొలిసారి సిరీస్‌ను కైవసం చేసుకునేందుకు సిద్ధమైంది. 2010-11లో మహేంద్ర సింగ్ ధోనీ నేతృత్వంలోని టీమిండియా సిరీస్ గెలుచుకునేందుకు దగ్గరగా వచ్చి విఫలమైంది. మొదట 2-1 ఆధిక్యంతో నిలిచిన టీమిండియా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-3తో కోల్పోయింది. 1992-93 తర్వాత సౌతాఫ్రికాతో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో టీమిండియా వరుసగా మూడు మ్యాచ్‌లు గెలవడం ఇదే తొలిసారి. ఈ నాలుగో వన్డే కూడా గెలిస్తే ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా నంబర్ వన్ ర్యాంక్‌ను స్పష్టమైన అంతరంతో కైవసం చేసుకుంటుంది. వన్డే సిరీస్‌లోని ప్రతి మ్యాచ్‌ను గెలవాలనుకుంటున్నట్టు మూడో వన్డేకు ముందు శిఖర్ ధావన్ అన్నాడు. దాన్ని నిజం చేస్తున్నట్టుగా మూడో వన్డేలో కెప్టెన్ విరాట్ కోహ్లీ 34వ వన్డే సెంచరీ సాధించాడు. మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవాలనుకుంటున్నట్టు ధావన్ చెప్పినట్టుగానే కోహ్లీ కూడా అన్నాడు. ధావన్ గానీ, కెప్టెన్ కోహ్లీ గానీ ఇంత ధీమా చెప్పడానికి కారణం మణికట్టు స్పిన్నర్లు యజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్. ఇప్పటికే వీళ్లిద్దరు 21 వికెట్లు తీసుకున్నారు. కేప్‌టౌన్‌లో జరిగిన వన్డే మ్యాచ్‌కు సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్ ఐదుగురు స్థానిక మణికట్టు స్పిన్నర్ల బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసినప్పటికీ భారత స్పిన్ ద్వయాన్ని ఎదుర్కోలేకపోయారు. అయితే శనివారం నాటి మ్యాచ్‌లో కాస్త తేడా కనిపించనుంది. ఎందుకంటే వేలి గాయం కారణంగా తొలి మూడు మ్యాచ్‌లకు దూరమైన ఏబీ డివిలియర్స్ పూర్తిగా కోలుకున్నాడు. కానీ నాలుగో వన్డేకు అతడు అందుబాటులో ఉండేది లేనిది తెలియడం లేదు. ఒకవేళ డివిలియర్స్ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే మూడో స్థానంలో బరిలోకి దిగే అవకాశముంది. దీంతో జేపీ డుమిని నాలుగో స్థానంలో ఆడతాడు. డివిలియర్స్ తుది జట్టులో ఆడేందుకు డేవిడ్ మిల్లర్ లేదా ఖయ జొండోలలో ఎవరో ఒకరు తమ స్థానాన్ని త్యాగం చేయాల్సి ఉంటుంది. అయితే ఎవరు ఆడినా, ఆడకపోయినా ఈ మ్యాచ్‌లోనూ ఐడెన్ మార్క్రమ్ కెప్టెన్‌గా కొనసాగనున్నాడు.

హోమ్ సీజన్‌లో ఈ మ్యాచ్ సౌతాఫ్రికాకు చాలా ప్రాముఖ్యమైంది. ఎందుకంటే ఈ మ్యాచ్‌ను 'పింక్ వన్డే'గా ప్రకటించారు. బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవకాహన, ఆ రోగంతో బాధపడుతున్న వారికి సహాయార్థం ఈ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. తొలిసారి 2011లో పింక్ వన్డేను నిర్వహించగా.. ఇది ఆరో వన్డే. నిజానికి పింక్ జెర్సీలో బరిలోకి దిగిన సౌతాఫ్రికా ఇప్పటి వరకు ఓడిపోలేదు. పింక్ వన్డేల్లో డివిలియర్స్‌కు మంచి రికార్డు ఉంది. 2015లో వెస్టిండీస్‌పై 44 బంతుల్లో 149 పరుగులు చేశాడు. 2013లో తొలిసారి టీమిండియా ఈ పింక్ డే సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నప్పుడు డివిలియర్స్ 47 బంతుల్లో 77 పరుగులు సాధించాడు. వాండరర్స్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 4 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేయగా.. టీమిండియా 141 పరుగులతో ఓటమిపాలైంది. ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ డేల్ స్టెయిన్, మోర్నే మోర్కెల్ బౌలింగ్‌లో ఇబ్బంది పడ్డాడు. 43 బంతుల్లో 18 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ ఓపెనర్ ఇప్పటికీ అవే కష్టాలను ఎదుర్కొంటున్నాడు. మూడు డబుల్ సెంచరీలు చేసిన రోహిత్ శర్మ ఇప్పటి వరకు సౌతాఫ్రికా గడ్డపై 11 వన్డేలు ఆడాడు. అతని బ్యాటింగ్ సగటు 12.10గా ఉంది. రోహిత్ శర్మ ఫామ్‌లో లేకపోవడం టీమిండియాకు ఏకైక బాధాకరమైన అంశం. అయినప్పటికీ నాలుగో వన్డేలో రోహిత్ ఆడే అవకాశముంది.

సిరీస్‌ను నిర్ణయించే ఈ నాలుగో వన్డేలో పూర్వపు జట్టుతోనే కోహ్లీకి బరిలోకి దిగే అవకాశముంది. ఈ మైదానంలో టీమిండియా రికార్డు ఓ మోస్తరుగా ఉంది. మొత్తం ఏడు వన్డేలు ఆడగా మూడింటిలో గెలిచి నాలుగింటిలో ఓటమిపాలైంది. 2003 వరల్డ్ కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది కూడా ఇక్కడే. ఇక సౌతాఫ్రికాతో ఆడిన నాలుగు వన్డేలకు గాను మూడింటిలో టీమిండియా పరాజయంపాలైంది. అయితే టీమిండియా ఆనందించదగ్గ ఏకైక సంఘటన ఏంటంటే.. 2011 జనవరిలో జరిగిన ఉత్కంఠ మ్యాచ్‌లో టీమిండియా 1 పరుగుల తేడాతో గెలిచింది. మునాఫ్ పటేల్ 29 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. అయితే కోహ్లీ నిలకడగా రాణించడం, మణికట్టు స్పిన్నర్లు అసాధారణ ప్రతిభ కనబరుస్తుండడంతో టీమిండియా ఈ చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని సొంతం చేసుకునే అవకాశముంది.

రిచర్డ్స్ అంత కఠినుడు కోహ్లీ

వెస్టిండీస్ దిగ్గజం అల్విన్ కాళీచరణ్



న్యూఢిల్లీ: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ వెస్టిండీస్ దిగ్గజం సర్ వివ్ రిచర్డ్స్‌ను గుర్తు చేస్తున్నాడని ఆ జట్టుకు చెందిన మాజీ కెప్టెన్ అల్విన్ కాళీచరణ్ అన్నారు. ఓ ఆంగ్ల దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కాళీచరణ్ మాట్లాడుతూ.. తాను కెప్టెన్‌గా ఉన్నప్పుడు రిచర్డ్స్ ప్రత్యర్థి బౌలర్లను ఎంత నిర్దాక్షిణ్యంగా చితకబాదేవాడో కోహ్లీలోనూ అలాంటి ధోరణే కనిపిస్తోందని.. టీమిండియా కెప్టెన్‌లోనూ అవే లక్షణాలున్నాయని ఆయన అన్నారు. 'ఇద్దరి ధోరణి ఒక్కటే. ప్లేయర్స్‌ను ఒకరితో మరొకరిని పోల్చేందుకు ఇష్టపడని వారిలో నేను కూడా ఒకడ్ని. కానీ కోహ్లీ ధోరణి చూస్తుంటే.. వివ్ అంత కఠినుడుగా కనిపిస్తున్నాడు' అని ఆయన చెప్పారు. 1984 నుంచి 1991 మధ్య రిచర్డ్స్ 50 టెస్టు మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఈయన హయాంలోనే వెస్టిండీస్ జట్టు ఒక్క సిరీస్ కూడా ఓడిపోలేదు. తన హయాంలోని గొప్ప క్రికెటర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్న రిచర్డ్స్ చాలా దూకుడుగా ఆడావారు. కెప్టెన్ అయ్యాక అదే దూకుడును ప్రదర్శించాలని సహచరులకు కూడా చెప్పేవారు. 'కోహ్లీలోనూ అలాంటి లక్షణాలే కొన్ని ఉన్నాయి. అతను సక్సెస్‌ఫుల్ కెప్టెన్. అద్భుతమైన బ్యాట్స్‌మన్. ఎల్లప్పుడు పరుగుల దాహంతో ఉంటాడు. అతను స్థిరంగా రాణించడం అసాధారణం' అని కాళీచరణ్ అన్నారు. క్లైవ్ లాయిడ్ తర్వాత 1977-78లో జరిగిన కెర్రీ ప్యాకర్స్ వరల్డ్ సిరీస్ క్రికెట్‌కు కాళీచరణ్ వెస్టిండీస్ జట్టుకు నేతృత్వం వహించారు. 'కెప్టెన్సీకి కోహ్లీ కొత్త అర్థాన్ని చెప్పాడు. ఐదుగురు బ్యాట్స్‌మన్ లేదా ఐదుగురు బౌలర్లతో ఆడతాను అని చెప్పి దానికే కట్టుబడి ఉండే వాళ్లల్లో కోహ్లీ ఒకడు. కోహ్లీ సనాతన ఆచారాలను కొనసాగించేవాడు కాదు' అని కాళీచరణ్ చెప్పారు.

క్లీన్‌స్వీప్‌పై దృష్టి

నేడు ఇండియా, సౌతాఫ్రికా మహిళల చివరి వన్డే



పొచెఫ్‌స్ట్రూమ్: సిరీస్‌ను ఇప్పటికే సొంతం చేసుకున్న భారత మహిళల జట్టు సిరీస్‌పై కన్నేసింది. మరోవైపు ఈ మ్యాచ్‌లో గెలిచి పరువు కాపాడుకోవాలని సౌతాఫ్రికా భావిస్తోంది. ఇండియా, సౌతాఫ్రికా మధ్య శనివారమిక్కడ చివరి, మూడో వన్డే జరగనుంది. గతేడాది వరల్డ్ కప్ టోర్నీలో భారత జట్టును ఓడించిన సౌతాఫ్రికా మహిళల జట్టు సొంత గడ్డపై మిథాలీ సేనను ఎదుర్కోలేకపోతోంది. సౌతాఫ్రికా బ్యాటింగ్ పూర్తిగా విఫలమైంది. తొలి రెండు వన్డేల్లో 125, 124 పరుగులకు ఆలౌటైంది. మరోవైపు సౌతాఫ్రికా మహిళలను భారత పేస్, స్పిన్నర్లు ఇబ్బంది పెట్టారు. తొలి మ్యాచ్‌లో ఝులన్ గోస్వామి, రెండో వన్డేలో లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ దెబ్బ తీశారు. ఇతర బౌలర్లు కూడా జట్టుకు తమవంతు సహకారం అందించారు. బుధవారం జరిగిన రెండో వన్డేలో గోస్వామి 200 వికెట్లు తీసి ఈ ఘనత సాధించిన తొలి మహిళా బౌలర్‌గా రికార్డుల్లోక్కెంది. మరోసారి సత్తా చాటి సిరీస్‌ను ముగించాలని భావిస్తోంది. ఓపెనర్ స్మృతి మంధన కూడా బ్యాటింగ్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచింది. తొలి వన్డేలో 84, రెండో వన్డేలో 135 పరుగులు చేసింది. చివరి, మూడో వన్డేలోనూ జట్టుకు కీలకమైన భాగసామ్యాన్ని అందించాలని భావిస్తోంది. అయితే ఇప్పటి వరకు చెప్పుకోదగిన స్కోరు చేయలేకపోయిన మరో ఓపెనర్ పూనమ్‌రౌత్ ఈ మ్యాచ్‌లో సత్తా చాటేందుకు సిద్ధమైంది. తొలి వన్డేల్లో విఫలమైన ప్రమాదకర బ్యాట్స్‌వుమెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, వేద కృష్ణమూర్తి రెండో వన్డేలో అర్థ సెంచరీలతో అదరగొట్టారు. రెండు వన్డేల్లో పేలవ ఆటతీరుతో విమర్శలపాలైన సౌతాఫ్రికా మహిళల చివరి వన్డేలోనైనా గెలిచి పరువు నిలుపుకోవాలని భావిస్తున్నారు. ఓపెనర్ లిజెల్లీ లీ (73) మినహా మిగిలిన వాళ్లెవ్వరూ రాణించలేకపోయారు. దీంతో ఈ మ్యాచ్‌లో సత్తా చాటి జట్టును వైట్‌వాష్ నుంచి కాపాడేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు రెండో వన్డేలో 300 పరుగులు సమర్పించుకున్న సౌతాఫ్రికా బౌలర్లు ఈసారి ఉత్తమ బౌలింగ్ వేయాలని భావిస్తున్నారు. రెండో వన్డేలో ఆరుగురికిగాను నలుగురు బౌలర్లు ఓవర్‌కు 6కుపైగా పరుగులు ఇచ్చారు.

భారత పారా సైకిస్టలకు పతకాలు

ఏషియన్ పారా-సైక్లింగ్ పోటీలు



మయన్మార్: ఏషియన్ పారా-సైక్లింగ్ పోటీల్లో భారత సైక్లిస్టులు తమ ఆధిక్యాన్ని ప్రదర్శించారు. శుక్రవారం జరిగిన పోటీల్లో భారత జట్టుకు మూడు (1 రజత, 2 కాంస్య) పతకాలు వచ్చాయి. గతేడాది రజత పతక విజేత, బెంగళూరుకు చెందిన దివిజ్ షా భారత్‌కు శుభారంభాన్నిచ్చాడు. పారా-సైక్లింగ్ కేటగిరిలో మరో రజతం గెలిచాడు. కాగా బీఎస్ఎఫ్ సైనికుడు హరిందర్ సింగ్ కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. గతేడాది కూడా హరిందర్ కాంస్య గెలిచాడు. కాగా అరంగేట్ర సైక్లిస్ట్ మధు బగ్రి హ్యాండ్-సైక్లింగ్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. హ్యాండ్ సైక్లింగ్‌లో భారత్‌కు పతకం అందించిన తొలి పారా-సైక్లిస్ట్‌గా బగ్రి నిలిచాడు.

కర్రసాముకు పూర్వ వైభవం తెస్తాం

తెలంగాణలో విస్తృత ప్రచారం • కర్రసాము క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం • శిలాంబమ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు రాజేంద్రన్



హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం ప్రతినిధి): అత్యంత ప్రాచీనమైన కర్రసాము(శిలాంబమ్) క్రీడకు విస్తృత ప్రచారం కల్పించేలా కృషి చేస్తున్నామని శిలాంబమ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు రాజేంద్రన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్రసాము క్రీడాకారులకు తెలంగాణలో ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. కాకతీయులు, చోళులు, పాండ్యులు, చాళుక్యులతో పాటు భారత దేశాన్ని పాలించిన ప్రముఖ రాజుల కాలంలో ఈ క్రీడా విభాగంలో పోటీలు జరిగేవన్నారు. కర్రసాము క్రీడకు 5వేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉందని చెప్పారు. ప్రస్తుతం 9 దేశాల్లో ఈ క్రీడను ఆయా ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. మన దేశంలో 22 రాష్ట్రాల్లో కర్రసాము క్రీడ జరుగుతోందన్నారు. తెలంగాణలో కర్రసాముకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తమ వంతు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బ్రిటీష్ పాలనలో ఈ క్రీడను నిషేధించారని చెప్పారు.

తమిళనాడు ప్రభుత్వం కర్రసాము క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తుందన్నారు. మొదటగా హైదరాబాద్, తర్వాత జిల్లా కేంద్రాల్లో కర్రసాము క్రీడపై విద్యార్థి, యువతకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. రెండు రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. సాంప్రదాయ క్రీడైన కర్రసాము ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. మే, జూన్ మాసాల్లో నిర్వహించే సీఎం కప్ క్రీడల్లో కర్రసామును చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. తెలంగాణ కర్రసాము కమిటీ అధ్యక్షులుగా తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ పి. రామ్‌మోహన్‌రావ్ వ్యవహరించనున్నారు. కర్రసాము క్రీడకు గ్రామ స్థాయి నుంచి విస్తృత ప్రచారం కల్పిస్తామని రామ్‌మోహన్‌రావ్ తెలిపారు. ఈ నెల 11న 60 మందితో కర్రసాము క్రీడను ప్రదర్శించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని చెప్పారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.